ANDHRAJYOTHY
ఆంధ్రజ్యోతి
3
శ్రీ పొట్టిశ్రీరాములు
నెల్లూరు
జిల్లా వార్తలు
మంగళవారం 9 జూలై 2024





అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆనంద్

భక్తులకు ఏలోటూ రానీయొద్దు!

- రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు చేయండి
- అధికారుల సమీక్షలో కలెక్టర్ ఆనంద్ ఆదేశం

నెల్లూరు (సాంస్కృతికం) జూలై 8 : బారాషహీద్ దర్గాలో జరిగే రొట్టెల పండుగకు అన్ని ఏర్పాట్లు సక్రమంగా చేయాలని సంబంధిత శాఖల అధికారులను కలెక్టర్ ఆనంద్ ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో రొట్టెల పండుగ ఏర్పాట్లపై కార్పొరేషన్ కమిషనర్ వికాస్ మర్మత్‌తో కలిసి వివిధ శాఖల అధికారులతో కలెక్టర్ సమీక్షించారు. ఈ నెల 17న ప్రారంభమయ్యే రొట్టెల పండుగ 21వ తేదీతో ముగుస్తుందన్నారు. దేశ వ్యాప్తంగా దాదాపు 15లక్షలకు పైగా భక్తులు హాజరయ్యే ఈ పండుగకు ఎటువంటి లోటుపాట్లు లేకుండా అన్ని ఏర్పాట్లు చేయాలని సూచించారు. దర్గా పరిసర ప్రాంతాలు, ఘాట్లు, పార్కింగ్ ప్రదేశాల్లో శానిటేషన్‌కు అత్యంత ప్రాధాన్యత ఇవ్వాల న్నారు. రద్దీకి అనుగుణంగా బ్యారికేడ్ ఏర్పాట్లు చేయాలని, వివిధ శాఖలకు కేటాయించిన పనులు నిర్ణీత గడువులోగా పూర్తి చేయాలన్నారు. పండుగ రోజుల్లో నెల్లూరు నగరంలో ట్రాఫిక్ అంతరాయాలు కలగకుండా తగిన చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన సందర్భాల్లో ఇతర జిల్లాల నుంచి కూడా పోలీసు లను రప్పించాలన్నారు. 24గంటలూ అందుబాటులో ఉండే విధంగా స్పెషలిస్ట్ డాక్టర్లతో కూడిన వైద్య బృందాలు, 108 అంబులెన్స్‌లను అందుబాటులో ఉంచాలన్నారు. పండుగకు వచ్చే భక్తులు జిల్లాలోని ప్రసిద్ధ కసుమూరు, ఏఎస్‌పేట దర్గాలను సందర్శించే అవకాశం ఉన్నందున, ఆయా ప్రాంతాల్లో శానిటేషన్, తాగునీటి సౌకర్యం కల్పించాలన్నారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ సౌజన్య, ఇన్‌చార్జ్ డీఆర్‌ఓ పద్మావతి, ఇతర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఏర్పాట్ల పరిశీలన

బారాషహీద్ దర్గా ప్రాంగణాన్ని కమిషనర్ వికాస్‌మర్మత్‌తో కలిసి కలెక్టర్ ఆనంద్ పరిశీలించారు. స్వర్ణాల చెరువులో నీటి మట్టం పెంచాలని అధికారులకు సూచించారు. అనంతరం షవర్ బాత్‌కు జరుగుతున్న ఏర్పాట్లను పరిశీలించారు. దర్గాకు ఇరువైపులా నిర్మించిన అక్రమ కట్టడాలను కలెక్టర్ దృష్టికి మైనార్టీ నాయకులు తీసుకెళ్లారు. దర్గా కమిటీ చర్చించుకుని అక్రమ కట్టడాలను తొలగించాలని సూచించారు. అనంతరం ఆయన విలేకరులతో మాట్లాడుతూ దర్గాలతో భక్తుల కోసం సివిల్ వర్క్‌లకే రూ.4కోట్లు ఖర్చు చేస్తున్నట్లు చెప్పారు. మైనారిటీ నాయకులు షంషుద్దీన్, సమీహుస్సేన్, షేక్.ఖాదర్‌బాషా, అధికారులు పాల్గొన్నారు.

మొదలైన భక్తుల రాక

ఆదివారం మొహర్రం మాసం ప్రారంభం కావడంతో జిల్లాకు సుదూర ప్రాంతాల నుంచి భక్తులు రాక మొదలైంది. నాగపూరు, బెంగళూరు, కడప, అనంతపురం, చెన్నై తదితర ప్రాంతాల నుంచి భక్తులు తరలివచ్చి స్వర్ణాల ఘాట్‌లో స్నానాలు చేసి బారాషహీద్‌లను దర్శించుకున్నారు.

మర్రిపాడు : చలానా రశీదుపై వినియోగదారుడితో సంతకం చేయిస్తున్న ఆత్మకూరు ఆర్డీవో మధులత



ప్రజలకు భారీ ఊరట!

- ప్రారంభమైన ఉచిత ఇసుక విధానం
- ఇప్పుడు మూడు రీచ్‌లలో.. రెండు నెలల్లో అన్నింటా!
- డిజిటల్ చెల్లింపులతో పారదర్శకతకు శ్రీకారం

టన్ను ఇసుక ధర ఇలా..

స్టాక్‌యార్డు	పాతధర	ప్రస్తుతం
మర్రిపాడు	723	370
మినగల్లు	650	370
పల్లిపాడు	650	370

నెల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : ఎన్డీయే ప్రభుత్వం ఎన్నికల సమయంలో ఇచ్చిన ఉచిత ఇసుక హామీని నెరవేరుస్తూ ప్రజలకు భారీ ఊరట కల్పించింది. జిల్లాలో ఉచిత ఇసుక విధానం సోమవారం ప్రారంభమైంది. గత ప్రభుత్వంలో జరిగిన దోపిడీకి తెరదించుతూ పారదర్శకంగా ఇసుకను అందించేలా ఏర్పాట్లు చేశారు. రీచ్‌లకు పర్యావరణ అనుమతులు లేకపోవడంతో తొలుత యార్డుల్లో ఉన్న ఇసుకను పేదలకు అందిస్తున్నారు. తొలిరోజున పల్లిపాడు, మినగల్లు, మర్రిపాడు ప్రాంతాల్లోని యార్డుల్లో ఉచిత ఇసుక విధానం మొదలైంది. పల్లిపాడు, మినగల్లు యార్డుల్లో విక్రయాలను కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ప్రారంభించారు. మర్రిపాడు యార్డులో ఆత్మకూరు ఆర్డీవో మధులత, మైనింగ్ డీడీ శ్రీనివాసకుమార్‌లతో కలిసి విక్రయాలు ప్రారంభించారు. ఈ మూడు యార్డుల్లో కలిపి 1.75 లక్షల మెట్రిక్ టన్నుల ఇసుక అందుబాటులో ఉంది. టన్ను ఇసుక ధరను రూ.370గా నిర్ణయించారు. రీచ్‌ల నుంచి ఈ యార్డులకు తరలించిన రవాణా చార్జీలను కూడా ఇందులో కలిపారు. అయితే పర్యావరణ అనుమతులు వచ్చాక రీచ్‌ల వద్దనే ఇసుక విక్రయాలు మొదలవుతాయి. అప్పుడు టన్ను ఇసుక ధర మరింత తగ్గే అవకాశాలు ఉన్నాయి. గత ప్రభుత్వంలో ఇసుక విక్రయాలకు ఒక లెక్క, పక్కా లేకుండా పోయింది. తెల్లకాగితాల మీద బిల్లులు ఇచ్చేవారు. డిజిటల్ చెల్లింపులకు అవకాశం ఉండేది కాదు. కానీ ప్రస్తుతం ప్రభుత్వం అత్యంత పారదర్శకంగా ఇసుక విక్రయాలను చేపట్టాలని నిర్ణయించింది. అంతా ఆన్‌లైన్ ద్వారా విక్రయాలు జరపాలని ఆదేశించింది. దీంతో అధికారులు మూడు యార్డుల్లోనూ డిజిటల్ చెల్లింపునకు స్కానర్లను అందుబాటులో ఉంచారు. కొనుగోలుదారులు పేమెంట్ చేయగానే ఆన్‌లైన్ బిల్లులు జనరేట్ చేసి ఇస్తున్నారు. కాగా ఉచిత ఇసుక విధానం అమల్లోకి రావడంతో తొలి రోజే ఇసుక కోసం వాహనాలు యార్డుల వద్ద బారులు తీరడం విశేషం.

ఉచితంగా అందిస్తున్నాం : డీడీ

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లాలో 3 స్టాక్ యార్డుల ద్వారానే ఉచితంగా ఇసుకను అందిస్తున్నట్లు మైనింగ్ శాఖ డీడీ శ్రీనివాసకుమార్ ఒక ప్రకటనలో తెలిపారు. రెండు నెలల్లో జిల్లాలోని అన్ని రీచ్‌లలో ఇసుక విక్రయాలు ప్రారంభిస్తామని తెలిపారు. అప్పుడు మరింత చౌకగా కేవలం కూలీల ఖర్చులతో అందిస్తామని వివరించారు.





వాదులాడుకుంటున్న పొదుపు మహిళలు

మా డబ్బులు ఏం చేశారు?

- వైసీపీ కార్యక్రమాలకు ఎలా ఖర్చు చేస్తారు?
- ఇప్పుడు నష్టాలని ఎలా చెబుతారు!
- టీఎల్‌ఎఫ్‌లను నిలదీసిన పొదుపు మహిళలు
- తీవ్ర వాగ్వివాదం.. బాహాబాహీకి దిగిన వైనం

నెల్లూరు (హరనాథపురం), జూలై 8 : 'మహిళా మార్టు పేరుతో మా దగ్గర వసూలు చేసిన నగదు ఏమైంది? వైసీపీ కార్యక్రమాలకు ఎలా వాడతారు? ఇప్పుడు నష్టాల పేరుతో మమ్మల్ని మోసం చేస్తారా!? ఇప్పటివరకు జరిగిన లావాదేవీల లెక్కలు చూపండి?' అంటూ పొదుపు మహిళలు నిలదీయడంతో ఉద్రిక్త పరిస్థితి నెలకొంది. నగరంలోని డైకస్‌రోడ్డు (పొదలకూరు రోడ్డు) సెంటర్‌లో ఏర్పాటు చేసిన మహిళా మార్టులో నిధులు స్వాహాపై పొదుపు మహిళలు 'నువ్వా నేనా' అన్న రీతిలో వాదులాటకు దిగారు. పెద్దల కొలువు వద్ద సోమవారం జరిగిన టౌన్‌లెవల్ ఫెడరేషన్ల (టీఎల్‌ఎఫ్) సమావేశంలో పొదుపు మహిళలు భారీగా పాల్గొన్నారు. ఒక్కో పొదుపు గ్రూపు నుంచి సుమారు రూ.1500 వంతున రూ.16 లక్షల వరకు వసూలు చేసి, ఎన్నికల ముందు ఈ మహిళా మార్టును ఏర్పాటు చేసినట్లు సమాచారం. కార్పొరేషన్ పరిధిలో 9 టీఎల్‌ఎఫ్‌లు ఉంటే కేవలం టీఎల్‌ఎఫ్-1, 5లు మహిళా మార్టు ఏర్పాటు చేసినట్లు సమచారం. డైకస్ రోడ్డు వద్ద అన్న క్యాంటీన్‌లో ఈ మహిళా మార్టును ఏర్పాటు చేశారు. అయితే టీడీపీ అధికారంలోకి రావటంతో అన్నక్యాంటీన్లు మళ్లీ ప్రారంభం కానున్నాయి. ఈ పరిస్థితుల్లో మెప్మా మహిళా మార్టు తరలింపు తప్పనిసరి అయ్యింది. ఈ నేపథ్యంలో పొదుపు సంఘాల సభ్యులతో సోమవారం పెద్దల కొలువులో టీఎల్‌ఎఫ్-1, 5లకు సంబంధించి పొదుపు గ్రూపు అధ్యక్షుల సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో మహిళా మార్టు ఏర్పాటుకు ఎంత ఖర్చు చేశారనే అంశమై మహిళల మధ్య వాగ్వాదం జరిగింది. గతంలో అధికారంలో ఉన్న పార్టీ కార్యక్రమాలకు అనవసరంగా ఖర్చు చేశారని ఆరోపించారు. ఖర్చు వివరాలు తెలపాలని కొందరు పట్టుబట్టడంతో గందరగోళం నెలకొంది. ఒకానొక దశలో మహిళలు బాహాబాహీకి దిగారు. అయితే, టీఎల్‌ఎఫ్‌కు చెందిన వారు సమాధానమిస్తూ మహిళా మార్టు ద్వారా రూ.8.5లక్షలకు పైగా నష్టం వాటిల్లిందని చెప్పినట్లు తెలిసింది. దీంతో మిగిలినవారిలో ఆగ్రహం కట్టలు తెంచుకుంది. టీఎల్‌ఎఫ్-1, 5 అధ్యక్షులనూ వైసీపీకి చెందిన వారుగా పొదుపు మహిళలు చెప్పారు. నష్టపోయిన మహిళలకు తెలుగుదేశానికి చెందిన పొదుపు మహిళలు అండగా నిలబడి మాట్లాడారు. మొత్తం మీద సమావేశం రసాభాసగా మారింది. చివరకు పోలీసులు రంగప్రవేశం చేసి పరిస్థితి సర్దుబాటు చేశారు.

ఆహ్లాదకరంగా నగర వనాలు

- పనులు నాణ్యతగా చేపట్టండి
- జిల్లా అధికారులకు సీసీఎఫ్ ఆదేశం

నెల్లూరు (వెంకటేశ్వరపురం)జూలై 8 : పట్టణవాసుల కోసం చేపడుతున్న నగరవనాలలో ఆహ్లాదం ఉట్టిపడేలా తీర్చిదిద్దాలని అటవీ శాఖ గుంటూరు రేంజ్ సీసీఎఫ్ (చీఫ్ కన్జర్వేటర్ ఆఫ్ ఫారెస్ట్) వై శ్రీనివాసరెడ్డి జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా నగర ప్రాంతాల్లో జరుగుతున్న నగరవనాల పనుల పురోగతిని సీసీఎఫ్ పరిశీలించారు. ముందుగా కావలి ప్రాంతంలో నగరవనాన్ని పరిశీలించారు. కావలివాసులకు ఎంతో ఆహ్లాదకంగా నగరవనాన్ని ఎలా తీర్చిదిద్దాలన్న దానిపై జిల్లా అధికారులకు పలు సూచనలు చేశారు. అనంతరం నెల్లూరు సమీపంలోని కొత్తూరు, వెంకటాచలం ప్రాంతాల్లో రూపుదిద్దుకొంటున్న నగరవనాలను కూడా ఆయన పరిశీలించారు. పనులను నాణ్యతగా చేయాలని, అదేవిధంగా ప్రజలకు అన్నీ సౌకర్యాలు కల్పించేలా చర్యలు చేపట్టాలని సీసీఎఫ్ ఆదేశించారు. జిల్లా అటవీశాఖ అధికారి చంద్రశేఖర్,రేంజర్‌లు మాల్యాద్రి పలువురు అధికారులు పాల్గొన్నారు.

అటవీ శాఖలో ఇద్దరికి పదోన్నతులు



మాల్యాద్రి

జిల్లా అటవీశాఖలో పదోన్నతులతో పాటు బదిలీలు జోరుగా సాగుతున్నారు. రెండు రోజుల క్రితం ఎఫ్ఎస్‌వోలు (ఫారెస్ట్ సెక్షన్ అధికారి) పదోన్నతులు పొందగా తాజాగా ఇద్దరు డీఆర్‌వోలకు రేంజర్లుగా పదోన్నతి కల్పిస్తూ రాష్ట్ర పీసీసీఎఫ్ చిరంజీవి చౌదరి ఉత్తర్వులు ఇచ్చారు. నెల్లూరు ఇంచార్జ్ రేంజర్‌గా విధులు నిర్వహిస్తున్న డీఆర్‌వో (డిప్యూటీ రేంజ్ అధికారి) ఎస్ మాల్యాద్రి రేంజర్‌గా పదోన్నతి లభించింది. దీంతో ఆయన్ను కావలి రేంజర్‌గా పోస్టింగ్ ఇచ్చారు. అదే విధంగా ఆత్మకూరు డీఆర్‌వో సీ మాధవరావుకు రేంజర్‌గా పదోన్నతి లభించింది. గుంటూరు జిల్లా వినుకొండ రేంజర్‌గా ఆయన్ను బదిలీ చేశారు.

'సెంట్రల్' ఈఈ.. పోస్ట్ కోసం పోటీ!

- ఇక్కడకు వచ్చేందుకు అనేక మంది ప్రయత్నాలు
- పోటీ పడుతున్న ఇద్దరు వివాదాస్పద అధికారులు
- మంత్రులు, ఎమ్మెల్యేల చుట్టూ ప్రదక్షిణలు
- డీఈతోపాటు ఈఈ పోస్టు ఇన్‌చార్జ్ కావాలట!
- రెగ్యులర్ ఈఈ లేకపోతే నిర్వహణ కష్టమే

నెల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇరిగేషన్ సర్కిల్‌లో అత్యంత కీలకమైనది నెల్లూరు సెంట్రల్ డివిజన్. మొత్తం ఐదు డివిజన్లు ఉన్నా అందులో అతిపెద్ద డివిజన్ సెంట్రల్ డివిజనే! ఉమ్మడి జిల్లా మొత్తంలో దాదాపు 6 లక్షల ఎకరాలకుపైగా సాగు విస్తీర్ణం ఉండగా ఈ సెంట్రల్ డివిజన్ పరిధిలోనే 3.50 లక్షల ఎకరాలకు పైగా ఆయకట్టు ఉంది. ప్రతి ప్రభుత్వంలోనూ రూ.వందల కోట్ల పనులు జరుగుతుంటాయి. సర్వేపల్లి, నెల్లూరు రూరల్, నెల్లూరు సిటీ, కోవూరు, ఆత్మకూరు, కావలి నియోజకవర్గాలు సెంట్రల్ డివిజన్ పరిధిలో ఉన్నాయి. ఇంతటి కీలకమైన డివిజన్‌కు ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్‌గా వచ్చేందుకు పలువురు తీవ్ర ప్రయత్నాలు చేస్తున్నారు. అందులోనూ ఇద్దరు అధికారుల మధ్య పోటీ తీవ్రంగా ఉన్నట్లు ఆ శాఖలో చెప్పుకుంటున్నారు. డీఈఈ స్థాయి కలిగిన ఈ అధికారులకు, నెల్లూరు డీఈతోపాటు సెంట్రల్ డివిజన్ ఇన్‌చార్జి ఈఈ పోస్టు కూడా కావాలంటూ తమ శక్తులన్నీ ఉపయోగిస్తున్నారు. టీడీపీ నాయకులు కొందరు ఒక డీఈఈకి, మరికొందరు ఇంకో డీఈఈకి సపోర్టుగా ఎమ్మెల్యేల వద్దకు తీసుకెళుతున్నారు. అయితే ఈ ఇద్దరు అధికారులూ వివాదాస్పదులు కావడం గమనార్హం.

పని కోసమా.. పనుల కోసమా!?

డెల్టా ప్రాంతమైన సెంట్రల్ డివిజన్ పరిధిలో అన్ని నియోజకవర్గాలను సమన్వయం చేసుకుంటూ కాలువలను బాగు చేస్తూ రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాల్సిన బాధ్యత ఈఈపై ఉంది. అయితే వైసీపీ ప్రభుత్వంలో రూ.వందల కోట్లు ఖర్చు చేసినట్లు చూపించినా కాలువల్లో పూడిక కూడా తీసిన దాఖలాలు కనిపించడం లేదు. పనులు చేయకనే బిల్లులు తినేశారని ప్రస్తుత ఎమ్మెల్యేలు ప్రతిపక్షంలో ఉన్నప్పటి నుంచీ ఆరోపిస్తూ వస్తున్నారు. సెంట్రల్ డివిజన్ నుంచి కొందరు ఫైళ్లు మాయం చేస్తున్నారని ఇటీవల ఎమ్మెల్యేలకు సమాచారం అంద డంతో వెంటనే కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో డీఆర్వో సెంట్రల్ డివిజన్ కార్యాలయాన్ని తనిఖీ చేసి రికార్డులను పరిశీలించి వెళ్లడం అక్కడి పరిస్థితికి అద్దం పడుతోంది. ఈ నేపథ్యంలో సెంట్రల్ డివిజన్‌కు ఇన్‌చార్జ్ అధికారులను కాకుండా రెగ్యులర్ ఈఈని నియమించాల్సిన అవసరముంది. ఇతర జిల్లాల్లో పనిచేస్తున్న ఉత్తమ అధికారులను సెంట్రల్ డివిజన్‌కు తీసుకొస్తే కానీ ఇక్కడ పరిస్థితులు మారవని రైతులే అభిప్రాయపడుతున్నారు.

ఆ ఇద్దరి మధ్యే పోటీ

సెంట్రల్ డివిజన్ పరిధిలో సర్వేపల్లి కాలువ ఆధునికీకరణ, జాఫర్ సాహెబ్ కాలువ ఆధునికీకరణ, పెన్నా పొర్లు కట్టల నిర్మాణం, సర్వేపల్లి రిజర్వాయర్ ఆధునికీకరణ, ముదివర్తి కాజ్‌వే నిర్మాణం, ఇతర ప్యాకేజీ వర్కులు కలుపుకుంటే రూ.500 కోట్లకుపైగా వర్కులు జరుగుతున్నాయి. ఈ క్రమంలో ఇద్దరు డీఈఈ స్థాయి అధికారులు సెంట్రల్ డివిజన్ ఈఈ పోస్టు కోసం తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. ఇందులో ఓ అధికారి ప్రస్తుతం ఆత్మకూరు డివిజన్‌లో పనిచేస్తున్నారు. వైసీపీ ప్రభుత్వంలో అక్కడ ఐదేళ్లపాటు లేఅవుట్లకు చెరువుల మట్టిని అమ్ముకున్నారన్న ఆరోపణలను మూటగట్టుకున్నారు. లేఅవుట్లలో కాలువలకు ఇష్టారీతిన ఎన్‌వోసీలు కూడా జారీ చేశారు. తూతూమంత్రంగా పనులు చేసి బిల్లులు పెట్టారన్న అభియోగాలు కూడా ఉన్నాయి. వైసీపీ నాయకులతో అంటకాగిన ఆ అధికారి వ్యవహారాలు మంత్రి ఆనం రామనారాయణ దృష్టికి వెళ్లడంతో ఇటీవల జరిగిన ఓ సమావేశంలో ఆయన నేరుగా ప్రస్తావించారు. సదరు అధికారి పనితీరుపై మంత్రి ఆగ్రహం వ్యక్తం చేయడంతో ఇక ఆత్మకూరులో కష్టమనుకున్న ఆ అధికారి ఇప్పుడు సెంట్రల్ డివిజన్ కోసం పట్టుబడుతున్నారు. ఈ అధికారిపై ఇసుకను అమ్ముకున్నారన్న కేసుల్లో విజిలెన్స్ విచారణ కూడా జరగడం గమనార్హం. అదే సమయంలో గతంలో బుచ్చిలో పనిచేసి ఇప్పుడు సోమశిల ప్రాజెక్టులో పనిచేస్తున్న మరో అధికారి కూడా సెంట్రల్ డివిజన్ ఇన్‌చార్జ్ ఈఈ పోస్టు కోసం ఎమ్మెల్యేల చుట్టూ తిరుగుతు న్నారు. ఈయన పనిచేసిన చోటల్లా వివాదాలకు కేరాఫ్‌గా మారుతుండడం గమనార్హం. వీరిద్దరు ఇక్కడ రైతులకు పనిచేయడం కోసం కన్నా పర్సంటేజీల కోసమే ఎక్కువ ఆరాటపడుతున్నట్లు గుసగుసలు వినిపిస్తున్నాయి. ఇటువంటి వారి చేతుల్లో సెంట్రల్ డివిజన్‌ను పెడితే రైతులకు అవస్థలు తప్పవని ఆ శాఖ ఇంజనీర్లే చెప్పుకుంటుండడం కొసమెరుపు.





రద్దయిన రైళ్ల వివరాలు

రైలు నెం.	ప్రారంభం	ముగింపు	రద్దు తేదీలు
07500	విజయవాడ	గూడూరు	15 నుంచి 30
07458	గూడూరు	విజయవాడ	16 నుంచి 31
07461	విజయవాడ	ఒంగోలు	16 నుంచి 30
07576	ఒంగోలు	విజయవాడ	16 నుంచి 30
12744	విజయవాడ	గూడూరు	15 నుంచి 30
12743	గూడూరు	విజయవాడ	16 నుంచి 31
17259	గూడూరు	విజయవాడ	16, 23, 30
17260	విజయవాడ	గూడూరు	16, 23, 30
22708	తిరుపతి	విశాఖపట్నం	14, 21, 28
22707	విశాఖపట్నం	తిరుపతి	15, 22, 29

నెల్లూరు మీదుగా వెళ్లే పది రైళ్ల రద్దు

- మరో నాలుగు దారిమళ్లింపు
- ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు..

నెల్లూరు (వెంకటేశ్వరపురం) : జిల్లా మీదుగా వెళ్లే పది రైళ్లను ఈ నెల 15 నుంచి 30వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్లు దక్షిణ మధ్య రైల్వే విజయవాడ పీఆర్‌వో మధుప్కర్ ఒక ప్రకటనలో తెలిపారు. విజయవాడ - గూడూరు మధ్య మూడవ రైల్వేలైను ఇంటర్‌లాకింగ్ పనులు జరుగుతున్న నేపథ్యంలో ఈ నిర్ణయం తీసుకున్నట్లు తెలిపారు. అలాగే ఎర్నాకుళం-హౌరా (22878), సత్రగంచి - తాంబరం (22841), హౌరా - బెంగళూరు (22863), మదురై - నిజాముద్దీన్ (12651) రైళ్లను దారి మళ్లించినట్లు తెలిపారు. మరో దాదాపు 29 రైళ్ల సమయాన్ని మార్పు చేసినట్లు పేర్కొన్నారు. ఈ రైళ్ల మార్పులను గమనించి ప్రయాణికులు సహకరించాలని కోరారు.

సమస్యల్లో రాళ్లపాడు

- వైసీపీ పాలనలో నిరాదరణకు గురైన ప్రాజెక్టు
- పూడికతీతకు నోచని కాలువలు
- వంతెన రోడ్డుకిరువైపులా పెరిగిన చిల్లచెట్లు
- ఏళ్లతరబడి వేధిస్తున్న సిబ్బంది కొరత
- సమస్యలు పరిష్కరించాలంటున్న ఆయకట్టు రైతులు


లింగసముద్రం, జూలై 8 : నాలుగు మండల్లాలోని ప్రజలకు సాగు, తాగునీటిని అందిస్తున్న రాళ్లపాడు ప్రాజెక్టు సమస్యల సుడిగుండంలో చిక్కుఉంది. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఈ ప్రాజెక్టు నిరాదరణకు గురైంది. దీంతో ఆయకట్టు రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు రెండుసార్లు నిండితే గానీ అధికార, అనధికారికంగా ఉన్న 25 వేల ఎకరాల్లో పంటలు పండవు. ఈ సమస్య పరిష్కారానికి సోమశిల ఉత్తర కాలువ నుంచి నీరు రావడం లేదు. ప్రస్తుతం కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ప్రాజెక్టు సమస్యలను పరిష్కరించి ఆయకట్టు రైతాంగాన్ని ఆదుకోవాలని రైతులు కోరుతున్నారు.

బలహీనంగా కౌంటర్ వెయిట్లు

ప్రాజెక్టులోని పాత స్పిల్‌వేలోని గేట్లను ఆపరేట్ చేసేందుకు ఏర్పాటు చేసిన కౌంటర్ వెయిట్లు బలహీనంగా ఉన్నాయి. దీంతో ఈ స్పిల్‌వేలోని 10 గేట్లను, 2 పూడుగేట్లను ఆపరేట్ చేయడం లేదు. ఈ కౌంటర్ వెయిట్లు తెగి పడతాయనే కారణంతో అధికారులు వీటిని ఆపరేట్ చేయడం లేదు. ఈ స్పిల్‌వే నుంచి లక్ష క్యూసెక్కుల వరద నీటిని మన్నేరుకు విడుదల చేసే సామర్థ్యం ఉంది. కాగా కొత్త స్పిల్‌వేలోని ఐదు గేట్ల నుంచి 1.70 లక్షల క్యూసెక్కుల వరద నీటిని మన్నేరుకు విడుదల చేసే సామర్థ్యం ఉంది.కానీ అంతకు మించి వరద నీరు పరిస్థితిని ఏమిటన్నది రైతుల ప్రశ్న. అలాగే ఈ స్పిల్‌వే నిర్మాణం జరిగిన 2000లో స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటు కోసం కట్టడాలు నిర్మించారు. వాటిని ఏర్పాటు చేయలేదు.



ఐదేళ్లుగా నిరాదరణకు గురైన రాళ్లపాడు ప్రాజెక్టు



కొత్త స్పిల్‌వేలో స్టాప్‌లాక్ గేట్లు ఏర్పాటు చేయని వైనం

పొడిగింపునకు నోచని ఎడమ కాలువ

ప్రాజెక్టు ఎడమ కాలువ పొడిగింపు పనులు ఎక్కడ వేసిన గొంగడి అక్కడే అన్నట్టుగా ఉన్నాయి. రెండేళ్లక్రితం అప్పటి సీఎం జగన్మోహన్‌రెడ్డి ఈ కాలువ పొడిగింపు పనులకు రూ.27 కోట్లు మంజూరు చేస్తున్నట్టు ప్రకటించారు.కానీ అధికారులు రూ.32 కోట్లు కావాలని ప్రతిపా దనలు పంపించారు. అయితే ప్రభుత్వం నిధులు మంజూరు చేయలేదు.దీంతో కాలువ పనులు సాగలేదు. ఇకపోతే ప్రాజెక్టు కుడి ఎడమ కాలువ పూడికతీతకు నోచుకోలేదు. ప్రాజెక్టు వంతెన రోడ్డుకు ఇరువైపులా చిల్లచెట్లు ఏపుగా పెరిగాయి.ఇవి ప్రాజెక్టు కట్టకు ఇబ్బందిగా మారాయి.

వేధిస్తున్న సిబ్బంది కొరత

ప్రాజెక్టులో ఏళ్ల తరబడి సిబ్బంది కొరత వేధిస్తోంది.ప్రస్తుతం ఇద్దరు డీఈలు, నలుగురు ఏఈలు, డిప్యూటేషన్‌పై వచ్చిన ఇద్దరు లస్కర్లు మాత్రమే ఉన్నారు.అటెండర్లు, వ్యాచ్‌మన్లు లేరు.వాస్తవానికి 10 మంది ఏఈలు, 16 మంది లస్కర్లు, ఇద్దరు ఎలక్ట్రీషియన్లు, ఫిట్టర్లు ఇద్దరు, అటెండర్లు, వాచ్‌మన్లు ఇతర సిబ్బంది 10 మంది వరకు ఉండాలి. ఈ పోస్టులు ఖాళీగా ఉండడంతో అధికారులు ఇబ్బందులు పడుతున్నారు. ప్రాజెక్టు సమస్యల పరిష్కారానికి కూటమి ప్రభుత్వమైనా తగిన చర్యలు తీసుకోవాలని ఆయకట్టు రైతులు కోరుతున్నారు.



పూడికతీతకు నోచని ఎడమ కాలువ

ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయొద్దు

● 'సమస్యల పరిష్కార వేదిక'లో కలెక్టర్ ఆనంద్



వినతులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆనంద్

నెల్లూరు(హరనాథపురం), జూలై 8 : ప్రజా సమస్యలను నిర్లక్ష్యం చేయవద్దని కలెక్టర్ ఆనంద్ పేర్కొన్నారు. సోమవారం కలెక్టరేట్ తిక్కన భవనలో జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక కార్యక్రమంలో జిల్లా నలుమూలల నుంచి వచ్చి ప్రజల నుంచి కలెక్టర్ అర్జీలు స్వీకరించారు. వాటిని సంబంధిత అధికారులకు ఇచ్చి సత్వరం పరిష్కరించాలని ఆదేశించారు. ప్రజలకు అవసరమైన సేవలను సత్వరమే అందించాలన్నారు. అవసరమైతే క్షేత్రస్థాయికి వెళ్లి సమస్యను పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.



నరసాపురం ప్రసాద్

● పెన్నా రివర్ కెనాల్‌పై బ్రిడ్జిని పునర్నిర్మించాలని కోరుతూ వెంకటేశ్వరపురానికి చెందిన నరసాపురం ప్రసాద్ వినతిపత్రం సమర్పించారు. వరదల సమయంలో ప్రజలకు ఉపయోగపడుతున్న పెన్నా రివర్ కెనాల్‌పై ఏర్పాటు చేసిన 200 మీటర్ల బ్రిడ్జిని అనవసరంగా కూల్చేశారన్నారు. పెన్నానది వరద పరివాహక ప్రాంతంలో శాశ్వత కాంక్రీటు నిర్మాణానికి, బహుళ అంతస్తుల నిర్మాణాలకు ఇండిమినిటీ బాండ్ పేరుతో విద్యుత్ మీటర్‌లను ఇచ్చే విధానాన్ని నిలిపివేయాలని కోరారు.

● టిడ్కో గృహాల పెండింగ్ పనులను పూర్తిచేసి మౌలిక సదుపాయాలు కల్పించాలని కోరుతూ సీపీఐ నగర సహాయ కార్యదర్శి సయ్యద్ సిరాజ్ వినతిపత్రం సమర్పించారు. 2015లో ప్రారంభమైన ఈ గృహాల నిర్మాణం సంపూర్ణంగా పూర్తి కాలేదన్నారు. వాటి నిర్మాణాలను సత్వరమే పూర్తి చేయాలని కోరారు.

కలెక్టర్ ఎదురుగా కూర్చుని వ్యక్తి నిరసన



నిరసన తెలుపుతున్న వ్యక్తిని పైకి లేపుతున్న సిబ్బంది

ఆలిండియా స్టూడెంట్ అసోసియేషన్ నెల్లూరు జిల్లా కార్యదర్శి సర్దార్ షఫిహరన్ తమ గ్రామ సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ తిక్కన భవన్‌లో ప్రజా పరిష్కార వేదిక కార్యక్రమంలో కలెక్టర్ ఆనంద్ ఎదురుగా కూర్చుని నిరసన తెలిపారు. తమ స్వగ్రామం సైదాపురం మండలంలోని కలిచేడులో మైనింగ్ లేబర్ వైద్యశాల, హైస్కూల్‌లు నిర్వీర్యమయ్యాయని ఆరోపించారు. వాటిని తిరిగి పునరుద్ధరించాలని కోరుతూ అర్జీ పట్టుకుని నేలపై కూర్చిండి పోయాడు. అతనిని అక్కడ నుంచి సిబ్బంది లేపి కలెక్టర్ వద్దకు తీసుకొని వెళ్లారు. అతని వినతిని పరిశీలించిన కలెక్టర్ సంబంధిత అధికారులను పిలిచి సమస్యను పరిష్కరించాలని ఆదేశించారు. ఈ విధంగా వినూత్నంగా షఫి నిరసన తెలపడంతో తిక్కన భవన్‌కు విచ్చేసిన వారంతా ఆశ్చర్యంగా చూశారు.

ఆయిల్ ట్యాంకర్ ఢీకొని ఒకరికి గాయాలు

వెంకటాచలం, జూలై 8: కృష్ణపట్నం పోర్టు రామదాసుసత్రం సమీపంలో రోడ్డు సర్వే చేస్తున్న సోమవారం ఒక వ్యక్తిని ఆయిల్ ట్యాంకర్ ఢీకొంది. ఈ ప్రమాదంలో అతనికి తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం నెల్లూరుకు తరలించారు. ఈ మేరకు సోమవారం పోలీసులు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నారు. స్థానికుల కథనం మేరకు వివరాలు కర్నూలు జిల్లా డోన్‌కు చెందిన నాగేంద్ర రహదారి నిర్మాణాలు చేస్తున్న ఒక ప్రైవేటు సంస్థలో కొద్దినెలలుగా సర్వేయర్‌గా పని చేస్తున్నాడు. రెండు రోజుల కిందట పోర్టు రోడ్డు నుండి వెళ్తున్న వాహనాలకు డైవర్షన్ ఇచ్చి రోడ్డు సర్వే చేస్తుండగా అటువైపు వాహనాల రాకపోకలు నిలిపివేశారు. కానీ ఒక ఆయిల్ ట్యాంకర్ డ్రైవర్ నిర్లక్ష్యంతో రహదారి వైపునకు రావడంతో రోడ్డు సర్వే చేస్తున్న నాగేంద్రను వెనుకవైపు నుండి ఢీకొంది.

మాయమాటలతో బురిడీ : బంగారం చోరీ

బుచ్చిరెడ్డిపాళెం,జూలై 8: బుచ్చి బస్టాండ్ సెంటర్ సమీపంలోని ఓ జ్యూయలరీ షాపు యజమానిని ఓ మాయలేడి మాటలతో మభ్యపెట్టి సుమారు రూ. 80వేలు విలువచేసే బంగారు చైను, చిన్న బుట్టకమ్మలను చోరీ చేసింది. ఈ సంఘటన సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది. షాపు యజమాని సురేష్ కథనం మేరకు, శనివారం ఓ మహిళ,మరొకరు బంగారం మార్పిడి కోసం భవదీష్ జ్యూయలరీకి వచ్చారు. ముందుగా వారివద్దవున్న ఓ బంగారు చైన్‌ను యజమానికి ఇచ్చారు. ఆయన దాన్ని పరీక్షించి వెలకట్టారు. బేరం కుదరడంతో పాత చైను, కొత్త బంగారు చైను రెండూ తీసుకుని చూస్తున్నట్టు నటించారు. పాత బంగారు చైనుకు బదులు నకిలీ చైనును యజమానికి ఇచ్చారు. అనంతరం ఆయన్ను మాటలతో మభ్యపెట్టి పాత, కొత్త బంగారు చైన్లు రెండింటిని తీసుకుని పరారయ్యారు. ఆదివారం చూసుకునే సరికి ఆ మహిళ ఇచ్చినచైను నకిలీదిగా తేలింది. సీసీ పుటేజీల ఆధారంగా పోలీసులకు ఫిర్యాదు చేసినట్టు జ్యూయలరీ యజమాని తెలిపారు. కానీ తమకు ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

గంగవరం ఆలయంలో..

కోవూరు, జూలై 8: మండలంలోని గంగవరం గ్రామ దేవత పక్కేళ్లమ్మ ఆలయ తలుపుల్ని ఆదివారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు పగులగొట్టి రూ.లక్ష విలువ చేసే వెండి ఆభరణాల్ని దోచుకు వెళ్లినట్లు సోమవారం పోలీసులకు ఫిర్యాదు అందింది. తలుపుల్ని పగులగొట్టిన దొంగలు వెండి కిరీటం, వెండి చెవులు, మంగళసూత్రాలు, తీర్థం ఇచ్చే గిన్నెలు అపహరించుకు వెళ్లారు. పోలీసులు ఘటనాస్థలాన్ని పరిశీలించి వివరాలు రాబట్టారు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



పక్కేళ్లమ్మ ఆలయ తలుపులు పగులగొట్టిన దుండగులు

టిప్పర్ ఢీకొని వృద్ధురాలి మృతి

నెల్లూరు(క్రైం), జూలై 8 : నెల్లూరు నగర పరిధిలోని ప్రశాంతినగర్ జంక్షన్‌లో జాతీయ రహదారిపై సోమవారం టిప్పర్ ఢీకొని ఓ వృద్ధురాలు మృతి చెందింది. పోలీసుల కథనం మేరకు.. వెంకటాచలం మండలం నిడుగుంటపాళెంకు చెందిన ప్రసాద్, సుబ్బమ్మ (58) దంపతులు. వారు సోమవారం విడవలూరు మండలం వావిళ్ల నుంచి బైక్‌పై ఇంటికి బయల్దేరారు. ప్రశాంతినగర్ జంక్షన్‌లో జాతీయ రహదారి వద్దకు వచ్చే సరికి వెనుక నుంచి మితిమీరిన వేగంతో వస్తున్న టిప్పర్ బైక్‌ను ఢీకొంది. ఈ ఘటనలో సుబ్బమ్మ తలకు తీవ్ర గాయమవడంతో అక్కడికక్కడే మృతి చెందింది. భర్త హెల్మెట్ ధరించి ఉండటంతో అతను ప్రమాదం నుంచి బయటపడ్డాడు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటనా స్థలాన్ని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

కుమార్తె అదృశ్యంపై తల్లి ఫిర్యాదు

కావలి రూరల్,జూలై 8: తన కుమార్తె అదృశ్యమైందని పట్టణంలోని వైకుంఠపురానికి చెందిన యనమల రాజేశ్వరి సోమవారం రెండో పట్టణ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. పోలీసుల కథనం మేరకు, రాజేశ్వరికి 15 ఏళ్ల కిందట వెంకటరావుతో వివాహమైంది. వారికి యునికే(14) అనే కుమార్తె పుట్టాక భర్తతో మనస్పర్థలు వచ్చి విడాకులు తీసుకుంది. అనంతరం దూరపుబంధువైన తమిళనాడు రాష్ట్రం సేలంకు చెందిన మణికంఠతో వివాహమైంది. వారికి ఇద్దరు పిల్లలు పుట్టాక ఆయన మరొకరితో వివాహేతర సంబంధం పెట్టుకుని వెళ్లిపోయాడు. దీంతో రాజేశ్వరి అక్కడ బతకలేక ముగ్గురు పిల్లలతో కావలి వైకుంఠపురంలోని తన తల్లి వద్దకు వచ్చింది. ఈ క్రమంలో ఆమె భర్త మణికంఠ రెండు నెలల కిందట కావలికి వచ్చి కాపురానికి రమ్మని పిలవగా, ఆమె నిరాకరించింది. సోమవారం ఉదయం పాల కోసం వెళ్లిన కుమార్తె యునికే తిరిగి ఇంటికి రాలేదు. తన భర్త మణికంఠే కుమార్తెను తీసుకుని వెళ్లి ఉంటాడనే అనుమానంతో ఆమె పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	137
లేయర్ లైవ్	115
స్కిన్ చికెన్	246
స్కిన్‌లెస్	274
లేయర్	195

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ.6939
వెండి కిలో ధర	రూ. 94,400
వెండి ఒక గ్రాము	రూ. 96.40

సోమశిలలో 10.022 టీఎంసీల నీరు నిల్వ

అనంతసాగరం, జూలై 8: సోమశిల పూర్తిస్థాయి నీటి సామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా సోమవారానికి డ్యాంలో 10.022 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. ఎగువ నుంచి 286 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వస్తుండగా దిగువ డెల్టాకు 600, ఉత్తర, దక్షిణ కాలువలకు 10 క్యూసెక్కులు సరఫరా చేస్తున్నారు.

తాళం వేసిన ఇంట్లో చోరీ

● నాలుగు సవర్ల బంగారు ఆభరణాల అపహరణ

కావలి రూరల్, జూలై 8: పట్టణంలోని అంబేడ్కర్‌నగర్ లో తాళం వేసిన ఇంట్లో చోరీ జరగ్గా, సోమవారం ఆలస్యంగా వెలుగు చూసింది.వన్‌టౌన్ పోలీసుల కథనం మేరకు, పట్టణంలోని అంబేడ్కర్ నగర్‌కు చెందిన ఆత్మకూరి శివప్రసాద్ ఆదివారం రాత్రి ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులతో కలసి కోటప్పకొండకు వెళ్లాడు. సోమవారం సాయంత్రం తిరిగి ఇంటికి వచ్చేసరికి తలుపు తాళం పగలగొట్టి ఉండటంతో ఇంట్లోకి వెళ్లి చూశాడు. బీరువా పగలగొట్టి అందులోని నాలుగు సవర్ల బంగారు ఉంగరాలు, కమ్మలు గుర్తు తెలియని వ్యక్తులు చోరీ చేసినట్లు గుర్తించి పోలీసులకు ఫిర్యాదు చేశాడు. సంఘటనా స్థలాన్ని సీఐ రాజేష్ పరిశీలించారు. నెల్లూరు క్లూస్‌టీం సభ్యులు వేలిముద్రలు స్వీకరించారు. ఈ మేరకు ఎస్ఐ జమాల్‌వలీ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పురాతన విగ్రహాల కోసం ముఠా సంచారం

● పోలీసులకు పట్టించిన స్థానికులు

బుచ్చిరెడ్డిపాళెం,జూలై 8: మండలంలోని మునులపూడి గ్రామ శివారులో పురాతన విగ్రహాలకోసం ఓ బృందం సంచరిస్తుండడాన్ని స్థానికులు గుర్తించి పట్టుకున్నారు. ఆ గ్రామ శివారులో సోమవారం సంచరిస్తున్న ముఠాను స్థానికులు ప్రశ్నించగా, పొంతనలేని సమాధానాలు చెప్పడంతో పట్టుకున్నారు. అనంతరం వారిని పోలీసులకు అప్పగించగా, వారు విచారిస్తున్నారు. కాగా గతంలో ఆగ్రామ శివారు ప్రాంతంలోని ఓ శిథిల ఆలయంలో కొందరు విగ్రహాల చోరీకి పాల్పడ్డారు.

బస్‌పాసులకు రూ.లక్ష వితరణ



చెక్కు ఇస్తున్న రోశిరెడ్డి

దుత్తలూరు (ఉదయగిరి రూరల్): స్థానిక ఆదర్శ పాఠశాలలో 500మంది విద్యార్థుల ఉచిత ప్రయాణానికి రాచవారిపల్లికి చెందిన పారిశ్రామికవేత్త నంబూరి రోశిరెడ్డి సోమవారం రూ.లక్ష నగదు ఇచ్చారు. దాతను ప్రిన్సిపాల్ సైమన్ రావు సన్మానించారు.

టెట్ ప్రకటనపై నిరుద్యోగుల హర్షం

మెగా డీఎస్సీకి మరో ముందడుగు



డీఎస్సీ అభ్యర్థుల్లో వెల్లివిరిసిన ఆనందం

నెల్లూరు (విద్య), జూలై 8 : మెగా డీఎస్సీ పేరుతో వైకాపా ప్రభుత్వం దగా చేసింది. ఐదేళ్ల మాటలతో మాయ చేసింది. అయితే, ఎన్నికల ముందు మాటిచ్చిన టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టగానే మెగా డీఎస్సీపై తొలి సంతకం చేశారు. ఇప్పటికే డీఎస్సీ ప్రకటన విడుదల చేయగా తాజాగా టెట్ నిర్వహణకు సంబంధించి పాఠశాల విద్యా శాఖ సోమవారం నోటిఫికేషన్ విడుదల చేసింది. నిరుద్యోగ అభ్యర్థుల ఆకాంక్షలకు అనుగుణంగా ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం ముందడుగు వేయడంపై నిరుద్యోగులు హర్షం వ్యక్తం చేస్తు న్నారు. మొత్తం ఈ ప్రక్రియను ఆరునెలల్లో పూర్తి చేసేలా కార్యా చరణ రూపొందించడంతో పాటు కొత్తగా బీఈడీ, డీఎడ్ పూర్తి చేసుకున్న వారికీ మెగా డీఎస్సీలో అవకాశం కల్పించనున్నారు. జిల్లాలో గత ఐదేళ్లలో డీఎడ్ పూర్తి చేసిన వారు 10వేల మంది, బీఈడీ చేసిన మరో 10వేల మంది వరకు నిరుద్యోగులు డీఎస్సీ కోసం ఎదురుచూస్తు న్నారు. వీరిలో అత్యధికశాతం గ్రామీణ, బడుగు, బలహీన వర్గాలకు చెందిన యువతే ఉపాధ్యాయులుగా స్థిరపడాలన్న ఆలోచనలతో లక్షలాది రూపాయలు వెచ్చించి కోర్సులను పూర్తి చేశారు. వీరంతా కూడా తమ కలలు నిజం కాబోతున్నాయన్న ఆనందంతో టెట్, డీఎస్సీలకు సన్నద్ధమవుతున్నారు. దీంతో టెట్, డీఎస్సీలకు శిక్షణ అందించే కేంద్రాలు అభ్యర్థులతో సందడిగా కనిపిస్తున్నాయి..

● **ఏపీ టెట్ షెడ్యూల్ విడుదల**

ఏపీ టెట్‌కు సంబంధించి ఇటీవల విడుదల చేసిన నోటిఫికేషన్‌లో రాష్ట్ర ప్రభుత్వం స్వల్ప మార్పులు చేస్తూ అభ్యర్థులు మరింత సన్నద్ధం అయ్యేలా వారికి సమయం ఇచ్చేందుకు వీలుగా సవరించింది. ఇటీవల జులై 2వతేదీన టెట్ నోటిఫికేషన్ విడుదల చేసినా అభర్థుల విజ్ఞప్తి మేరకు టెట్, డీఎస్సీలకు మరింత (90రోజులు) గడువునిస్తూ షెడ్యూల్‌లో పలు మార్పులతో సోమవారం నోటిఫికేషన్ విడుదల చేశారు. పాత నోటిఫికేషన్ ప్రకారం ఆగస్టు 5 నుంచి 20వతేదీ వరకు టెట్ పరీక్షలు జరగాల్సి ఉండగా వాటిని అక్టోబరు 3 నుంచి 20వతేదీ వరకు నిర్వహించాలని నిర్ణయించారు. టెట్‌కు సంబంధించి పరీక్ష ఫీజు చెల్లింపు ఇప్పటికే ప్రారంభం కాగా ఆగస్టు 3వతేదీ వరకు పొడిగించారు. జులై 22 నుంచి హాల్‌టికెట్ల డౌన్‌లోడ్, సెప్టెంబరు 19 నుంచి ఆన్‌లైన్ మాక్‌టెస్ట్, అక్టోబరు 3 నుంచి 20వతేదీ వరకు రెండు సెషన్లలో పరీక్షలు, 27న తుదీ కీ విడుదల, నవంబరు 2న ఫలితాలు విడుదల చేయనున్నారు. డీఎస్సీలో టెట్‌కు 20శాతం వెయిటేజీ ఉండడంతో టెట్ సన్నద్ధతకు కూడా డిమాండ్ పెరిగింది.

డీకేడబ్ల్యూ డిగ్రీ కళాశాలలో అత్యాధునిక కోర్సులు

● ప్రిన్సిపాల్ డాక్టర్ గిరి



కళాశాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న ప్రిన్సిపాల్, తదితరులు

నెల్లూరు (విద్య), జూలై 8: మహిళల ఉన్నత విద్య, సర్వతోముఖాభి వృద్ధికి తోడ్పాటు నిచ్చేలా దొడ్ల కౌసల్యమ్మ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో అత్యాధునిక కోర్సులు ప్రవేశపెట్టినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ డీ.గిరి తెలిపారు. సోమవారం కళాశాలలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ తమ కళాశాల నాక్ ద్వారా 3.16 జీపీఏతో ఏ గ్రేడ్ సాధించి కాలేజ్ విత్ పొటెన్షియల్ ఫర్ ఎక్స్‌లెన్స్, అటానమస్ హోదా పొందిందన్నారు. తమ కళాశాలలోని యూజీ విభాగంలో 17 కోర్సులు అందుబాటులో ఉన్నాయన్నారు. ఇంటర్‌లో డీఎంఎల్‌టీ, బైపీసీ చదివిన విద్యార్థులకు ఈ విద్యా సంవత్సరం నుంచి బీఓక్ (మెడికల్ ల్యాబ్ టెక్నాలజీ) కోర్సును ప్రారంభించామన్నారు. అలాగే విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో పరిధిలో బీఎస్సీ (ఆనర్స్ డిగ్రీ)లో మేథమ్యాటిక్స్, కెమిస్ట్రీ ప్రోగ్రామ్స్‌లో 4 ఏళ్ల ఆనర్స్ డిగ్రీ ప్రారంభించామ న్నారు. బీఏ (ఆనర్స్ డిగ్రీ), బీఎస్సీ (ఆనర్స్ డిగ్రీ), బీకామ్(ఆనర్స్‌డిగ్రీ) కోర్సులు ఉన్నాయ న్నారు. పీజీ కోర్సులు ఎంఏ (తెలుగు), ఎంఎస్సీ(జువాలజీ) అందుబాటులో ఉన్నాయన్నా రు. నగరంలోని డీకే ప్రభుత్వ డిగ్రీ మహిళా కళాశాలలో ఆన్‌లైన్ కౌన్సెలింగ్ రిజిస్ట్రేషన్ ను ఈనెల 10వ తేదీ వరకు అవకాశం ఉందన్నారు. అనంతరం కళాశాల కోర్సులకు సంబంధించిన బ్రౌచర్‌ను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అడ్మిషన్ల కన్వీనర్ డాక్టర్ అనిత, పీఆర్‌వో డాక్టర్ ఆర్.విజయభాస్కర్, లైబ్రేరియన్ డాక్టర్ నారాయణరెడ్డి, రిటైర్డ్ పొలిటికల్ సైన్స్ అధ్యాపకుడు జోజి, తదితరులు పాల్గొన్నారు.

రైతులకు ఇబ్బందులు లేకుండా చూడండి

● ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులకు కలెక్టర్ ఆదేశం

నెల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కండలేరు ఎడమ కాలువ ఎత్తిపోతల కిందనున్న ఆయకట్టు రైతులకు ఇబ్బందులు లేకుండా చూడాలని ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులను కలెక్టర్ ఓ ఆనంద్ ఆదేశించారు. 'కండలేరు ఎత్తిపోతలకు గ్రహణం' శీర్షికన 'ఆంధ్రజ్యోతి'లో ఆదివారం ప్రచురితమైన కథనానికి కలెక్టర్ స్పందించారు. ఇరిగేషన్, విద్యుత్ శాఖ అధికారులను సోమవారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌కు పిలిపించి విద్యుత్ బకాయిలపై ఆరా తీశారు. ఎప్పటి నుంచి బకాయిలు ఉన్నాయి..? ఎంత ఉన్నాయి..? ప్రస్తుతం ఆయకట్టుకు ఎదురవుతున్న ఇబ్బందులు..? వంటి విషయాలను అడిగి తెలుసుకున్నారు. విద్యుత్ బకాయిల అంశాన్ని ప్రభుత్వం దృష్టికి తీసుకెళతామని, అప్పటి వరకు ఎత్తిపోతల పథకానికి విద్యుత్ కనెక్షన్ కట్ చేయవద్దని ఆ శాఖ ఎస్‌ఈకు కలెక్టర్ సూచించారు. పంటలకు ఏ మేరకు నీరు అవసరమో గుర్తించి అందుకు సరిపడా ఎత్తిపోతల ద్వారా నీరు అందించాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. కాగా బండేపల్లి - డేగపూడి కాలువ పనులపై కూడా ఇరిగేషన్ అధికారులతో చర్చించారు. భూసేకరణ పనులు ఆలస్యమవడానికి కారణాలను తెలుసుకున్నారు. భూసేకరణ ప్రక్రియ వెంటనే వేగవంతమయ్యేలా చర్యలు తీసుకోవాలని రెవెన్యూ అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. కాంట్రాక్టర్‌తో పనులు మొదలుపెట్టించాలని కూడా కలెక్టర్ సూచించారు.

సర్వే రాళ్లు భద్రం!



సచివాలయం ఆవరణలో రాళ్లను భద్రపర్చిన సిబ్బంది

ఉదయగిరి రూరల్, జూలై 8: యర్రబల్లిగడ్డ సెంటర్‌లో గుట్టలుగా పడి వృథాగా ఉన్న వైఎస్ఆర్ జగనన్న భూ రక్ష సర్వే రాళ్లను సోమవారం సిబ్బంది భద్రపరిచారు. ఆదివారం ఆంధ్రజ్యోతిలో 'జనం సొమ్ము రాళ్ల పాలు' అనే కథనం ప్రచురితమైంది. దీంతో స్పందించిన ఉన్నతాధికారులు వాటిని భద్రపరచాలని కిందిస్థాయి అధికారులకు సూచించారు. సర్వేయర్లు షేక్ మీరావలి, ఉప్పుటూరి వెంకటరమణమ్మలు కూలీలతో పిచ్చిమొక్కల్లో గుట్టలుగా ఉన్న రాళ్లను వెలికితీసి శకునాలపల్లి సచివాలయ ఆవరణలో భద్రపరిచారు.

కాకాణి బతుకంతా తప్పుడు కూతలే!

● అధికారంలో ఉన్నప్పుడు లేఅవుట్లపై ఎందుకు చర్యలు తీసుకోలేదు? ● తప్పు చేసిన వారిని వదిలిపెట్టం : సోమిరెడ్డి




విలేకరులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి

నెల్లూరు, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : కాకాణి గోవర్ధన్‌రెడ్డి బతుకంతా తప్పుడు కూతలేనని, నోరు తెరిస్తే అబద్ధాలు తప్ప మరొకటి మాట్లాడరని టీడీపీ పొలిట్‌బ్యూరో సభ్యుడు, సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. సోమవారం నెల్లూరులోని టీడీపీ జిల్లా కార్యాలయంలో ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. తోడేరులో కన్వర్షన్, అప్రూవల్ లేకుండా లేఅవుట్ వేశారని, ఫోర్జరీ సంతకాలతో అనుమతులు న్యాయంటూ ప్రచారం చేసి విక్రయాలు జరుపుతున్నారని, దీనిపై నుడా అధికారులు కేసు పెట్టారని వివరించారు. ఫోర్జరీ సంతకాలతో అడ్డంగా దొరికిపోయి కూడా సిగ్గు లేకుండా మాట్లాడుతున్నారని తీవ్రస్థాయిలో మండిపడ్డారు. అల్లీపురంలో అనధికార లేఅవుట్ వేసినప్పుడు మంత్రిగా ఉన్నది కాకాణి గోవర్ధన్‌రెడ్డేనని, ఆయన అప్పుడు ఎందుకు చర్యలు తీసుకోలేదని ప్రశ్నించారు. రైతుల ప్రయోజనాల కోసం ఆ లేఅవుట్‌పై తాను హైకోర్టుకు వెళ్లానని గుర్తు చేశారు. బండేపల్లి-డేగపూడి కాలువ నిర్మాణాన్ని రూ.24 కోట్లతో మంజూరు చేయించి పనులు మొదలు పెట్టి రూ.2 కోట్ల పనులు కూడా చేశామని చెప్పారు. కానీ వైసీపీ అధికారంలోకి వచ్చాక కాకాణి ఆ పనులు ఆపేయడంతో పాటు ఆ పనుల్లో తాను రూ.17 కోట్లు తీసుకున్నట్లు తప్పుడు ప్రచారం చేయించారని అన్నారు. రూ.2 కోట్లు పనులు జరిగితే రూ.17 కోట్లు ఎక్కడి నుంచి వచ్చాయని సోమిరెడ్డి ప్రశ్నించారు. ఏడు కేసుల్లో నిందితుడిగా ఉన్న వ్యక్తి, కల్తీ మద్యంతో పేదల ప్రాణాలు తీసిన వ్యక్తి తన గురించి మాట్లాడడం విడ్డూరంగా ఉందన్నారు. జగన్మోహన్ రెడ్డి బెయిల్‌పై తిరుగుతుంటే, కాకాణి కండీషనల్ బెయిల్‌పై బయట తిరుగుతున్నారని ఎద్దేవా చేశారు కాకాణి ధన దాహం మూలంగా రానున్న ఒకటి రెండేళ్లలో ఎంత మంది అధికారులు జైలుకు, సస్పెండ్‌లు అవ్వబోతున్నారో తేలుతుందన్నారు. తమ కార్యకర్తలపై తప్పుడు కేసులు పెట్టి వేధించిన ఏ ఒక్కరినీ వదలమని చంద్రమోహన్‌రెడ్డి హెచ్చరించారు.

విద్యుత్ సమస్యల పరిష్కారానికే లోక్ అదాలత్

● పరిష్కార వేదిక అధ్యక్షుడు శ్రీనివాస ఆంజనేయమూర్తి



మాట్లాడుతున్న శ్రీనివాస ఆంజనేయ మూర్తి

నెల్లూరు(జడ్పీ), జూలై 8: విద్యుత్ వినియోగదారుల సమస్యల పరిష్కారమే లక్ష్యంగా లోక్ అదాలత్ నిర్వహించినట్లు వినియోగదా రుల ఫిర్యాదుల పరిష్కార వేదిక అధ్యక్షుడు శ్రీనివాస ఆంజనేయ మూర్తి పేర్కొన్నారు. నగరంలోని విద్యుత్ భవన్‌లో సోమవారం నిర్వహించిన లోక్ అదాలత్‌లో పాల్గొన్న శ్రీనివాస ఆంజనేయ మూర్తి మాట్లాడుతూ నగరానికి సంబం ధించి 5మంది వినియోగదారులు విద్యుత్ సమస్యలపై ఫిర్యాదులు చేశార న్నారు. 1 సమస్యను పరిష్కరించామని, మిగిలిన నాలుగు సమస్యలను సంబంధిత అధికారులకు ఇచ్చి త్వరితగతిన పరిష్కరించాలని సూచించామన్నారు. ఇందులో ప్రధానంగా బిల్లింగ్ సమస్య, లోవోల్టేజి, ట్రాన్స్‌ఫార్మర్లు తక్కువ ఎత్తులో ఉండడం, వ్యవసాయ సర్వీసు సమస్యలపై ఫిర్యాదులు వచ్చాయన్నారు. వాటన్నింటిని త్వరలోనే అధికారులు పరిష్కరిస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్థిక సభ్యులు కే.రామ్మోహన్, సాంకేతిక సభ్యులు అంజనీకుమార్, ఈఈ సోమశేఖర్‌రెడ్డి, డీఈలు శ్రీధర్, మధు, కిరణ్ పాల్గొన్నారు.

వరుస చోరీలతో ప్రజల బెంబేలు

ఉదయగిరి, జూలై 8: ఆరునెలలుగా నియోజకవర్గంలోని ఉదయగిరి, సీతారామ పురం మండలాల్లో జరుగుతున్న వరుస చోరీలతో గ్రామీణప్రాంత ప్రజలు బెంబేలెత్తిపో తున్నారు. మండలంలోని నారాయ ణప్పపేట అంగన్‌వాడీ కేంద్రంలో గుర్తుతెలియని వ్యక్తులు దొంగతనాలకు పాల్ప డ్డారు. అదే ప్రాంతంలోని ఓ గుడి లో ఉన్న హుండీని పగ లగొట్టి నగదు దోచుకెళ్లారు. రెండు నెలల క్రితం పట్టణ బస్టాండ్ సెంటర్‌లోని దుకా ణంలో చీరలు చోరీ అయ్యాయి. అలాగే బాలాజీ నగర్‌లోని ఓ ఇంట్లో దొంగలు పడి నగదు, బంగారు ఆభరణాలు దోచుకెళ్లారు. గతనెల 23న స్థానిక బీసీ కాలనీలో ఓ ఇంట్లో దొంగలు చోరీ చేశారు. ఉదయగిరి మండలంలోని కుర్రపల్లి రైస్‌మిల్లు వద్ద విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ పగలగొట్టి అందులో ఉన్న రాగి వైరు, ఆయిల్ చోరీ చేశారు. నేలటూరు, కుర్రపల్లి గ్రామాల్లో అనేకమంది రైతుల వ్యవసాయ భూముల్లో ఉన్న వ్యవసాయ విద్యుత్ మోటార్ల కేబుల్ వైర్లు తీసుకెళ్లారు. తాజాగా మండలంలోని దాసరిపల్లి వద్ద గుర్తుతెలి యని వ్యక్తి మామ మాటలు చెప్పి చేతిలోని నగదు తీసుకొని పరారయ్యాడు. ఇలాంటి సంఘటనలు నిత్యం ఏదో ఒకచోట జరుగుతున్నాయి. వెలుగులోకి రానివి మరె న్నో సంఘటనలు ఉన్నాయి. ఇలాంటి సంఘటనలకు పాల్పడుతున్న వ్యక్తులను పోలీ సులు అరెస్టు చేయడంలేదని ప్రజలు ఆరోపిస్తున్నారు. పోలీసులు రాత్రివేళ గస్తీని ముమ్మరం చేయాలని కోరుతున్నారు.

ఇన్‌చార్జుల పాలనే దిక్కు!

నాలుగేళ్ల క్రితం ఆత్మకూరు డివిజన్‌లో పీఆర్ అధికారుల ఉమ్మడి బదిలీ

నాటి నుంచి నేటి వరకు రెగ్యులర్ అధికారులు లేరు



ఆత్మకూరు, జూలై 8: ఆత్మకూరు పీఆర్ సబ్‌డివిజన్ పరిధిలో నాలుగేళ్లుగా ఇన్‌చార్జుల పాలన కొనసాగుతోంది. 2021 జూన్ 4వ తేదీన అప్పటి రాష్ట్ర మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే దివంగత మేకపాటి గౌతమ్‌రెడ్డి నియోజకవర్గంలో పంచాయతీ రాజ్‌శాఖ ఆధ్వర్యంలో జరిగే అభివృద్ధి పనుల ప్రగతిపై అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. పీఆర్ అధికారులు పని తీరుపై ఆగ్రహించి ఉమ్మడి బదిలీలకు ఆదేశాలు జారీ చేశారు. ఈ క్రమంలో నియోజకవర్గంలోని ఆరు మండలాల పీఆర్ ఏఈలతో పాటు డీఈను సైతం బదిలీ చేశారు. అప్పటినుంచి ఇప్పటి వరకు ఇన్‌చార్జ్ అధికారులే విధులు నిర్వహిడటంతో అభివృద్ధి పనులు కుంటు పడుతున్నాయి. అప్పటి బదిలీల్లో భాగంగా ఆత్మకూరు సబ్ డివిజన్‌లో డీఈగా పనిచేస్తున్న శ్రీనివాసరావు బదిలీపై వెళ్లడంతో ఆయన స్థానంలో ఉదయగిరి డీఈ సుబ్బారెడ్డి ఇన్‌చార్జ్‌గా నియమితులయ్యారు. అనంతరం ఏడాదిగా పీఐయూ సబ్ డివిజన్ ఏఈ సురేష్‌బాబు ఆత్మకూరు పీఆర్ ఇన్‌చార్జ్ డీఈగా బాధ్యతలు నిర్వహిస్తుండడం గమనార్హం.

ఆరు మండలాలకు ఒకేఒక్కడు..

నియోజకవర్గంలోని ఆరు మండలాల్లో ఆత్మకూరుకు మాత్రమే రెగ్యులర్ ఏఈ ఖాదర్‌మస్తాన్ ఒక్కడే విధులు నిర్వహిస్తున్నాడు. మిగిలిన ఐదు మండలాలకు ఇన్‌చార్జిలే బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఆత్మకూరు ఏఈ ఖాదర్ మస్తాన్ ఏఎస్‌పేట, మర్రిపాడు మండలాలకు ఇన్ చార్జ్ కాగా, అనంతసాగరంకు ఇంజనీరింగ్ అసిస్టెంట్ శ్రీని వాసులు, చేజర్ల మండలానికి ఆదూరుపల్లి అసిస్టెంట్ ఇంజనీర్ హరీష్, సంగం మండలానికి కోవూరు స్పెషల్ ఏఈ రామయ్య, ఇంజనీర్ అసిస్టెంట్లు ఇన్‌చార్జ్‌లుగా బాధ్యతలు నిర్వహిస్తున్నారు. ఈ ఐదు మండలాల్లో 100 గ్రామ పంచాయతీలు పైబడి ఉన్నా యి. ప్రస్తుతం పలు పంచాయతీల్లో పలు అభివృద్ధి పనులు జరుగుతున్నాయి. వాటికి తోడు జనరల్ ఫండ్, జెడ్పీ, గ్రామ పంచాయతీ, మండల నిధులతో చేట్టే పనులను పర్యవేక్షించాల్సి ఉంది. ఇన్‌చార్జిల పర్యవేక్షణలో అభి వృద్ధి పనులు సకాలంలో పూర్తి కావనే విమర్శలు ఉన్నాయి. నాలుగేళ్ల నుంచి ఆత్మకూరు సబ్‌డివిజన్‌లో డీఈతో పాటు ఏఈలు ఇన్‌చార్జులుగా విధులు నిర్వహించాల్సి రావడం ప్రభుత్వ పనితీరుకు నిదర్శనమేనే విమర్శలు లేకపోలేదు. రాష్ట్ర మంత్రి, ఆత్మకూరు ఎమ్మెల్యే ఆనం రామనారాయణరెడ్డి రెగ్యులర్ అధికారుల నియామకంపై దృష్టి సారించి అభివృద్ధి పనులు వేగవంతం చేయాలని ప్రజలు కోరుతున్నారు.

ఊరా.. వల్లకాడా!?

- శ్మశానాన్ని తలపిస్తున్న ఆత్మకూరులోని ఖాళీ ప్లాట్లు
- ఏపుగా పెరుగుతున్న పిచ్చి మొక్కలు, ముళ్ల కంపలు
- విష పురుగులు, దోమలకు ఆవాసం



ఆత్మకూరు 6వ వార్డులోని నివాసాల మధ్య ఉన్న ఖాళీ స్థలం

ఆత్మకూరు, జూలై 8: స్థానిక మున్సిపాలిటీ పరిధిలోని జెఆర్‌పేట, ఎల్ఆర్‌పల్లి, ఆర్టీసీ డిపో సమీప ప్రాంతాల్లో జనావాసాల మధ్య కొందరు స్థలాలను కొనుగోలు చేసి వదిలేశారు. వాటిపై యజమానుల పర్యవేక్షణ లేకపోవడంతో డంపింగ్ యార్డులుగా.. ముళ్ల కంపలు, పిచ్చి మొక్కలు పెరిగి చిట్టడవిని తలపిస్తున్నాయి. వీటిలోకి సమీపంలోని ఇళ్లలోని వాడిన నీరంతా వస్తుండటంతో మురుగుకూపాలుగా మారుతున్నాయి. వర్షం పడగానే వాటిలో నీళ్లు చేరి ప్రమాదకరమైన డెంగీ, మలేరియా వంటి వ్యాధులకు కారణమయ్యే దోమలు ప్రబలుతున్నాయి. ఈ ఖాళీస్థలాల చుట్టుపక్కల నివాసముంటున్న ఇళ్లలో డెంగీ, మలేరియా, టైఫాయిడ్ వంటి జ్వరాల బారినపడుతున్న బాధితులు ఉన్నారు. ఇళ్ల పక్కన ఉన్న ఖాళీ స్థలాలను శుభ్రంగా ఉంచాలని మున్సిపల్ అధికారులు ఇప్పటికే పలుమార్లు ఖాళీస్థలాల యజమానులకు నోటీసులు జారీ చేశారు. వారు మాత్రం అందులో ఎలాంటి పనులు చేయడం లేదు. మున్సిపాల్టీ పరిధిలోని 6వ వార్డు ల్యాండ్ అక్విజేషన్ ఆఫీసుకు ఎదురుగా ఉన్న 250 అంకణాల ఖాళీ స్థలంలో కంపచెట్లు పెరిగి విషపురుగులకు ఆవాసంగా మారిందని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. రాత్రి వేళ పాములు ఇళ్లలోకి వస్తున్నట్లు వాపోతున్నారు. మున్సిపల్ అధికారులకు తెలియజేసినా ఫలితం లేకపోయిందని వాపోతున్నారు. ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరిచాలని కోరుతున్నారు.

ఏపీ ఎస్‌పీడీసీఎల్ యాప్‌లో విద్యుత్ బిల్లులు చెల్లించండి



క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్‌ను దుకాణం వద్ద అతికిస్తున్న ట్రాన్స్ కో ఏడీ శ్రీనివాసులు

సంగం, జూలై 8: ఏపీఎస్పీ డీసీఎల్ యాప్ ద్వారా విద్యుత్ బిల్లులు చెల్లించాలని ట్రాన్స్‌కో ఏడీ శ్రీనివాసులు తెలిపారు. సోమవారం ఆయన స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌ను తనిఖీ చేసి రికార్డులు పరిశీలించారు అనంతరం విద్యుత్ సరఫరాలో ఎదురైయ్యే సమస్యలపై సిబ్బందికి సల హాలు అందజేశారు. స్థానిక దుకాణాల వద్ద ఏపీ ఎస్పీ డీసీఎల్ క్యూఆర్ కోడ్ స్కానర్ పోస్టర్‌ను అతికించి బిల్లులు చెల్లింపులపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఏఈఈ శ్రీనివాసులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పథకాలను సద్వినియోగం చేసుకోవాలి



పాడి రైతులకు మందులు అందజేస్తున్న వైద్యులు

ఉదయగిరి రూరల్, జూలై 8: పశుసంవర్ధక శాఖ ద్వారా ప్రభుత్వం అమలు చేస్తున్న పథకాలను పాడిరైతులు సద్వినియోగం చేసుకోవాలని ఉదయగిరి ప్రాంతీయ పశువైద్యశాల సహాయ సంచాలకులు శశిధర్ కోరారు. పశుగ్రాస వారోత్సవాల్లో భాగంగా సోమవారం గుడినరవ రైతు సేవాకేంద్రంలో పశుపోషకులకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. పశువులకు పచ్చి, ఎండు గడ్డి కాకుండా ఖనిజ లవణ మిశ్రమం, తౌడు వంటి పదార్థాల అందిస్తే పాల దిగుబడి పెరగడంతో పాటు పాలల్లో వెన్నశాతం అధికంగా ఉంటుందన్నారు. సబ్సిడీపై అందించే గడ్డి విత్తనాలను వినియోగించుకోవాలన్నారు. పశుపోషణ, ఆరోగ్యం, పాలదిగుబడి పెంచే మెలకువలను తెలిపారు. అనంతరం ఖనిజ లవణ మిశ్రమం, ద్రావకాలను రైతులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో గండిపాళెం ఇన్‌చార్జి పశు వైద్యాధికారి అనూష, దుత్తలూరు యూనియన్ బ్యాంక్ మేనేజర్ నరేంద్రరెడ్డి పాల్గొన్నారు.

పండ్ల తోటల పెంపకం లక్ష్యాన్ని పూర్తి చేయాలి

ఉదయగిరి రూరల్, జూలై 8: మండలంలో ఉపాధిహామీ పథకం ద్వారా 200ఎకరాల్లో పండ్లతోటల పెంపక లక్ష్యాన్ని సిబ్బంది పూర్తి చేయాలని ఎంపీడీవో దేవరకొండ ఈశ్వరమ్మ, హార్టికల్చర్ అధికారి జయశ్రీ తెలిపారు. సోమవారం స్థానిక స్త్రీశక్తి భవనంలో ఉపాధి సిబ్బంది, హార్టికల్చర్ వీఏఏలతో సమీక్ష నిర్వహించారు. ఇప్పటివరకు 45 ఎకరాల్లో పండ్ల తోటల పెంపకానికి రైతుల నుంచి దరఖాస్తులు స్వీకరించామని, మిగిలిన 155 ఎకరాల్లో పండ్లతోటల పెంపకానికి రైతులను ప్రోత్సహించాలన్నారు. ఈ పథకంపై రైతులకు అవగాహన కార్యక్రమాలు నిర్వహించి దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కార్యక్రమంలో ఏపీవో బీ.శ్రీనివాసరావు, మండల వ్యవసాయాధికారి ఆంజనేయులు నాయక్, సిబ్బంది పాల్గొన్నారు.

జీవో 117ను రద్దు చేయాలి



సభ్యత్వ నమోదులో పాల్గొన్న యూటీఎఫ్ నాయకులు

అనంతసాగరం, జూలై 8: గత ప్రభుత్వం విద్యా వ్యవస్థలో తెచ్చిన జీవో నెంబర్ 117ను రద్దు చేసి ప్రభుత్వ పాఠశాలల మనుగడను కాపాడాలని యూటీఎఫ్ మండలాధ్యక్షుడు వెంకటేశ్వర్లురెడ్డి తెలిపారు. సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా సోమవారం మండలంలోని పలు పాఠశాలలో క్యాంపెయిన్ నిర్వహించారు. కొత్తగా ఏర్పడిన ప్రభుత్వం ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించడంలో చొరవ చూపాలని కోరారు. కార్యక్రమంలో సంఘం మండల కార్యదర్శి సాదిక్, సభ్యులు కిష్టయ్య, వెంకటేశ్వర్లు, మహేష్ పాల్గొన్నారు.

మాజీ సీఎం వైఎస్సార్‌కు ఘన నివాళి



ఆత్మకూరు: వేడుకల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి తదితరులు

ఆత్మకూరు, జూలై 8: వైస్సార్ జయంతి సందర్భంగా స్థానిక బస్టాండ్ సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి మాజీ ఎమ్మెల్యే మేకపాటి విక్రమ్‌రెడ్డి, నియోజకవర్గంలోని మండలాల వైసీపీ కన్వీనర్లు, ముఖ్య నేతలు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ మున్సిపల్ కౌన్సిలర్లు పాల్గొన్నారు.

దుత్తలూరు(ఉదయగిరి రూరల్): స్థానిక సెంటర్‌లోని వైఎస్ఆర్ విగ్రహానికి మండల వైసీపీ కన్వీనర్ దొంతి రెడ్డి వాసుదేవరెడ్డి, నాయకులు మండ్ల శివ, అన్నంరెడ్డిలు పూల మాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కేక్ కట్ చేసి మిఠాయిలు పంచిపెట్టారు. కార్యక్రమంలో వెంకటేశ్వరరెడ్డి, రోశిరెడ్డి, కండ్లగుంట వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సీతారామపురం: స్థానిక బస్టాండ్ కూడలిలో ఎంపీపీ చింతంరెడ్డి పద్మావతి, పార్టీ మండల కన్వీనర్ చింతంరెడ్డి సుబ్బారెడ్డి కేక్ కట్ చేసి వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ సభ్యులు చెరుకుపల్లి రమణరెడ్డి, పానెం రమణయ్య, వెంకటరెడ్డి, గోరంట్ల తిరుపాలు, సర్పంచ్ దుర్గా ప్రసాద్ పాల్గొన్నారు.

ఉదయగిరి: స్థానిక ఆనకట్ట సమీపంలోని వైఎస్ విగ్రహానికి వైసీపీ నియోజకవర్గ ఇన్‌చార్జి మేకపాటి రాజగోపాల్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో మండల కన్వీనర్ ఓబులరెడ్డి, అక్కి భాస్కర్‌రెడ్డి, గొల్లపల్లి తిరుపతి పాల్గొన్నారు.

సంగం: మండలంలో వైస్సార్ జయంతిని సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పార్టీ మండల కన్వీనర్ పులగం శంకర్‌రెడ్డి ఆధ్వర్యంలో చెక్‌పోస్టు, సంగం బ్యారేజ్ వద్ద ఉన్న వైఎస్సార్ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నాయకులు షేక్ కరీముల్లా, ముడి మల్లికార్జునరెడ్డి, పెరుమాళ్ల రవీంద్రబాబు, ఊటుకూరు జనార్దన్‌రెడ్డి, కట్టిపల్లి ప్రకాశ్, జహంగీర్ పాల్గొన్నారు.

ఉపాధి పనులు కల్పించాలి

అనంతసాగరం, జూలై 3: గ్రామాల్లో పనులు లేక అవస్థలు ఎదుర్కొంటున్న కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని సీపీఎం మండల కార్మిక సంఘం నాయకులు అన్వర్‌బాష అధికారులను కోరారు. సోమవారం ఈ విషయంపై ఎంపీడీవో కార్యాలయంలో సీనియర్ అసిస్టెంట్ రమేష్‌కు వినతిపత్రం అందజేశారు. పనిచేసిన వారికి పెండింగ్ ఉపాధి వేతనాలు అందలేదని పేర్కొన్నారు.

ప్రభుత్వ ఇసుక యార్డు ప్రారంభం

మర్రిపాడు, జులై 8: మండలకేంద్రంలోని ప్రభుత్వ ఇసుక యార్డును సోమవారం ఆత్మకూరు ఆర్డీవో మధులత ప్రారంభించారు. టన్నుకు రూ.370లకు వినియోగదారులకు అందుబాటులో ఉంచామని తెలిపారు. కార్యక్రమంలో మైనింగ్ డీడీఏ శ్రీనివాస్‌కుమార్, తహసీల్దారు సీతారత్నం తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి వినతి

ఉదయగిరి, జూలై 8: మేజర్ పంచాయతీలో నెలకొన్న సమస్యల పరిష్కారానికి చొరవ చూపాలని సీపీఎం మండల నాయకుడు షేక్ పర్వీన్‌బాషా సోమవారం ఈవో ఖరీముల్లాకు వినతిపత్రం అందజేశారు. పట్టణంలోని మురుగు కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోయి మురుగునీరు పారుదలకు ఆటంకం ఏర్పడుతుందన్నారు. ప్రతిరోజు పారిశుధ్య పనులు చేపట్టాలని పేర్కొన్నారు. స్థానిక సచివాలయం నుంచి అబీద్‌బాబా దర్గా వరకు సైడ్ కాలువ లేక మురుగు నీరు రోడ్డుపైనే పారుతుందని వాపోయారు. హైవేపై ఇంని నివాస స్థలాల పట్టాలు కోల్పోయిన లబ్ధిదారులకు వెంటనే ఇతర ప్రాంతాల్లో ఇంటి స్థలాలు కేటాయించాలని డిమాండ్ చేశారు.

ట్రాఫిక్ నియంత్రణపై చర్యలు

ఉదయగిరి, జూలై 8: పట్టణంలోని స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ట్రాఫిక్‌నకు అంతరాయం కలిగిస్తే చర్యలు తప్పవని ఎస్‌ఐ ఇంద్రసేనా రెడ్డి హెచ్చరించారు. సోమవారం బస్టాండ్ సెంటర్‌లో ఆటో డ్రైవర్లకు ట్రాఫిక్ నియమాలపై అవగాహన కల్పించారు. తరుచూ బస్టాండ్ సెంటర్‌లో ఆటోల నిలుపుదలతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడి ఇబ్బందులు కలుగుతాయన్నారు. ఇతర ప్రాంతాల నుంచి వచ్చే కూరగాయలు, పండ్లు, నిత్యావసర వస్తువులు విక్రయించే ఆటోలపై దృష్టి సారించామన్నారు. ఎవరైనా ట్రాఫిక్‌కు అంతరాయం చేస్తే కేసులు నమోదు చేస్తామని ఆయన హెచ్చరించారు.

విద్యా సామగ్రి పంపిణీ



విద్యాసామగ్రిని అందజేస్తున్న టీడీపీ నాయకులు

వరికుంటపాడు, జూలై 8: తూర్పుబోయమడగల ప్రాథమికోన్నత పాఠశాల విద్యార్థులకు సోమవారం గ్రామానికే చెందిన టీడీపీ నాయకులు నాదెండ్ల నారయ్య, ఎంఎంకె చౌదరి, చల్లకొలుసు బాలరాజులు విద్యా సామగ్రిని అందజేశారు. ఎమ్మెల్యే కాకర్ల సురేష్ ఆదేశాల మేరకు పలకలు, నోట్ పుస్తకాలు, పెన్నులు పంపిణీ చేశామన్నారు. కార్యక్రమంలో చిన్ననారయ్య, సురేష్, మదన్, అజయ్, తోడిందల రత్తయ్య పాల్గొన్నారు.

డిప్యూటీ సీఎం చిత్రపటం అందజేత



డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని తహసీల్దారుకు అందచేస్తున్న నాయకులు

సంగం, జూలై 8: స్థానిక తహసీల్దారు, మండల కార్యాలయాలకు జనసేన వ్యవస్థాపకులు, డిప్యూటీ సీఎం కొణిదల పవన్ కల్యాణ్ చిత్రపటాన్ని సోమవారం జనసేన నాయకులు అందజేశారు. పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి నలిశెట్టి శ్రీధర్ ఆదేశాల మేరకు నియోజకవర్గ ఉపాధ్యక్షుడు, చిరంజీవి యూత్ అధ్యక్షులు దాడి భాను కిరణ్ ఆధ్వర్యంలో తహసీల్దారు రమాదేవి, ఎంపీడీవో సూపరింటెండెంట్ జ్యోతిలక్ష్మికి అందజేసి కార్యాలయాల్లో ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జనసేన, చిరంజీవి యూత్ నాయకులు కృష్ణమోహన్, యామల రాజా, కిషోర్, షేక్ జబాన్‌బాష, వినయ్, వెంకటేష్, నాని ప్రవీణ్ పాల్గొన్నారు.

హెల్మెట్ తప్పనిసరి

ఉదయగిరి రూరల్, జూలై 8: ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని ఉదయగిరి జూనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయాధికారి జే.అంజయ్య తెలిపారు. సోమవారం స్థానిక పెట్రోల్‌బంకు నుంచి బస్టాండ్ సెంటర్ వరకు న్యాయవాదులు, పోలీసులు, కోర్టు సిబ్బందితో కలిసి హెల్మెట్ ధరించి అవగాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం స్థానిక బస్టాండ్ సెంటర్‌లో ఆయన మాట్లాడారు. న్యాయస్థానాల ఆదేశాల మేరకు హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపితే చట్టపరమైన చర్యలు తప్పవన్నారు. కార్యక్రమంలో ఏఎస్ఐ శ్రీనివాసులు, న్యాయవాదులు రామారావు, సుధాకర్, షరీఫ్, మస్తాన్, సిబ్బంది పాల్గొన్నారు.



అవగాహన కల్పిస్తున్న న్యాయాధికారి అంజయ్య

ఉచిత ఇసుక పాలసీతో ఊపందుకోనున్న నిర్మాణరంగం

కావలి, జూలై 8: ప్రభుత్వం ఉచిత ఇసుకపాలసీ తీసుకుని రావటంతో నిర్మాణరంగం ఊపందుకోనుందని ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎన్నికలలో ఇచ్చిన హామీని సీఎం చంద్రబాబు అధికారం చేపట్టిన నెలలోపే అమల్లోకి తీసుకువచ్చాడని పేర్కొన్నారు. కూటమి పాలనలో అమలులో ఉంటున్న ఉచిత ఇసుక పాలసీపై నిరంతరం విజిలెన్స్ పర్యవేక్షణ ఉంటుందని ఆయన వివరించారు. గత ప్రభుత్వంలో జగన్మోహన్‌రెడ్డి ఇసుక కుంభకోణం ద్వారా రూ. 50వేల కోట్లుకుపైగా కొల్లకొట్టారన్నారు. వైసీపీ నేతలే ఇసుకాసుర అవతారమెత్తి దోచుకున్నారని తెలిపారు.

హెచ్చరిక బోర్డు ఏర్పాటు

అనంతసాగరం, జూలై 8: మంచాలపల్లి సమీపంలోని సర్వే నెంబర్ 1065-1 లోని రెండు ఎకరాల ప్రభుత్వ భూమి కొందరు ఆక్రమించారు. ఎవరూ ఇందులో ప్రవేశించరాదంటూ సోమవారం రెవెన్యూ అధికారులు హెచ్చరిక బోర్డు ఏర్పాటు చేశారు.



కావలి
కందుకూరు, ఆత్మకూరు, ఉదయగిరి

కందుకూరులో మౌలిక సమస్యలు పరిష్కరించాలి



కందుకూరు : సబ్ కలెక్టరు విద్యాధరికి వినతిపత్రం అందజేస్తున్న సీపీఎం నాయకులు

కందుకూరు, జూలై 8: పట్టణంలో మౌలిక సదుపాయాల అభివృద్ధికి, శివారు కాలనీల్లో సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు చేపట్టాలని సీపీఎం ప్రతినిధి బృందం సబ్ కలెక్టరు, మున్సిపాలిటీ ప్రత్యేకాధికారిణి జి. విద్యాధరికి విజ్ఞప్తి చేశారు. సోమవారం వారు ఆమెను కలిసి మున్సిపాలిటీలో ప్రజలు ఎదుర్కొంటున్న ప్రధాన సమస్యలను వివరించి పరిష్కారించాలని కోరారు. పట్టణంలోని అనేకప్రాంతాలలో రోడ్లు, డ్రైనేజీల లాంటి మౌలిక సదుపాయాలు అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. అలాగే తాగునీటి సమస్య, పారిశుధ్యం నిర్వహణ సమస్యను పరిష్కరించటంతో పాటు ట్రాఫిక్ సమస్య పరిష్కారం చూపాలన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నాయకులు ఎస్‌కే మున్వర్‌సుల్తానా, ఎస్ఏ గౌస్, ఎస్. పవన్, ఎం. పద్మ, ఎం. ప్రసాదు, డీఎం రాయుడు తదితరులు పాల్గొన్నారు.

అర్జీల నమోదు

కావలి : ఆర్డీవో కార్యాలయానికి డివిజన్‌లోని పలు ప్రాంతాల నుంచి ప్రజలు తమ సమస్యలను తెలిపేందుకు వస్తుంటారు. అయితే పరిష్కారవేదికకు వచ్చిన అర్జీలను, సత్వర పరిష్కారంలో భాగంగా వాటిని ముందుగా పుస్తకంలో నమోదు చేస్తున్నారు. ఆర్డీవో కార్యాలయం బయట సోమవారం ఒక సెల్ ఏర్పాటు చేసి తొలుత అర్జీదారులు తమ సమస్యలతో కూడిన అర్జీల వివరాలు తెలుపుతూ అక్కడ నమోదు చేసుకుంటున్నారు. ఆ తర్వాత ఆ అర్జీలు ఆర్డీవో శీనానాయక్ వద్దకు తీసుకెళ్లి తమ సమస్యలను వివరిస్తున్నారు. ఇప్పుడు అర్జీలను పుస్తకంలో నమోదు చేసుకుంటున్నందున వాటి పరిష్కారం ఎంతవరకు వచ్చిందో తెలుసుకునే అవకాశం కలుగుతోంది.

ఉపాధి కూలీల సమస్యలు పరిష్కరించాలి

జలదంకి : మండలంలోని ఉపాధి హామీ కూలీల సమస్యలు పరిష్కరించాలని ఏపీ వ్యవసాయ కూలీసంఘం, రైతు సంఘాల నేతలు సోమవారం ఎంపీడీవో రామచంద్రకు వినతిపత్రం అందించారు. మండలంలోని అన్నిగ్రామాల కూలీలకు ఉపాధి పనులు కల్పించాలని, పనులు జరిగే చోట తాగు నీరు ఇతర సౌకర్యాలు కల్పించాలని కోరారు. వినతిపత్రం అందించిన వారిలో నాయకులు మేలంగి ఆంథోనిబాబు, తాళ్ళూరి మాల్యాద్రి, రావి మాల్యాద్రి తదితరులు ఉన్నారు.

తహసీల్దార్ కార్యాలయంలో హెల్ప్‌డెస్క్

జలదంకి తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం హెల్ప్‌డెస్క్‌ను తహసీల్దార్ వాసు ఏర్పాటు చేశారు. కార్యాలయం పనివేళల్లో ఈ హెల్ప్‌డెస్క్ అందుబాటులో ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ హెల్ప్‌డెస్క్ లో ఓ ఉద్యోగిని నియమించామన్నారు. సందర్శకులకు కావాల్సిన వివరాలు, వీఆర్వోల సమాచారాన్ని ఈ హెల్ప్‌డెస్క్ ద్వారా పొందవచ్చన్నారు.

కార్యాలయాల్లో అధినేతల చిత్రపటాల ఏర్పాటు



కలిగిరి : ఎంపీడీవోకు చిత్రపటాలు అందిస్తున్న టీడీపీ నేతలు

కావలి, జూలై 8: స్థానిక జనతాపేటలోని సచివాలయం, అర్బన్‌హెల్త్ సెంటర్‌లో సోమవారం కూటమినేతల చిత్రపటాలను స్థానిక నేతలు ఏర్పాటు చేశారు. 29, 31 వార్డుల టీడీపీ ఇన్‌చార్జిలు సురే మదన్‌మోహన్‌రెడ్డి, మంచాల ప్రసాద్‌ల ఆధ్వర్యంలో ప్రధాని మోదీ,సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్, ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డిల చిత్రపటాలను ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు దామా మాల్యాద్రి, కాండ్ర గంగినాయుడు, బొట్లగుంట హరిబాబు, కాండ్ర భాస్కర్‌నాయుడు, రామమోహన్, మద్దా మల్లి కార్జున్, చల్లా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

కలిగిరి: స్థానిక తహసీల్దారు కార్యాలయం, ఎంపీడీవో కార్యాలయాలకు సోమవారం టీడీపీ నేతలు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే కాకర్ల సురేష్‌ల చిత్రపటాలతోపాటు గోడ గడియారాలను బహూకరించారు. కార్యక్రమంలో తహసీల్దారు బాలకిషోర్, ఎంపీడీవో రంగసుబ్బరాయుడు, టీడీపీ నేతలు బిజ్జం కృష్ణారెడ్డి, కాకు మహేష్, చీమల తాతయ్య, వేళ్ళ నరేంద్ర, ఊసా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.

బిట్రగుంట: బోగోలు మండలం ఎస్వీపాలెం సచివాలయానికి స్థానిక యువనేత అన్నంగి ఆదిశేషయ్య యాదవ్ సోమవారం సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, ఎమ్మెల్యే దగ్గుమాటి వెంకటక్రిష్ణారెడ్డి చిత్రపటాలను బహూకరించారు.ఈ కార్యక్రమంలో టీడీపీ మండల, జిల్లా నాయకులు నాగేశ్వరరావు, వెంకటేశ్వర్లురెడ్డి, వెంకారెడ్డి, హర్ష, పి.శీనయ్య, శ్రీనివాసులురెడ్డి, కే.తిరుపతి తదితరులు పాల్గొన్నారు.

దోమల నివారణకు మందు పిచికారీ

ఉలవపాడు, జూలై 8 : అంటువ్యాధులు ప్రబలకుండా ఉలవపాడులో సోమవారం అబేట్ పిచాకారీ చేశారు. మురికి కాలువలు, నీరు నిలువ ఉన్న చోట ఈ మందు పిచికారీ చేసినట్లు పంచాయతీ కార్యదర్శి విజయమ్మ తెలిపారు. ట్రంక్‌రోడ్డు ప్రధాన రహదారుల్లో, మురికి కాలువల్లో ప్రతిరోజు అబేట్ పిచకారీ చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మ, ఆరోగ్య కార్యకర్త అల్తాఫ్ తదితరులు పాల్గొన్నారు.

అధిక పాల ఉత్పత్తికి ప్రత్యేక దాణా అవసరం

పలేటివారిపాలెం, జూలై 8 : అధిక పాల ఉత్పత్తికి ప్రత్యేక దాణా చాలా అవసరమని కందుకూరు డివిజన్ ఉప సంచాలకుడు డాక్టర్ సీహెచ్ చంద్రశేఖర్ తెలిపారు. మండలంలోని చుండిలో సర్పంచి ఇరపని సతీష్ అధ్యక్షతన సోమవారం పశుగ్రాస వారోత్సవాలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో చంద్రశేఖర్ మాట్లాడుతూ పాడి గేదెలకు ఎండుగడ్డి, పచ్చిగడ్డి తగు నిష్పత్తిలో ఇచ్చినప్పుడే బాగా పాలు ఇస్తాయన్నారు. కార్యక్రమంలో స్థానిక సహయ సంచాలకులు బ్రహ్మయ్య, మండల పశువైద్యాధికారి డాక్టర్ వంశీ, సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

లిఖిత్‌కుమార్‌కు నవోదయలో సీటు

పలేటివారిపాలెం, జూలై 8 : స్థానిక ప్రగతి యూపీ స్కూల్ విద్యార్థి చుండూరి లిఖిత్‌కుమార్‌కు జవహర్ నవోదయ పాఠశాలలో సీటు లభించింది. ఈ సందర్భంగా లిఖిత్‌కుమార్‌ను, అతని తల్లిదండులను సోమవారం యూపీ స్కూల్ కరస్పాండెంట్ దాసరి తిరుమలరావు, ప్రిన్సిపాల్ అజజ్‌కుమార్, ఉపాధ్యాయులు అభినందించారు.

విద్యుత్ అధికారుల విస్తృత తనిఖీలు

ఉలవపాడు, జూలై 8 : మండలం పరిధిలోని 40 గ్రామాల్లో విద్యుత్ శాఖ అధికారులు సోమవారం విస్తృత తనిఖీలు చేపట్టారు. 2,556 సర్వీసులు తనిఖీ చేసి, 113 కేసులు నమోదు చేశామన్నారు. వీటికి రూ.5,57,500 అపరాధ రుసుము విధించినట్లు ఏఈ శ్రీనివాసులు చెప్పారు. ఈ దాడుల్లో ఒంగోలు విద్యుత్‌శాఖ ఈఈ కట్టా వెంకటేశ్వర్లు, డీఈఈ శ్రీనివాసరావు, ఏఈఈలు ఖాన్, ఆపరేషన్ ఈఈ వీరయ్య, పీ యుగంధర్, కందుకూరు డివిజన్ డీఈఈలు, ఏఈలు, లైన్‌మెన్‌లు పాల్గొన్నట్లు ఆయన తెలిపారు.

క్షేత్ర సహాయకుడిని తొలగించాలి

కొండాపురం, జూలై 8: అవినీతికి పాల్పడుతున్న ఉపాధి హామీ క్షేత్రసహాయకుడిని విధుల నుంచి తొలగించాలని సత్యవోలు గ్రామస్థుడు డేగ నాగేశ్వరరావు, తదితరులు సోమవారం ఎంపీడీవో సుజాతకు వినతిపత్రం అందచేశారు. అనంతరం వారు మాట్లాడుతూ క్షేత్రసహాయకుడు జడపల్లి రమేష్ గ్రామానికి చెందిన ఎస్సీ, ఎస్టీ ఇతర కుటుంబాల వారు పనులకు వెళ్లకున్నా, వెళ్తున్నట్లు బోగస్ మస్టర్‌లు చేసుకొని ఉపాధిహామీ నిధులను స్వాహాచేశాడని తెలిపారు. ఈ విషయంపై గతంలో ఫిర్యాదుచేసినప్పటికీ ఇప్పటి వరకు చర్యలు తీసుకోలేదన్నారు. ఉపాధి హామీ రికార్డులను పరిశీలించి క్షేత్రసహాయకుడిపై చర్యలు తీసుకోవాలని వారు కోరారు.

డిప్యూటీ డీఈవో ఆకస్మిక తనిఖీ

కొండాపురం: మండల పరిధిలోని సాయిపేట దామా చినబాబు మెమోరియల్ పాఠశాల, మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలలను కందుకూరు డివిజన్ డిప్యూటీ డీఈవో వరప్రసాద్ సోమవారం ఆకస్మిక తనిఖీ చేశారు. ముందుగా సాయిపేట జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లిన ఆయన పదవతరగతి విద్యార్థుల అభ్యసనాసామర్థ్యాలను పరిశీలించారు. హెచ్ఎం బాలక్రిష్ణయ్యతో కలసి పాఠశాల ఆవరణలో మొక్క నాటారు. అనంతరం మండల కేంద్రంలోని జడ్పీ ఉన్నత పాఠశాలకు వెళ్లి తనిఖీచేశారు. అక్కడ నుంచి మండల విద్యావనరులకేంద్రానికి వెళ్లారు. ఈ కార్యక్రమాల్లో ఎంఈవోలు కే.రవికుమార్, ఆనందరావు పాల్గొన్నారు.

బిట్రగుంట రైల్వే అభివృద్ధిపై దృష్టి పెట్టండి

బిట్రగుంట : రైల్వే రోజురోజుకు శిథిలావస్థకు చేరుకుంటున్నదని, ఈ విషయమై ప్రత్యేక దృష్టి పెట్టాలని బీజేపీ మండల అధ్యక్షుడు నూకసాని శ్రీనివాసులుయాదవ్ ఎంపీ పురందేశ్వరిని కోరారు. సోమవారం రాజమండ్రిలో జరిగిన బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంలో ఆయన ఈ మేరకు ఆమెకు వినతిపత్రం ఇచ్చారు. వందలాది ఎకరాల రైల్వే స్థలాలు నిరుపయోగంగా మారాయని, ఇక్కడ రైల్వే ప్రాజెక్టులు ఏర్పాటు చేస్తే రైల్వేకి ఆదాయం, నిరుద్యోగ యువతకు ఉపాధి లభిస్తుందని ఆయన వివరించారు.

మంత్రి దృష్టికి కావలి నియోజకవర్గ సాగునీటి సమస్యలు



జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడుతో కావలి ఎమ్మెల్యే, కావ్య, బీద రవిచంద్ర తదితరులు

కావలి,జూలై 8: నియోజకవర్గంలోని సాగునీటి వనరుల సమస్యలను జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడి దృష్టికి ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి బీద రవిచంద్ర తీసుకెళ్లారు. సోమవారం వారు అమరావతిలోని మంత్రి చాంబరుకు వెళ్లి ఆయన్ను కలిశారు. ఈ సందర్భంగా నియోజకవర్గంలోని నీటివనరులు, తదితర సమస్యలపై ఆయనతో చర్చించారు. వీటిపై మంత్రి సానుకూలంగా స్పందించినట్లు వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో వారి వెంట గుంటుపల్లి రాజకుమార్ చౌదరి తదితరులు ఉన్నారు.

సమ్మర్ స్టోరేజీ ట్యాంకు పరిశీలన



సమ్మర్ స్టోరేజీ ట్యాంకును పరిశీలిస్తున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు, అధికారులు

కందుకూరు, జూలై 8: పట్టణానికి తాగునీరందించే రామతీర్థం మంచినీటి పథకం సమ్మర్ స్టోరేజీ ట్యాంకును సోమవారం సాయంత్రం ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు అధికారులు, స్థానిక నేతలతో కలిసి పరిశీలించారు. ట్యాంకు వద్ద ఉన్న ఫిల్టర్‌బెడ్ల మరమ్మతులు జరుగుతున్నందున తాగునీటి సరఫరా విషయమై మున్సిపల్ కమిషనర్ కేవీ కృష్ణారెడ్డి, పబ్లిక్‌హెల్త్ అధికారులను అడిగి ఎమ్మెల్యే తెలుసుకున్నారు. అనంతరం ఏకలవ్యనగర్, జనార్దన్ ఎస్టీ కాలనీల్లో ఎమ్మెల్యే పర్యటించి సమస్యలనడిగి తెలుసుకున్నారు. ఆయన వెంట నాయకులు దామా మల్లేశ్వరరావు, ఉప్పుటూరి శ్రీనివాసరావు, పిడికిటి వెంకటేశ్వర్లు, ఉన్నం వీరాస్వామి, అల్లం వెంకటేశ్వర్లు తదితరులు ఉన్నారు.

ముస్లింలకు సముచితస్థానం కల్పించడం హర్షనీయం

కావలి, జూలై 8: టీడీపీలో ముస్లింలకు సముచిత స్థానం కల్పించటం హర్షణీయమని పలువురు ముస్లిం నేతలు తెలిపారు. టీడీపీ పట్టణ మహిళా అధ్యక్షురాలిగా షేక్ అర్షియా బేగంను ఎమ్మెల్యే దగుమాటి వెంకటక్రిష్ణారెడ్డి సూచనల మేరకు జిల్లా అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ నియమించారు. ఈ సందర్భంగా సోమవారం కావలి టీడీపీ కార్యాలయంలో అర్షియా బేగంను పలువురు నేతలు సన్మానించారు. అనంతరం వారు విలేకరులతో మాట్లాడారు. గతంలో మైనార్టీ పదవుల్లోనే మాత్రమే ముస్లింలకు స్థానం కల్పించేవారన్నారు. మొట్ట మొదటి సారిగా పట్టణ మహిళా అధ్యక్షురాలిగా ముస్లిం మహిళకు ప్రాధాన్యత కల్పించినందుకు ఎమ్మెల్యే క్రిష్ణారెడ్డికి రుణపడి ఉంటామన్నారు. ఈ సమావేశంలో ముస్లిం నేతలు సయ్యద్ అబ్దుల్ రహీం, షేక్ ఖాదర్‌బాష, షేక్ రఫీ, సర్దార్ కిర్మాణీ, షేక్ రఫీ అహ్మద్, ఖమర్‌బాబు, హజరత్, షేక్ ఇబ్రహీం, ఖాదర్ బాష తదితరులు పాల్గొన్నారు.

ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పునఃప్రారంభించాలి

కొండాపురం : రక్షిత మంచినీటి సరఫరా కోసం గతంలో టీడీపీ ప్రభుత్వం ఏర్పాటుచేసిన ఎన్టీఆర్ సుజల స్రవంతి పథకాన్ని పునఃప్రారంభించాలని మండల టీడీపీ నాయకులు కోరారు. సోమవారం ఆపథకాన్ని మాజీ వైస్ ఎంపీపీ పోలినేని చంద్రబాబునాయుడు, టీడీపీ నేతలు పోలినేని రమేష్, గద్దె రామక్రిష్ణ,దాసరి అశోక్ తదితరులు పరిశీలించారు. మండలంలోని తాగునీటిలో ఫ్లోరైడ్ శాతం అధికంగా ఉండటంతో గతంలో టీడీపీ ఈపథకాన్ని మంజూరు చేసిందన్నారు. పథకం పూర్తయి నీటి సరఫరా కొద్దిరోజులు జరిగాక వైసీపీ ప్రభుత్వం ఆపివేసిందన్నారు. ఈ పథకాన్ని పునః ప్రారంభించేందుకు కృషిచేస్తామని వారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకుడు కిలారి నరేంద్ర తదితరులు పాల్గొన్నారు.

రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

కావలి రూరల్ : రైతు సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని కావలి ఏడీఏ నాగరాజు పేర్కొన్నారు. పట్టణంలోని ఎరువులు, విత్తనాలు, పురుగు మందుల దుకాణాల్లో వ్యవసాయశాఖ, విజిలెన్స్ అధికారులు సోమవారం తనిఖీలు నిర్వహించారు. పట్టణంలోని వీరరాఘవ ఫర్టిలైజర్స్, శ్రీనాగార్జున సీడ్స్, నాగమోహన్ దుకాణాల్లో ఈ తనిఖీలు చేపట్టారు. ఈ కార్యక్రమంలో కనిగిరి ఏడీఏ ఈ వెంకటరమణ, జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయ ఏడీఏ నర్సోజి, విజిలెన్స్ సీఐ సుధాకర్‌రెడ్డి, ఏవో లలిత తదితరులు పాల్గొన్నారు.

లోఓల్టేజీ సమస్య పరిష్కారం

బిట్రగుంట : బోగోలు శివాలయం వీధిలో కొంతకాలంగా లోఓల్టేజీ సమస్య ఉంది. ఎన్నికల సమయంలో స్థానికులు ఈ సమస్యను దగ్గుమాటి క్రిష్ణారెడ్డి దృష్టికి తీసుకెళ్లారు. ఎమ్మెల్యేగా ఆయన విజయం సాధించాక సమస్యను పరిష్కరించారు. ఈ క్రమంలో సోమవారం అదనపు ఫేస్ విద్యుత్ తీగలను ఏర్పాటు చేశారు. లైన్‌మన్ రమేష్ యుద్ధ ప్రాతిపదికన పనులు చేసి, విద్యుత్ సరఫరా చేశారు

బాధిత కుటుంబానికి ఆర్థిక సాయం

కందుకూరు : పవన్‌కళ్యాణ్ డిప్యూటీ సీఎంగా ప్రమాణస్వీకారం చేస్తున్న సందర్భంగా మండలంలోని మాచవరంలో ఫ్లెక్సీలు కడుతూ విద్యుత్‌షాక్‌కు గురై జనసైనికుడు ఇనకొల్లు నరసింహారావు మృతిచెందాడు. ఆయన తల్లిదండ్రులకు సోమవారం ప్రకాశం జిల్లా కాపు సంఘం తరపున రూ. 1,29,801ల ఆర్థికసహాయం అందించారు. పారిశ్రామికవేత్త మద్దిశెట్టి శ్రీధర్, కందుకూరు నియోజకవర్గ కాపుసంఘం అధ్యక్షుడు దారం మాల్యాద్రి, జిల్లా చిరంజీవి యూత్ అధ్యక్షుడు అడుసుమల్లి వెంకటరావు, ఇతర దాతల తోడ్పాటుతో ఈ మొత్తాన్ని సేకరించారు. బస్తా బియ్యంతోపాటు ఆ మొత్తాన్ని బాధిత కుటుంబానికి అందజేశామని సంఘం అధ్యక్షుడు కొక్కిరాల సంజీవ్‌కుమార్ తెలిపారు.

గ్రామాల్లో మొక్కలు నాటాలి

కోవూరు, జూలై 8: సిబ్బంది కోవూరు క్లస్టర్ పరిధిలోని గ్రామాల్లో విరివిగా మొక్కల్ని నాటేందుకు కార్యక్రమాన్ని రూపొందించుకోవాలని డ్వామా పీడీ బీ శ్రీనివాసులు కోరారు. క్లస్టర్ పరిధిలోని సిబ్బందితో సోమవారం ఆయన ఎంపీడీవో కార్యాలయంలో మాట్లాడారు. రైతులు మొక్కల్ని పెంచేందుకు వీలుగా ఉపాధిహామీ, ఉద్యానవన శాఖ, వ్యవసాయశాఖల సిబ్బంది దరఖాస్తులు స్వీకరించాలన్నారు. కోవూరు, కావలి, బోగోలు, దగదర్తి, బుచ్చిరెడ్డిపాళెం, విడవలూరు, కొడవలూరు, ఇందుకూరుపేట మండలాల సిబ్బంది పాల్గొన్న ఈ సమావేశంలో ఏపీడీ మృదుల, క్వాలిటీ కంట్రోల్ ఈఈ వేణుగోపాల్ తదితరులు మాట్లాడారు.

వైద్యశిబిరం పరిశీలన

ఇందుకూరుపేట, జూలై 8 : మండలంలోని కొత్తూరులో నిర్వహిస్తున్న ఉచిత వైద్యశిబిరాన్ని సోమవారం డిప్యూటీ డీఎంహెచ్‌వో డాక్టర్ షేక్.ఖాదర్‌వలి పరిశీలించారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని ఆయన తనిఖీ చేశారు. అడల్ట్ బీసీజీ వ్యాక్సినేషన్ కార్యక్రమాన్ని వేగవంతం చేయాలని తెలిపారు. అనంతరం ఇందుకూరుపేట అంగన్‌వాడీ సెంటర్‌ను సందర్శించి, పౌష్టికాహారం పంపిణీపై ఆరా తీశారు. తదుపరి చిన్నారుల ఆరోగ్య పరిస్థితి గురించి డాక్టర్ కిషోర్‌కుమార్, డాక్టర్ బ్రహ్మేశ్వర నాయుడుతో చర్చించారు. ఈ కార్యక్రమంలో డీపీసీ విజయ్‌కుమార్, హెల్త్ ఎడ్యుకేషన్ సుధాకర్‌రావు, ఎస్‌టీ ఎస్ జావీద్, సీహెచ్‌వోలు సాయిశార్వాణి, నీలిమ, హెల్త్ అసిస్టెంట్ మాధవ తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఇళ్ల స్థలాలు కేటాయించాలి

విడవలూరు, జూలై 8 : విడవలూరు పంచాయతీలో అర్హులయిన దళిత,గిరిజనులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని మాల మహానభ రాష్ట్ర అధ్యక్షురాలు పల్లం శేషమ్మ తెలిపారు. ఈ మేరకు ఆమె సోమవారం తహసీల్దారు శ్రీనివాస్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ వైసీపీ ప్రభుత్వంలో నిరుపేదలకు ఇళ్ల స్థలాలు కేటాయిస్తామని చెప్పి ఇవ్వకుండా మోసం చేశారని తెలిపారు. నిలువ నీడలేని దళితులు విడవలూరులో అనేక మంది ఉన్నారని ఆమె తహసీల్దారు దృష్టికి తెచ్చారు. కార్యక్రమంలో దళిత, గిరిజన మహిళలు పాల్గొన్నారు.

అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు పెట్టాలి

మనుబోలు, జూలై 8: మండలంలోని అన్ని గ్రామాల్లో ఉపాధిహామీ పనులు పెట్టాలని సీపీఎం నాయకులు తలారి దేవదానం, బీసీ భాస్కర్, ఆదిశేషయ్య డిమాండ్ చేశారు. సోమవారం మండల కార్యాలయంలోని ఏవో రవికుమార్ రెడ్డికి వినతిపత్రం అందజేసి మాట్లాడారు. రాజకీయ కారణాలతో రెండునెలలుగా గ్రామాల్లో ఉపాధి పనులు జరగడం లేదన్నారు. అలాగే కూలీలకు ఇవ్వాల్సిన కూలీ డబ్బులు నిలిచిపోయినట్లు వాపోయారు. గ్రామాల్లో క్షేత్ర సహాయకులను మార్చి, అధికార పార్టీకి అనుకూలంగా ఉండే వారిని నియమించే వరకు పనులు నిలిపినట్లు తెలిసిందన్నారు. దీనివలన కూలీలు నష్టపోతున్నారని మండిపడ్డారు. ఉపాధి కూలీలకు అన్నిరకాల వసతులు కల్పించాలని, బకాయిలు వెంటనే ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో సీపీఎం నాయకులు పాల్గొన్నారు.

గ్రీవెన్స్ డేకు ఐదు అర్జీలు



వృద్ధుడి సమస్యలు వింటున్న తహసీల్దార్ చిరంజీవి

మనుబోలు, జూలై 8: స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన ప్రజావిజ్ఞప్తుల దినానికి 5అర్జీలు వచ్చినట్లు తహసీల్దార్ చిరంజీవి తెలిపారు. భూ సమస్యలపై 3, ఇతర సమస్యలపై 2 అర్జీలు రాగా వాటిని పరిష్కరించాలని సిబ్బందిని ఆదేశించామన్నారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఇతర శాఖల అధికారులతో తహసీల్దార్ మండలంలోని సమస్యలపై చర్చించారు.

నానో యూరియా.. వేరుశనగకు ప్రయోజనకరం



పొలాన్ని పరిశీలిస్తున్న వ్యవసాయ అధికారులు

ముత్తుకూరు, జూలై 8: నానో యూరియా వేరుశెనగ పంటకు ప్రయోజనకరమని వ్యవసాయశాఖ సహాయ సంచాలకులు రాజ్‌కుమార్ తెలిపారు. పంటపాలెం గ్రామంలో సోమ వారం వ్యవసాయ అధికారులు వేరుశెనగ రైతులతో సమావేశం ఏర్పాటు చేశారు. మూడేళ్ల కిందట నానో యూరియా అందుబాటు లోకి వచ్చినా చాలామందికి అవగాహన లేదన్నారు. ఇప్పుడొచ్చిన నానో యూరియా ప్లస్‌లో నానో యూరియా శాతం 20 శాతం ఉందని అందువల్ల రైతులు తప్పకుండా దీన్ని వాడి వ్యవసాయ ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించాలని సూచించారు. కార్యక్రమంలో ఇఫ్కో జిల్లా మేనేజర్ లక్ష్మీనారాయణ, మండల వ్యవసాయ అధికారి జోత్స్న రాణి, కేవీకే శాస్త్రవేత్త కిరణ్‌కుమార్‌రెడ్డి, స్థానిక వీఏఏలు రమణమ్మ, కరీం, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఆక్రమణ భూమిని పరిరక్షించండి



తహసీల్దారుకు వినతిపత్రం అందజేస్తున్న టీడీపీ నాయకులు

తోటపల్లిగూడూరు: కోడూరు బిట్-1 రెవె న్యూ గ్రామ పరిధిలోని సర్వే నెంబరు 1105- 2.20 సెంట్ల భూమి వెబ్ ల్యాండ్ అడంగల్‌లో పోరంబోకు స్థలంగా నమోదు అయ్యిందని, దీన్ని వైసీపీ నాయకులు కొందరు ఆక్రమించి చదును చేసి వ్యవసాయ సాగుబడి చేసుకు న్నట్లు గ్రామ టీడీపీ నాయకులు దామవరపు దయాకర్, ఊటుకూరు దేవా, అవినాష్ తెలిపారు. ఈ విషయంపై సోమవారం వారు మండల తహసీల్దారు మాధవరెడ్డిని కలిసి వినతి పత్రం అందజేసి మాట్లాడారు. ఈ భూమిలో గ్రామానికి చెందిన కొందరు కర్మకాండలు చేసుకుంటూ అలాగే రజకులు దోబీ పని చేసుకుంటూ జీవనోపాధి పొందుతున్నారని చెప్పారు. ఆక్రమించిన దొరువు భూమిలో పూడిక తీసి గ్రామస్తులకు ఉపయోగపడేలా చూడాలని కోరారు.

ఇసుకను అక్రమంగా తరలిస్తే కఠిన చర్యలు



ఇందుకూరుపేట : ఉచిత ఇసుక రవాణా ప్రారంభంలో ఎమ్మెల్యే ప్రశాంతిరెడ్డి

ఇందుకూరుపేట, జూలై 8 : ఇసుక అక్రమ రవాణాకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి హెచ్చరించారు. మండలంలోని పల్లిపాడు ఇసుక డంపింగ్ యార్డును సోమవారం ప్రశాంతిరెడ్డి పూజలు చేసి ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ గత ప్రభుత్వంలో ఇసుక అక్రమ రవాణా వల్ల రోడ్లు పూర్తిగా ధ్వంసం అయ్యాయన్నారు. ఈ రోడ్లన్నీ మరమ్మతులు చేసి పూర్తిస్థాయిలో అందుబాటులోకి తెస్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు దువ్వూరు కళ్యాణ్ రెడ్డి, కోడూరు కమలాకర్‌రెడ్డి, రావెళ్ల వీరేంద్రనాయుడు, పొన్నెబోయిన చెంచలబాబు యాదవ్, చెంచుకి షోర్‌బాబు, అవ్వారు ఏడుకొండలు, నెల్లూరు రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు.

● బుచ్చిరెడ్డిపాళెం: సీఎం చంద్రబాబు ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు అధికారంలోకి వచ్చిన నెలలోపే ఉచిత ఇసుక పాలసీని అమలు చేయడం సంతోషకరమని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. సోమవారం మండలంలోని మినగల్లు స్టాక్ యార్డులో ఆర్డీవో మలోలా, సర్పంచు పూజిత ఇతర అధికారుల ఆధ్వర్యంలో ఇసుక రవాణాను ప్రారంభించారు. నాలుగున్నర టన్నుల (ట్రాక్టర్) ఇసుకకు రూ.1,665లకు అందజేశారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ కేవలం లోడింగ్, షిఫ్టింగ్ ఛార్జీలు మాత్రమే తీసుకుని ఇసుకను ఉచితంగా అందిస్తున్నట్టు ఆమె తెలిపారు. ఉదయం 6నుంచి సాయంత్రం 6గంటల వరకు నిబంధనల మేరకు ఇసుక పంపిణీ జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో నాయకులు ఏటూరి శివరామకృష్ణారెడ్డి, హరికృష్ణ, ఎంవీ. శేషయ్య, ద్వారకానాథ్‌రెడ్డి, సురేష్, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

డేగపూడి-బండేపల్లి కాలువతో సాగునీరు తెస్తాం

● పోతురాజు తిరునాళ్లలో ఎమ్మెల్యే సోమిరెడ్డి



మాట్లాడుతున్న ఎమ్మెల్యే సోమిరెడ్డి

మనుబోలు, జూలై 8: త్వరలోనే డేగపూడి-బండేపల్లి కాలువను ముఖ్యమంత్రికి చెప్పి, నిధులు మంజూరు చేయించి అందుబాటులోకి తీసుకవస్తానని ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి అన్నారు. మండలంలోని బండేపల్లిలో 13 ఏళ్ల అనంతరం నిర్వహి స్తున్న పోతురాజు తిరునాళలో ఎమ్మెల్యే పాల్గొని పోతురాజుకు ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడారు. టీడీపీ హయాంలో డేగపూడి-బండేపల్లి కాలువను మంజూరు చేయిస్తే 2019లో వైసీపీ ప్రభుత్వం కమీషన్ల కోసం మూలన పెట్టారని మండిపడ్డారు. ఈ కాలువ పూర్తి అయితే 25వేల ఎకరాలకు సాగునీరు పుష్క లంగా అందుతుందన్నారు. కార్యక్రమంలో మండలాధ్యక్షుడు గాలి రామకృష్ణారెడ్డి, మస్తాన్ నాయుడు, భాస్కర్‌రెడ్డి, రవి, ఉడతా మస్తానయ్య, రమేష్, బాలు పాల్గొన్నారు.

సాని వెంకట రమణయ్యకు పరామర్శ

గుండె సంబంధిత వ్యాధితో అనారోగ్యానికి గురై చికిత్స పొందిన మండలకేంద్రంలోని టీడీపీ నాయకుడు సాని వెంకటరమణయ్యను ఎమ్మెల్యే సోమిరెడ్డి పరామర్శించారు. అనంతరం స్థానిక దళితవాడలో మాజీ సర్పంచు రాయపాటి కృష్ణవేణిని కలిశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు పచ్చిపాల రామిరెడ్డి, దండుచంద్రశేఖర్‌రెడ్డి, చేరెడ్డి పటాభీ రామిరెడ్డి, రాయపాటి కిరణ్‌కుమార్, రాజా గౌడ్, ప్రసాద్ పాల్గొన్నారు.

ఉపాధి కూలీలకు బకాయిలు చెల్లించాలి



కోవూరు : వినతిపత్రం సమర్పిస్తున్న వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

కోవూరు, జూలై 8: ఉపాధి హామీ కూలీల బకాయిల్ని వెంటనే చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు సోమవారం ఎంపీడీవో రామాంజనేయులుకు వినతిపత్రం సమర్పించారు. పని చేసే ప్రదేశంలో కూలీలకు సౌకర్యాలు ఏర్పాటు చేయాలన్నారు. ప్రతిదినం కనీస కూలీ రూ.600 చెల్లించాలని డిమాండు చేశారు. ఎంపీడీవోని కలిసిన వారిలో సంఘం నాయకులు పెద్దబ్బయ్య, విజయ్, గండవరం శేషయ్య, బుజ్జయ్య, యాకసిరి రమేష్ తదితరులు ఉన్నారు.

● వెంటనే పనులు కల్పించాలి

బుచ్చిరెడ్డిపాళెం : వెంటనే అన్ని గ్రామాల్లో ఉపాధి పనులు కల్పించాలని, కూలీలకు బకాయిలు కూడా చెల్లించాలని ఏపీ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు జొన్నలగడ్డ వెంకమరాజు కోరారు. ఈమేరకు సంఘం మండల నేతలతో కలిసి ఆయన సోమవారం ఎంపీడీవోకి వినతిపత్రం అందచేశారు. జిల్లాలో వ్యవసాయ సీజను ముగిసి మూడు నెలలు గడిచాయన్నారు. గ్రామాల్లో వ్యవసాయ కూలీలకు పనులులేక ఇబ్బందులు పడుతున్నారన్నారు. కావున వెంటనే ఉపాధి పనులు ప్రారంభించాలన్నారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు తంబి రమణయ్య, ఎస్‌కే.జానీబాషా, పోతంశెట్టి శ్రీనివాసులు, మద్దిశెట్టి సురేష్ తదితరులు పాల్గొన్నారు.

రాపూరులో వైఎస్సార్ జయంతి వేడుకలు

రాపూరు, (డక్కిలి), జూలై 8 : మండల కేంద్రంలో సోమవారం వైఎస్ రాజశేఖర రెడ్డి జయంతి వేడుకలు పార్టీ నాయకులు ఘనంగా జరుపుకొన్నారు. స్థానిక వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళులర్పించారు.

సైదాపురం: స్థానిక బస్టాండ్ సెంటర్‌లో పార్టీ మండల కన్వీనర్ మన్నా రపు రవికుమార్ వైఎస్ఆర్ విగ్రహం వద్ద పూలమాల వేసి నివాళులర్పించారు. కేక్ కట్ చేసి పండ్లు పంపిణీ చేశారు. వైస్‌ఎంపీపీ తిరకాల భాస్కర్, జేసీఎస్ మండల మాజీ కన్వీనర్ గుంటమడుగు శ్రీనివాసులు రాజు, పీఏసీఎస్ మాజీ అధ్యక్షులు ఆదిశేషగిరి నాయుడు, గోగినేని శివకుమార్, ఎన్‌డీసీసీబీ మాజీ డైరెక్టర్ కొండాపు మోహన్‌రావు పాల్గొన్నారు.

పాదయాత్ర భక్తులకు తినుబండారాల పంపిణీ

పొదలకూరు, జూలై 8: తిరుమలకు పాదయాత్రగా వెళ్లిన అమ్మవారిపాలెం గ్రామానికి చెందిన 200మంది సోమవారం రాపూరు మండలం మద్దిలమడుగు, తెలుగు గంగ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. వీరికి పొదలకూరు పట్టణానికి చెందిన కాసా శ్రీనివాసులు, వారి కుటుంబ సభ్యులు చిర్రా రమణారెడ్డి చేతుల మీదుగా బ్రెడ్లు, అరటి పండ్లు, బిస్కెట్లు, తినుబండారాలను అందజేసినట్లు పాదయాత్ర నిర్వాహక సభ్యులు అద్దంకి గిరినాయుడు తెలిపాడు.

నిడిగుంటపాలెం మాజీ సర్పంచి నేత్రదానం



కత్తి సుబ్బమ్మ (ఫైల్)

వెంకటాచలం, జూలై 8: నిడిగుంటపాళెం మాజీ సర్పంచి కత్తి సుబ్బమ్మ నేత్రాలను సోమవారం కుటుంబ సభ్యులు దానం చేశారు. కోవూరు సమీ పంలో జాతీయ రహదారిపై సోమవారం జరిగిన రోడ్డు ప్రమాదంలో సుబ్బమ్మకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నెల్లూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అయితే నేత్రదానం చేయాలని పలువురు కుటుంబ సభ్యులను కోరగా వెంటనే సుబ్బమ్మ కుమారులు వెంకయ్య, వేణు ఇద్దరూ అంగీకరిం చారు. పోస్టుమార్టం పూర్తి కాగానే సుబ్బమ్మ నేత్రాలను ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాలకు దానం చేశారు. సుబ్బమ్మ కుటుంబ సభ్యులను ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల వైద్యులు, సిబ్బంది, గ్రామస్థులు అభినందించారు.

పొదలకూరు విద్యార్థికి ఐఐటీ కాన్పూర్‌లో సీటు



నారా లోకేష్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్ అందుకుంటున్న స్నేహిత

పొదలకూరు, జూలై 8: పట్టణానికి చెందిన నాగేళ్ల స్నేహిత జేఈఈ అడ్వాన్స్‌లో ఓపెన్ కేటగిరిలో 88వ ర్యాంకు సాధించి ఐఐటీ కాన్పూర్‌లో సీటు కైవసం చేసుకుంది. సోమవారం విజయవాడలో జరిగిన ఓ కార్యక్రమంలో రాష్ట్ర విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ చేతుల మీదుగా ల్యాప్‌టాప్‌తో పాటు ప్రశంసలు అందుకుంది. విద్యార్థి తండ్రి కనుపర్తి ప్రాథమికోన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నాగేళ్ల శ్రీనివాసులు. విద్యార్థిని ప్రతిభకు స్నేహితులు, ఏపీటీఎఫ్ ఉపాధ్యాయులు, శ్రేయోభిలాషులు అభినందనలు తెలిపారు.


నెల్లూరు సిటీ, రూరల్

కోవూరు, సర్వేపల్లి

అంతా మా ఇష్టం!

● ఇదీ వార్డు సచివాలయాల్లో అడ్మిన్ల తీరు...
● ఆర్ఐల సేవకే పరిమితం ● ఆ 40 మంది రూటే సపరేటు
● కార్యాలయాలకు రారు...అందుబాటులో ఉండరు!

'ఇక్కడంతా మా ఇష్టం... అడిగేవారెవరు... మేము చెప్పిందే వేదం.. ఆర్ఐలకే సమాధానం చెప్తాం.. వారి ఆర్థిక అవసరాలు మాత్రమే తీర్చుతాం'....! అని నగరంలోని కొన్ని సచివాలయాల అడ్మిన్లు అంటున్నారు. ప్రజాసేవ మరచిన వీరు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. కార్యాలయాలకు చుట్టపుచూపుగా వస్తూ ప్రజలకు అందుబాటులో ఉండరనే విమర్శలు ఎదుర్కొంటున్నారు. పాత బిల్‌కలెక్టర్లు కొంత మంది అడ్మిన్లుగా వ్యవహరిస్తున్నారు. తాము సీనియర్లమంటూ రెవెన్యూ వసూళ్లకు మాత్రమే పరిమితమవుతున్నారు.



నెల్లూరు(సిటీ), జూలై 8 : నెల్లూరు నగరంలోని 8 లక్షల మంది జనాభాకు 166 సచివాలయాల ద్వారా సేవలందిస్తున్నారు. ఈ సచివాలయాలకు అడ్మిన్లు పర్యవేక్షణ అధికారులుగా వ్యవహరించాలి. కానీ అందుకు భిన్నంగా వారి వ్యవహార శైలి ఉంది. నగరంలోని సచివాలయాలకు ఆర్ఐలు ఇన్‌చార్జిలు కావడంతో కేవలం వారితో సమన్వయం చేసుకుని డివిజన్లలో ఆర్ఐల ఆర్థిక లావాదేవీలకు ఏజెంట్లుగా వ్యవహరిస్తున్నారు. ఆర్ఐల సేవకే పరిమితమై కొందరు అడ్మిన్లు సచివాలయాలకు డుమ్మా కొడుతున్నారు. ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5 గంటల వరకు కార్యాలయాల్లో అందుబాటులో ఉండాల్సిన వీరు అప్పుడప్పుడు వచ్చి వెళుతున్నారు. దీంతో అడ్మిన్లు లేరని మిగిలిన ఉద్యోగులు ఇష్టానుసారంగా వ్యవహరిస్తున్నారు. పనులపై వచ్చే ప్రజలు మాత్రం సచివాలయాల చుట్టూ ప్రదక్షిణలు చేస్తున్నారు.

● వారి రూటే సపరేటు..

సచివాలయ వ్యవస్థ రాకముందు ఆర్ఐలకు క్షేత్ర స్థాయిలో సహాయకులుగా బిల్ కలెక్టర్లు ఉన్నారు. సచివాలయాలు వచ్చాక వీరిని అడ్మిన్లు చేశారు. ఇలా 40 మంది వరకు ఉన్నారు. వీరిలో కొంతమంది తాము సీనియర్లమంటూ అలా వచ్చి ఇలా వెళ్లిపోతున్నారు. దీంతో మిగిలిన ఉద్యోగులు కూడా దాదాపుగా అలాగేనే వ్యవహరిస్తున్నారు. ఆర్ఐలకు మాత్రమే అందుబాటులో ఉంటూ వారి ఆర్థిక ప్రయోజనాలకు ప్రతినిధులుగా ఉన్నారు. పైగా పన్నులు వసూలుచేస్తూ చేతులు దులుపుకుంటున్నారు. కొత్త భవనాలకు రాజకీయ నేతల సిఫార్సుల మేరకే పన్ను విధిస్తున్నారు. సచివాలయాలపై పర్యవేక్షణకు కమిషనర్‌తోపాటు ఏడీసీ, డీసీలు ఉన్నప్పటికీనీ అడ్మిన్ల పనితీరుపై నిఘా కొరవడింది.

ప్రజా సమస్యలు సత్వర పరిష్కారం : కమిషనర్



వినతులు స్వీకరిస్తున్న కమిషనర్ వికాస్ మర్మత్

నెల్లూరు(సిటీ), జూలై 8 : నగర ప్రజలు ఎదుర్కొంటున్న సమ స్యలను వేగవంతంగా పరిష్కరించా లని ఎన్ఎంసీ కమిషనర్ వికాస్ మర్మత్ తెలిపారు. సోమవారం కా ర్పొరేషన్ కార్యాలయంలో నిర్వహిం చిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో ఆయన పాల్గొని నగర వాసుల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రజ లు తమ సమస్యలను లిఖితపూర్వకంగా తెలిపిన వెంటనే క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయా లన్నారు. వాటిని వీలైనంత వరకు శాశ్వత పరిష్కారం చూపాలని ఆదేశించారు. ఇందులో భాగంగా టీడీపీ నేత ధర్మవరం సుబ్బారావు 47వ డివిజన్‌లోని పలు సమస్యలపై వినతిపత్రం అందజేశారు. కల్వర్టులు, డ్రైన్లు నిర్మించాలని కోరారు. రాజేంద్రనగర్, నారాయణరావుపేట ప్రాంతా లలో డ్రైన్లు గత వైసీపీ ప్రభుత్వ నిర్లక్ష్యం వల్ల పాడయ్యాయని తెలిపారు.

భవిష్యత్ తరాలకు ఆకాష్ వికోటి ఆదర్శం

● నారాయణ విద్యాసంస్థల ఎండీ డాక్టర్ సింధూర



కార్యక్రమాన్ని ప్రారంభిస్తున్న డాక్టర్ సింధూర

నెల్లూరు (విద్య), జూలై 8 : భవిష్యత్ తరాలకు బాలమేధావిగా గుర్తింపు పొందిన ఆకాష్ వికోటి ఆదర్శంగా నిలుస్తారని నారాయణ విద్యాసంస్థల ఎండీ డాక్టర్ పొంగూరు సింధూర తెలిపారు. నగరంలోని నారాయణ ఇంజనీరింగ్ కళాశాలలో సోమవారం జరిగిన స్కిల్ డెవలప్‌మెంట్ సెమినార్‌లో ఆమె పాల్గొని మాట్లాడారు. టీవీస్టార్‌గా, స్పెల్‌బీ యూఎస్ కాంపిటీషన్‌లో ప్రపంచ విజేతగా నిలిచిన ఆకాష్ వికోటి నేటితరం విద్యార్థులకు ఆదర్శంగా నిలుస్తున్నారన్నారు. నెల్లూరుకు చెందిన ఆకాష్ ప్రపంచ వ్యాప్తంగా కీర్తి గడించడం గర్వకారణమన్నారు. నారాయణ విద్యాసంస్థల్లో చదువుతున్న విద్యార్థులు సైతం అన్ని పోటీ పరీక్షల్లో రాణిస్తూ అగ్రగామిగా నిలుస్తున్నారన్నారు. తమ విద్యార్థులకు ఆకాష్‌ను పరిచయం చేసి ఆయన అనుభవాలను పంచుకునేందుకు ఈ కార్యక్రమం ఏర్పాటు చేశామన్నారు. బాలమేధావి ఆకాష్ మాట్లాడుతూ ఎంతోమంది విద్యార్థులను ఉత్తమంగా తీర్చి దిద్దడంలో నారాయణ విద్యా సంస్థలు అగ్రగామిగా నిలుస్తున్నాయన్నారు. అనంతరం ఆకాష్‌ను ఘనంగా సత్కరించారు. విద్యార్థులు నిర్వహించిన సాంస్కృతిక ప్రదర్శనలు అలరించాయి. ఈ కార్యక్రమంలో విద్యాసంస్థల డీన్‌లు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు, పాల్గొన్నారు.

సంక్షేమ పథకాలు అమలు చేయాలి

నెల్లూరు(వైద్యం), జూలై 8 : రాష్ట్ర ముఖ్యమంత్రి తీసుకు రానున్న సూపర్ సిక్స్ సంక్షేమ పథకాలను సక్రమంగా అమలు చేసేలా కృషి చేయాలని టీడీపీ నేత, మాజీ కార్పొరేటర్ ఉచ్చి భువనేశ్వరప్రసాద్ సచివాలయ ఉద్యోగులను కోరారు. సోమవారం 14వ డివిజన్‌కు చెందిన మూడు సచివాలయ ఉద్యోగులతో ఆయన సమావేశం నిర్వహించి మాట్లాడుతూ రేషన్ కార్డులు, పింఛన్ల పంపిణీలో ప్రత్యేక శ్రద్ధ పెట్టాలని సూచించారు. విద్యార్థులకు సంబంధించి సర్టిఫికెట్ల పంపిణీలో ఎలాంటి జాప్యం వద్దని తెలిపారు. సచివాలయం ఉద్యోగులు ఉచ్చి దృష్టికి పలు సమస్యలు తీసుకు వచ్చారు. ఇక్కడ కంప్యూటర్‌లు చోరీకి గురయ్యాయని, డేటా స్టోరేజ్‌కు ఇబ్బందిగా ఉందని చెప్పారు. దీనికి స్పందించిన ఆయన ఈ సమస్యలను మంత్రి నారాయణతో పాటు మున్సిపల్ కమిషనర్ దృష్టికి తీసుకు వెళ్లి పరిష్కరిస్తామన్నారు.

విద్యార్థినికి రూ.25 వేల అందజేత



ప్రోత్సాహక నగదు అందచేస్తున్న దాతలు

నెల్లూరురూరల్, జూలై 8 : నెల్లూరు రూరల్ మండలంలోని ఆమంచర్ల జడ్పీ హైస్కూల్లో పదవ తరగతిలో స్కూల్ మొదటి స్థానంలో ఉత్తీర్ణత సాధించిన షర్మిలకు సోమవారం దాతలు రూ.25 వేలు నగదు ప్రోత్సాహక బహుమతిని అందచేశారు. అమెరికాలో నివాసముంటున్న జవ్వాజి మల్లికార్జున్ నాయుడు తన తండ్రి జ్ఞాపకార్థకంగా ఆ కుటుంబానికి చెందిన పద్మమ్మతో విద్యార్థినికి అందచేశారు. ఇప్పటికే ఏడాది పాటు సురక్షిత తాగునీటి కోసం రూ.50 వేలు అందచేస్తుండగా, క్రీడా పరికరాల కోసం రూ.10 వేలు అందిస్తామని తెలిపారు. ప్రభుత్వ పాఠశాలలో పదిలో స్కూల్ మొదట స్థానంలో నిలిచిన వారికి ఇంటర్ రెండు సంవత్సరాలకు రూ.50 వేలు అందిస్తామని ప్రకటించి ఉన్నారని ఆమె తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో మురళీధర్, సర్పంచు రమణమ్మ, ఉపసర్పంచు మలినేని వేణునాయుడు, జడ్పీ కోఆప్షన్ సభ్యుడు అల్లాబక్షు, ఎంపీటీసీ హనుమాయమ్మ పాల్గొన్నారు.

శ్రీచైతన్య పాఠశాల అనుమతి రద్దు

● న్యాయస్థానం ఆదేశాలతో మూసివేత

నెల్లూరు(విద్య), జూలై 8 : విద్యావ్యవస్థలో నిబంధనలను తుం గలో తొక్కి ఇష్టానుసారంగా వ్యవ హరిస్తున్న శ్రీచైతన్య విద్యాసంస్థలపై చర్యలు తీసుకోవాలని అపస్మా నేతలు పోరాటం చేసి హైకోర్టును ఆశ్రయించారు. ప్రభుత్వ నిబంధన లను ఉల్లంఘిస్తూ ఒకే ఎడ్యుకేషనల్ సొసైటీ కింద నగరంలో ఐదు నూతన పాఠశాలలను ఒలంపియాడ్, ఇంటర్నేషనల్ పేరుతో ప్రారంభించారని ఫిర్యాదులో పేర్కొన్నారు. దీంతో న్యాయస్థానం ముత్తుకూరురోడ్డు పార్థసారధినగర్‌లో నూతనంగా ప్రారంభించిన శ్రీచైతన్య పాఠశాలకు మంజూరు చేసిన అనుమతులను రద్దు చేసింది. ఈ నేపథ్యంలో న్యాయస్థానం ఉత్తర్వుల మేరకు జిల్లా కలెక్టర్, డీఈవో ఆదేశాలతో సోమవారం నెల్లూరు రూరల్ ఎంఈవో బిక్షాలు పాఠశాలను తనిఖీ చేసి యాజమాన్యానికి కోర్టు నోటీసులు అందజేసి పాఠశాలను మూసివేసినట్లు ఆయన తెలిపారు.

బీసీజీ వ్యాక్సినేషన్ తనిఖీ



రికార్డులు తనిఖీ చేస్తున్న అదనపు డీఎంహెచ్‌వో

నెల్లూరురూరల్, జూలై 8 : జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అదనపు అధికారి ఖాదర్‌వలి బీసీజీ వ్యాక్సినేషన్ ప్రక్రియను సోమవారం నెల్లూరురూరల్ పరిధిలోని అల్లీపురం పీహెచ్‌సీ పరిసరాలలోని పెద్ద చెరుకూరు వద్ద ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. అనంతరం పీహెచ్‌సీలో రికార్డులను పరిశీలించారు. వ్యాక్సినేషన్ విజయవంతానికి అందరు సమన్వయ లోపం లేకుండా పని చేయాల ని ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వైద్యాధికారులు హజరత్‌రెడ్డి, బలరాంనాయక్, తదితరులు పాల్గొన్నారు.

నిబంధనలు పాటించని ప్రైవేటు స్కూళ్లపై చర్యలు తీసుకోవాలి

నెల్లూరు(హరనాథపురం), జూలై 8 : ప్రభుత్వ నిబంధనలు పాటించని ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్లపై చర్యలు తీసుకోవాని కోరుతూ పీడీఎస్‌యూ జిల్లా అధ్యక్షుడు సునీల్ డీఆర్వో పద్మావతికి ప్రజా విజ్ఞప్తుల పరిష్కార వేదికలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒక గుర్తింపు పేరుతో నాలుగు బ్రాంచీలను పెట్టి పాఠశాలలు నడుపుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో నాయకులు కే.నవీన్, ఎస్‌కే అన్వర్‌బాషా, ఆశీర్వాదం తదితరులు పాల్గొన్నారు.

సిల్క్ డెవలప్‌మెంట్ సెంటరుగా తీర్చిదిద్దాలి

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 8 : నగరంలోని గుర్రం జాషువా గ్రంథాలయాన్ని డిజిటల్ గ్రంథాలయం తోపాటు యువతకు ఉపాధి కల్పించే స్కిల్ డెవలప్‌మెంట్ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు సహకారం ఇవ్వాలని ఆ గ్రంథాలయ కమిటీ సభ్యులు జిల్లా కలెక్టర్‌కు విజ్ఞప్తి చేశారు. ఈ మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికలో వినతిపత్రం అందజేశారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయం వర్కింగ్ ప్రెసిడెంట్ షేక్.ఖాసిం, ఇన్‌చార్జి జనార్దన్, ఈసీ మెంబర్లు ఖాజామొహిద్దీన్, కృష్ణయ్య, తదితరులు వివరించారు. దీనిపై చర్యలు తీసుకోవాలని మున్సిపల్ కమిషనర్‌కు కలెక్టర్ సూచించారు. కమిటీ సభ్యులు కలెక్టర్‌కు గుర్రం జాషువా చిత్రపటాన్ని బహూకరించారు.

మంత్రి నారా లోకేష్‌తో రూరల్ ఎమ్మెల్యే భేటీ



లోకేష్‌ను కలిసిన కోటంరెడ్డి

నెల్లూరు రూరల్, జూలై 8 : రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేష్‌తో నెల్లూరు రూరల్ ఎమ్మెల్యే కోటంరెడ్డి శ్రీధరరెడ్డి సోమవారం భేటీ అయ్యారు. అమరావతిలో మర్యా దపూర్వకంగా కలిసిన ఆయన నెల్లూరురూరల్ నియోజకవర్గం లోని పలు అంశా లపై లోకేష్‌తో చర్చించారు. ప్రజా సమస్యల పరిష్కారానికి నిధులు విడుదల, గతంలో పెండింగ్ ఉన్న పలు విషయాలను గుర్తు చేసిన ఆయన వాటిని పూర్తి చేసేందుకు ప్రభుత్వ చొరవ తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.

మహ్మద్‌లకు ఈబీసీ గుర్తింపు ఇవ్వాలి

నెల్లూరు(వైద్యం), జూలై 8 : మహ్మద్‌లకు ఈబీసీ గుర్తింపు ఇవ్వాలని కోరుతూ అవాజ్ కమిటీ నేతలు సోమవారం కలెక్టరేట్‌లో డీఆర్‌వో, జడ్పీ సీఈవోలకు వినతి పత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో అవాజ్ కమిటీ నేతలు షేక్ రషీద్, షేక్ చాన్‌బాషా, షేక్ అజీజ్, హుమయూన్, షకీలా, ఇషాక్ తదితరులు పాల్గొన్నారు.

ఉపాధి హామీ పనులు మొదలు పెట్టండి

నెల్లూరురూరల్, జూలై 8 : గ్రామీణ ప్రాంతాల్లో ఉపాధి హామీ పనులు మొదలుపెట్టాలని వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు అధికారులను కోరారు. ఈ మేరకు సోమవారం నెల్లూరురూరల్ ఎంపీడీవో కార్యాలయంలో అధికారులకు వినతిపత్రం అందజేశారు. అనంతరం వారు మాట్లాడుతూ ఉపాధి హామీ కూలీలకు రెండు నెలలు నగదు చెల్లించాలని చెప్పారు. కార్మికులకు పే స్లిప్‌లు ఇద్దడం లేదని, వాటిని వెంటనే అందచేయాలని కోరారు. పనులు జరుగుతున్న ప్రాంతాల్లో సౌకర్యాలు సమకూర్చాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో సంఘం నాయకులు పుల్లయ్య, తిరుపాలు, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

'భారతీయుడు-2' సంబరాలు

నెల్లూరు(సాంస్కృతికం), జూలై 8 : శంకర దర్శకత్వంలో ప్రముఖ హీరో కమలహాసన్ నటించిన భారతీయుడు-2 చిత్రం ఈనెల 12న ప్రపంచ వ్యాప్తంగా విడుదలవుతున్న సందర్భంగా నగరంలోని సిరి మల్టిప్లెక్స్ థియేటర్స్‌లో కమలహాసన్ అభిమానులు, చిత్ర పంపిణీదారులు సురేష్ సోమవారం సంబరాలు జరుపుకున్నారు. భారతీయుడు-2 చిత్రం పోస్టరుకు భారీ పూలమాలలు వేసి తమ అభిమానాన్ని చాటుకున్నారు. అనంతరం పాలాభిషేకాలు చేశారు. ఈ కార్యక్రమంలో తెలుగుదేశం పార్టీ నాయకుడు మైనుద్దీన్, సురేష్ ఫిలింస్ మేనేజర్ నాగేంద్ర, ఎస్‌కె.రబ్బానీ, యూసఫ్, అజీజ్, లోకేష్ తదితరులు పాల్గొన్నారు.

అమల్లోకి ఉచిత ఇసుక...

తొలిరోజు అనుమతుల గందరగోళం



ఎన్నికల్లో ఇచ్చిన హామీని కూటమి ప్రభుత్వం ఆచరణలోకి తీసుకొచ్చింది. సోమవారం నుంచీ ఉచిత ఇసుక విధానం అమల్లోకి వచ్చింది. అయితే జిల్లాలో తొలిరోజు అనుమతుల పేరిట గందరగోళం నెలకొంది. మొత్తం ఐదు స్టాక్ పాయింట్లు వుండగా సోమవారం వెంకటగిరి మండలం మొగళ్ళగుంట స్టాక్ పాయింట్‌లో మాత్రమే ఇసుక పంపిణీ మొదలైంది. దొరవారి సత్రం, నాగలాపురం, పిచ్చాటూరు మండలాల్లోని మిగిలిన నాలుగు స్టాక్ పాయింట్లలో అనుమతులకు సంబంధించిన అభ్యంతరాలతో ఇసుక పంపిణీ నేటికి వాయిదా పడింది.

- ఆంధ్రజ్యోతి,తిరుపతి

వెంకటగిరిలో మొదలైన ఇసుక పంపిణీ

వెంకటగిరి మండలం మొగళ్ళగుంట స్టాక్ పాయింట్‌లో ఇసుక పంపిణీ ప్రారంభమైంది. తొలిరోజు కావడంతో స్వయంగా తహసిల్దారే వచ్చి పంపిణీని పర్యవేక్షించారు. వేకువజాము నుంచే ట్రాక్టర్లు, టిప్పర్లు స్టాక్ పాయింట్ వద్ద బారులు తీరాయి. స్టాక్ పాయింట్ నిర్వహణ వ్యయం, జీఎస్టీ వంటివి కలుపుకుని టన్నుకు రూ. 590 చొప్పున చెల్లింపుతో ఇసుక కేటాయింపులు మొదలు పెట్టారు. ట్రాక్టరుకు గరిష్ఠంగా వెయ్యి రూపాయలు, టిప్పర్‌కు గరిష్ఠంగా 2 వేలు చొప్పున రవాణా ఖర్చు భరించాల్సి వస్తోంది. ఇవన్నీ కలిపినా ట్రాక్టర్ లోడు గరిష్ఠంగా రూ. 4 వేలు, టిప్పర్ లోడు గరిష్ఠంగా రూ. 14 వేలు మించడం లేదు. గత వైసీపీ ప్రభుత్వంలో ట్రాక్టర్ లోడుకు రూ. 5500 కాగా టిప్పర్ లోడుకు రూ. 20 వేలు చొప్పున చెల్లించాల్సి వుండేది. ఇపుడు ట్రాక్టర్ లోడుపై రూ. 1500, టిప్పర్ లోడుపై రూ. 6 వేలు చొప్పున ఆదా అవుతోంది. దీంతో ఇసుక అవసరమైన వారు, సామాన్య జనం కూడా సంతోషం వ్యక్తం చేస్తున్నారు. కాగా ఈ స్టాక్ పాయింట్‌లో 900 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు మాత్రమే వున్నాయి. స్వల్ప వ్యవధిలోనే నిల్వలు ఖాళీ కానున్నాయి. తర్వాత స్టాక్ పాయింట్ ఇక్కడే కొనసాగుతుందా లేక మరో చోటకు మారుస్తారా అన్న దానిపై స్పష్టత రాలేదు.

మిగిలిన చోట్ల నేటినుంచి పంపిణీ

దొరవారిసత్రం మండలం మావిళ్ళపాడు స్టాక్ పాయింట్ వద్ద 21,400 మెట్రిక్ టన్నుల ఇసుక నిల్వలు వున్నాయి. ఇక్కడ టన్ను ధర రూ. 465గా నిర్ణయించారు. సోమవారం ఉదయం 7 గంటలకు ముందే ట్రాక్టర్లు, టిప్పర్లు వరుసలో నిలుచున్నాయి. ప్రభుత్వం నుంచీ అనుమతులు రాలేదని చెబుతూ అధికారులు ఇసుక కేటాయింపులు ప్రారంభించలేదు. మధ్యాహ్నం 3 గంటల తర్వాత అనుమతులు వచ్చాయని, ఎమ్మెల్యే వచ్చి ప్రారంభిస్తారని చెప్పారు. అయితే 5 గంటల సమయంలో పై అధికారుల నుంచీ వచ్చిన ఆదేశాల మేరకు మంగళవారం నుంచీ పంపిణీ ప్రారంభిస్తామని అధికారులు ప్రకటించారు. దీంతో రోజంతా పడిగాపులు కాచిన ఇసుక వినియోగదారులు, ట్రాక్టర్, టిప్పర్ ఆపరేటర్లు ఉసూరుమంటూ వెనుదిరిగారు. నాగలాపురం మండలం సుబ్బానాయుడు కండ్రిగ వద్ద రెండు ఇసుక పాయింట్లు వుండగా వేకువ జామునుంచే వందలాది ట్రాక్టర్లు, టిప్పర్లు బారులు తీరాయి. ఉదయం 7 గంటలకు ఇసుక పంపిణీ ప్రారంభించి రెండు ట్రాక్టర్లకు ఇసుక కూడా నింపారు. అయితే అదే సమయంలో అక్కడికి చేరుకున్న ఆర్డీవో రవిశంకర్‌రెడ్డి ప్రభుత్వం నుంచీ అనుమతులు రాలేదని, అవి వచ్చేవరకూ ఇసుక కేటాయింపులు జరపవద్దంటూ అధికారులను ఆదేశించారు. దీంతో అధికారులు హడావిడిగా ట్రాక్టర్ ట్రాలీల నుంచీ ఇసుకను అన్ లోడ్ చేయించారు. మధ్యాహ్నం 3 గంటల సమయంలో కలెక్టర్ వెంకటేశ్వర్, ఎమ్మెల్యే ఆదిమూలం స్టాక్ పాయింట్‌ను సందర్శించి వెళ్ళారు. ప్రభుత్వం నుంచీ అనుమతులు రావడం ఆలస్యమవుతోందని, మంగళవారం నుంచీ ఇసుక పంపిణీ ప్రారంభిస్తామని అధికారులు చెప్పడంతో రోజంతా నిరీక్షించిన కొనుగోలుదారులు, వాహనాల ఆపరేటర్లు తిరుగుముఖం పట్టారు. పిచ్చాటూరు మండలం అడవికొడియంబేడు స్టాక్ పాయింట్ వద్ద కూడా ఇదే పరిస్థితి నెలకొంది. అనుమతులు రాలేదంటూ స్టాక్ పాయింట్ ప్రారంభాన్ని మంగళవారానికి వాయిదా వేశారు.



మొగళ్ళగుంటలో టిప్పర్‌లోకి ఇసుక లోడింగ్

ఇసుక కేటాయింపు పత్రం



మావిళ్ళపాడు స్టాక్ పాయింట్ వద్ద ఇసుక కోసం బారులు తీరిన ట్రాక్టర్లు, టిప్పర్లు

తగ్గనున్న నిర్మాణ వ్యయం



సాధారణ ఇంటి నిర్మాణానికి 30 టన్నుల ఇసుక అవసరమవుతుంది. గత ప్రభుత్వంలో 30 టన్నుల ఇసుక కోసం రూ. 33 వేలు చెల్లించాల్సి వచ్చేది. ఇపుడు అదే ఇసుక రూ. 24 వేలకే అందుబాటులోకి వస్తోంది. అంటే సగటు వ్యక్తికి ఇంటి నిర్మాణ వ్యయం ఇసుకపై రూ. 9 వేలు తగ్గుతోంది. మునుపటితో పోలిస్తే ఇపుడు ట్రాక్టర్ లోడుపై రూ. 1500 తగ్గింది. అదే విధంగా టిప్పర్ లోడు కూడా గతానికంటే రూ. 6 వేలు తగ్గింది. నిర్మాణాలు చేపట్టే వారికి కొత్త ప్రభుత్వంలో ఇది ఖచ్చితంగా శుభవార్తే.

- అభిషేక్, వెంకటగిరి

ఎన్‌ఆర్ఐ కిడ్నాప్

● నగలు, నగదు లాక్కుని వదిలిపెట్టిన వైనం

శ్రీకాళహస్తి, జూలై 8: విదేశాల్లో చాలా కాలం ఉద్యోగం చేసి తిరుపతిలో స్థిరపడేందుకు సిద్ధమైన ఓ ఎన్ఆర్ఐను కొందరు కిడ్నాప్ చేసిన ఉదంతం ఆలస్యంగా వెలుగు చూసింది.తిరుపతికి చెందిన కృష్ణమూర్తి(65) సుదీర్ఘకాలం వివిధ దేశాల్లో ఉద్యోగాలు చేశాడు. ఇటీవల సొంతూరు తిరుపతికి వచ్చి చైన్‌లింక్ వ్యాపారం మొదలుపెట్టాడు. ఈ క్రమంలో ఓ సెల్‌ఫోన్ దుకాణంలో పనిచేసే యువతి(26)తో పరిచయం ఏర్పడింది. ఇద్దరి మధ్య బాగా చనువు పెరిగింది. గతంలో ఎర్రచందనం కేసులో నిందితుడిగా వుండిన ఆ యువతి భర్త ఎలాగైనా కృష్ణమూర్తిని దోపిడీ చేయాలని పథకం పన్నాడు. ఈ క్రమంలో తనతో పాటు ఎర్రచందనం కేసులో నిందితుడైన మరో యువకుడిని సహాయంగా ఎంచుకున్నాడు. శ్రీకాళహస్తి పట్టణ శివారులోని రాజీవ్‌నగర్‌లో కొందరు సభ్యులు చైన్‌లింక్ వ్యాపారంలో చేరుతారని కృష్ణమూర్తిని నమ్మించారు.ఈనెల 3వ తేదీ కారులో అందరూ రాజీవ్‌నగర్‌కు చేరుకున్నారు. ఇక్కడ యువతి భర్త ముందుగా వేసుకున్న పథకం ప్రకారం కృష్ణమూర్తి సెల్‌ఫోన్ లాక్కుని పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకున్నాడు. అక్కడినుంచి మరో ఇద్దరి సాయంతో కేవీబీ పురం మండలం పెరిందేశానికి తరలించారు. కృష్ణమూర్తి వద్ద ఉన్న కొంత నగదుతో పాటు బంగారు ఆభరణాలను లాక్కున్నారు. అలాగే బ్యాంకు ఖాతాలోని రూ.3లక్షల నగదును ఏటీఎం, ఆన్‌లైన్ లావాదేవీల ద్వారా స్వాహా చేశారు. ఆ తరువాత కృష్ణమూర్తి భార్యకు ఫోన్‌చేసి రూ.కోటి డిమాండ్ చేశారు. 4వ తేదీ పెరిందేశం నుంచి కారులో కృష్ణమూర్తిని ఎక్కించుకుని శ్రీకాళహస్తి మండలంలోని పల్లెల మీదగా సంచరించారు. అతని నుంచి డబ్బులు రావని నిర్ధారించుకున్న తరువాత రాజీవ్‌నగర్‌లో వదలిపెట్టి పరారయ్యారు. రెండు రోజుల పాటు దుండగుల మధ్య నలిగి గాయపడిన కృష్ణమూర్తి నేరుగా తిరుపతిలోని ఓ ప్రైవేటు వైద్యశాలలో చికిత్స నిమిత్తం చేరాడు.కోలుకున్నాక సోమవారం రాత్రి శ్రీకాళహస్తి రెండవ పట్టణ పోలీస్‌స్టేషన్‌కు చేరుకుని కిడ్నాప్ ఘటనపై ఫిర్యాదు చేశాడు. దీంతో కిడ్నాప్‌కు పాల్పడిన దుండగుల కోసం పోలీసులు గాలిస్తున్నారు.

టీటీడీ గదులు హైజాక్!

రూ.100 వసతి గది.. రూ.వెయ్యికి విక్రయం

గదులు దొరకని భక్తులే టార్గెట్

ఉత్తరాది నుంచి వచ్చిన దళారుల దందా ఇది

టీటీడీ విచారణలో నివ్వెరపోయే అంశాలు

నాటి వైసీపీ పాలనా వైఫల్యంతోనే ఈ దుస్థితి



తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల శ్రీవారి దర్శనానికి వచ్చే భక్తులే వారి టార్గెట్. దర్శన సమయం వచ్చే వరకు నిరీక్షించడానికి వసతి అవసరం కనుక అలాంటి వారినే ఎరవేస్తారు!. టీటీడీ వంద, 50 రూపాయలకు అద్దె కిచ్చే గదిని ముందుగానే బుక్ చేసుకుని హైజాక్ చేసి, గదులు దొరకని భక్తులకు అప్పటికప్పుడు రూ.వెయ్యి రూపాయలకు అంటగడతారు. డిమాండ్‌ను బట్టి అంతకుమించి వసూలు చేస్తూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనావైఫల్యం పుణ్యమాని పవిత్ర పుణ్యక్షేత్రంలో రోజూ కొందరు ఉత్తరాది నుంచి వచ్చిన దళారుల దందా ఇది. తిరుమలలో గదుల దళారులను అరికట్టేందుకు పోలీస్, విజిలెన్స్ అధికారులు చేపట్టిన విచారణలో ఇలా నివ్వెరపోయే అంశాలు బయటపడుతున్నాయి. మార్ఫింగ్ ఆధార్ కార్డు జిరాక్స్‌లతో గదులను పొంది బ్లాక్‌లో విక్రయించేందుకు నార్త్ ఇండియా నుంచి కొందరు తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో తిష్ట వేయడం ఆశ్చర్యపరుస్తోంది.

●అక్రమార్జనకు దందా సాగించేదిలా!

ఆధార్ కార్డులో ఫొటో మార్ఫిడి చేసి గదులను బుక్ చేసుకోవడం ద్వారా అక్రమాలకు పాల్పడుతున్న వైనం మూడురోజుల క్రితం వెలుగు చూసిన విషయం తెలిసిందే. తొలుత సమీప బంధువు ఆధార్ కార్డుతో గదిని పొంది, ఆ తర్వాత గది కోసం నిరీక్షించే భక్తుడికి బ్లాక్‌లో రూ.వెయ్యి నుంచి రూ.2 వేల వరకు విక్రయించడం, విక్రయించే క్రమంలోనే ఆ భక్తుడి నుంచి ఆధార్ తీసుకోవడం, తిరిగి భక్తుడి నుంచి పొందిన ఆధార్ జిరాక్స్‌లోని ఫొటోను మార్చి దళారీ ఫొటో జతచేసి తిరిగి గదిని పొందే పెద్ద స్కాంను భద్రతాధికారులు గుర్తించారు. నవకిశోర్ అనే దళారిని అదుపులోకి తీసుకుని విచారించగా, ఇదే తరహాలో 25 నుంచి 30 మంది దళారులు గదుల ద్వారా అక్రమాలకు పాల్పడుతున్నట్లు తేలింది. కేవలం గదుల ద్వారా అక్రమాలకు పాల్పడేందుకే మహారాష్ట్ర నుంచి కొంత మంది కుటుంబాలతో వచ్చి తిరుపతి, రేణిగుంట ప్రాంతాల్లో గదులకు అద్దెకు తీసుకుని నివాసముంటున్నట్లు కూడా తేలింది. తెలంగాణ, కర్ణాటకల నుంచి కూడా మరికొంతమంది తిరుపతికి వచ్చి నివాసాలు ఏర్పాటు చేసుకున్నట్టు తెలిసింది. ఉదయం భక్తుల్లా తిరుమలకు వచ్చి గదుల ద్వారా వచ్చే సొమ్మును జేబులో వేసుకుని తిరిగి కొండ దిగేస్తున్నట్టు విచారణలో తేలింది. దీన్నిబట్టి గదులను బ్లాక్‌లో విక్రయించడం ద్వారా ఏ స్థాయిలో సంపాదన ఉందో అర్థం చేసుకోవచ్చు. ఇలా ఒక్కొక్కరు కనీసం రూ.60వేల నుంచి లక్ష వరకు అక్రమంగా సంపాదిస్తుండగా.. సమయానికి గదులు దొరక్క భక్తులు నానా ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గత వైసీపీ ప్రభుత్వ పాలనా వైఫల్యం వల్లే తిరుమలలో ఇలాంటి దుస్థితి నెలకొందని, కూటమి సర్కారు ప్రక్షాళన చేపట్టి ఇలాంటి అక్రమాలను అరికట్టాలని భక్తులు కోరుతున్నారు.



హడలెత్తించిన జెర్రిపోతు

తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమలలోని శిలాతోరణం వద్ద సోమవారం ఓ జెర్రిపోతు భక్తులను హడలెత్తించింది. సుమారు ఏడడుగుల పొడవైన జెర్రిపోతు సోమవారం మధ్యాహ్నం ఎలుకను తరుముతూ శిలాతోరణం ముందుకొచ్చింది. పామును గమనించిన భక్తులు పరుగులు తీశారు. సమీపంలోని భద్రతా సిబ్బంది పాములు పట్టే టీటీడీ కాంట్రాక్ట్ ఉద్యోగి భాస్కర నాయుడికి సమాచారమిచ్చారు. వెంటనే ఆయన అక్కడికి చేరుకుని పామును చాకచక్యంగా పట్టుకుని అడవిలో విడిచిపెట్టారు.

ఏళ్లయినా కదలరు!

పోలీసు శాఖలో తిష్టవేసిన సిబ్బంది

తిరుపతి(నేరవిభాగం), జూలై 8 : జిల్లా పోలీసు శాఖలో అధికారులు మారిపోతున్నారు కానీ కింది స్థాయి సిబ్బందికి మాత్రం స్థానచలనం వుండడం లేదు.ఎస్ఐల నుంచి కానిస్టేబుళ్ళ వరకు ఎక్కడి వారక్కడే ఏళ్ల తరబడి వుండిపోతుండడం వల్ల పైఅధికారులను తమకున్న స్థానిక సీనియారిటీతో తొందరగా గ్రిప్‌లోకి తెచ్చుకోగలుగు తున్నారు. పోలీసు శాఖలో కొన్నేళ్లుగా బదిలీలు చేపట్టలేదు.రాజకీయ ఒత్తిళ్ళతో కొంతమంది అనుకూల ప్రాంతాలకు బదిలీ చేసుకున్నారు తప్ప మిగిలిన వారందరూ ఐదేళ్ళకు పైబడి ఒకేచోటే వున్నారు.తిరుమలలో ఇద్దరు ఏఎస్ఐలు ఉన్నతాధికారుల పేరు చెప్పుకుని శ్రీవారి దర్శనాల పేరుతో ఏడేళ్ళుగా ఒకే స్టేషన్‌లో పనిచేస్తున్నారు. వన్‌టౌన్, టూ టౌన్ స్టేషన్లలో హెడ్ కానిస్టేబుళ్ళ, కానిస్టేబుళ్ళు చాలామంది పదేళ్ళుగా వన్‌టౌన్ నుంచి టూటౌన్‌కు, అక్కడినుంచి వన్‌టౌన్‌కు, లూప్‌లైన్ పేరుతో క్రైం, ట్రాఫిక్ స్టేషన్లకు బదిలీ చేయించుకుని కొండపైనే తిష్ట వేశారు.తిరుమల క్రైం స్టేషన్‌లో ఏఎస్ఐ కొండ వదలడమే లేదు.ట్రాఫిక్‌లోనూ కొందరి పరిస్థితి అలాగే వుంది. ఇక తిరుపతి విషయానికి వస్తే పోలీసు అధికారుల సంఘం నాయకులు నగరాన్ని వదలి బయట పనిచేసిన సందర్భాలే లేవంటే అతిశయోక్తి కాదు. తిరుపతి ఈస్ట్‌లో కొంతమంది కానిస్టేబుళ్ళ ఇక్కడే పనిచేస్తూ ఏకంగా అధికారులను శాసించేస్థాయికి ఎదిగారు.ఎంఆర్‌పల్లి స్టేషన్‌లో సీఐలు, ఎస్ఐలు, ఏఎస్ఐలు అందరూ కొత్తగా వచ్చిన వారు కావడంతో ఇక్కడే చాలాకాలంగా వున్న హెడ్ కానిస్టేబుళ్ళ, కానిస్టేబుళ్లదే పైచేయిగా వుందని చెబుతున్నారు. చంద్రగిరి స్టేషన్‌లోనూ ఇద్దరు కానిస్టేబుళ్ళ ఏడేళ్లుగా అక్కడే పనిచేస్తున్నారు. విద్య, వైద్య కేంద్రంగా భాసిల్లుతున్న తిరుపతిలో సెటిలైతే బాగుంటుందన్న ఉద్దేశంతో అధికారులు మొదలు, కిందిస్థాయి సిబ్బంది వరకు ఇక్కడే స్టేషన్ మార్చి స్టేషనుకు బదిలీ చేసుకుంటున్నారు.లేకుంటే సీఐడీ, విజిలెన్సు, ట్రాన్స్‌కో, ఎస్బీ, డీసీఆర్‌బీల్లో పోస్టింగ్‌లు తెచ్చుకుంటున్నారు.వీరిలో చాలా మంది లోకల్‌గా తమకున్న సీనియారిటీతో అధికారులను గ్రిప్‌లోకి తెచ్చుకుని వసూళ్లరాయుళ్లుగా మారిపోతుండడమే విషాదం.ఏళ్ళ తరబడి తిష్ట వేసి కూర్చున్న పోలీసులకు ఎస్పీ హర్షవర్ధన రాజు అయినా స్థాన భ్రంశం కల్పిస్తారా అనేది చూడాల్సివుంది.

అది కార్పొరేషన్ నిధులతో వేసిన రోడ్డే

మాజీ మంత్రి పెద్దిరెడ్డి ఇంటిముందు రహదారి వివాదంపై నివేదిక సిద్ధం

తిరుపతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : తిరుపతి నగరపాలక సంస్థ నిధులతో 18వ డివిజన్ పరిధిలోని మారుతీనగర్- రాయల్ నగర్ ప్రాంతాలను కలుపుతూ వేసిన రోడ్డు కార్పొరేషన్ నిధులతో వేసిందేనని మున్సిపల్ అధికారులు నివేదిక సిద్ధం చేసినట్టు తెలిసింది. మాజీ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రా రెడ్డి తన ఇంటి ముందు కార్పొరేషన్ వేసిన రోడ్లకు సామాన్య ప్రజలు ఎవరూ రాకపోకలు సాగించకుండా రెండు వైపులా పెద్ద గేట్లు ఏర్పాటు చేయడంపై వివాదం రేగిన విషయం తెలిసిందే. దీనిపై జనసేన తరపున నాలుగు రోజుల ముందు పెద్దిరెడ్డి ఇంటిముందు ధర్నాకు దిగిన నేపథ్యంలో రోడ్డు వివాదంపై ఎమ్మెల్యే ఆరణి శ్రీనివాసులు నివేదిక కోరారు. మారుతీనగర్-రాయల్ నగర్ కలిపేందుకు సీసీ రోడ్డు వేస్తున్నట్టు రూ.9.55లక్షల అంచనాతో (ఐఎఫ్‌బి నెం45/19-20) ఒకటి, రూ.9.50లక్షలతో (ఐఎఫ్‌బి నెం.46/19-20)లతో మరొకటి రెండు విడతలుగా నామినేషన్‌పై టెండరిచ్చినట్టు గుర్తించారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు రాయల్‌నగర్ నుంచి మారుతీనగర్‌ను కలుపుతూ రోడ్డు వేస్తున్నట్టు కార్పొరేషన్ రికార్డులో నమోదుచేసిన విషయాన్ని కూడా నిర్ధారించారు. అయితే అది తన స్థలమేనని పెద్దిరెడ్డి కోర్టును ఆశ్రయించినట్టు తెలుస్తోంది.

అందరికీ 'ఎనీవేర్' కుదరదు!

చేయి తడిపితేనే పనవుతుంది

రిజిస్ట్రేషన్ శాఖపై విమర్శల వెల్లువ

తిరుపతి, జూలై 8 (ఆంధ్రజ్యోతి) : 'ఎనీవేర్ రిజిస్ట్రేషన్ కింద రాష్ట్రవ్యాప్తంగా తమకు ఇష్టమైన ప్రాంతంలోని సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో భూములు, ప్లాట్లు, ఇళ్ల ఇతర ఆస్తులు క్రయ, విక్రయంతోపాటు అడుమానం ఇతర సేవలు పొందే అవకాశం ఉంది. కానీ జిల్లాకొచ్చేసరికి ఈ సౌకర్యాన్ని అందరూ ఉపయోగించుకోవడం కుదరదు. చేయి తడిపితే పనవుతుందని.. రిజిస్ట్రేషన్ శాఖపై విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సబ్ రిజిస్ట్రార్లు సిండికేట్‌గా మారడం వల్లే ఇలా జరుగుతోందన్న ఆరోపణలూ లేకపోలేదు.ఇటీవల జరిగిన సంఘటనే దీనికి నిదర్శనం. పిచ్చాటూరుకు చెందిన ఓ వ్యక్తి ఆస్తి రిజిస్ట్రేషన్ కోసం సంబంధిత సబ్ రిజిస్ట్రార్‌ను కలిశారు. అక్కడ తిప్పించుకోవడంతో ఎనీవేర్ సౌకర్యం ద్వారా తిరుపతి సబ్ రిజిస్ట్రార్‌ను కలిశారు. అన్ని పత్రాలు పరిశీలించిన జాయింట్ సబ్ రిజిస్ట్రార్ సదరు రిజిస్ట్రేషన్ చేయడం కుదరదని సహేతుకమైన కారణం చెప్పకుండానే తిరస్కరించారు. పైగా ఈ పని అవ్వాలి అంటే ఓ సారి పిచ్చాటూరు సబ్ రిజిస్ట్రార్‌ను కలవమని సలహా ఇచ్చారు. ఇక చేసేది లేక మళ్లీ ఆ వ్యక్తి పిచ్చాటూరు సబ్ రిజిస్ట్రార్ వద్దకు వెళ్లారు. అయినా పనికాకపోవడంతో దళారులను ఆశ్రయించి.. అడిగింది ముట్టచెప్పి పని చేయించుకోవాల్సి వచ్చింది.

నిబంధనలు ఇవీ..

ఎనీవేర్ రిజిస్ట్రేషన్‌కు సంబంధించిన ఆస్తి నిషేధిత జాబితాలో ఉన్నా.. ఏవైనా ఇతర అభ్యంతరాలున్నా తిరస్కరించవచ్చు. తిరస్కరణకు గల కారణం కూడా రాత పూర్వకంగా ఇవ్వాలి.

సబ్ రిజిస్ట్రార్లపై చర్యలు శూన్యం

సబ్ రిజిస్ట్రార్లపై ఈ విషయంలో ఎవరైనా పైఅధికారులకు ఫిర్యాదు చేసినా చర్యలు శూన్యం. తిలాపాపం తలా పిడికెడు అన్న చందంగా రిజిస్ట్రేషన్ శాఖ తయారవడమే దీనికి కారణమన్న విమర్శలున్నాయి. కొత్త ప్రభుత్వమైనా ఈ సమస్యను పరిష్కరించాలని వినియోగదారులు కోరుతున్నారు.

ప్రభుత్వ ఆస్పత్రులపై నమ్మకం కలిగించాలి



రోగులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే విజయశ్రీ

సూళ్లూరుపేట, జూలై 8: ప్రభుత్వ ఆస్పత్రులపై ప్రజలకు నమ్మకం ఏర్పడేలా వైద్యం అందించాలని ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ అన్నారు. సోమవారం ఆమె స్థానిక సామాజిక ఆరోగ్య కేంద్రాన్ని తనిఖీ చేశారు. వైద్య సేవలు సక్రమంగా అందుతున్నాయో లేదో రోగులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కార్పొరేట్‌కు దీటుగా మెరుగైన వైద్య సేవలు అందించేందుకు చొరవతీసుకుంటామన్నారు. టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, పట్టణ అధ్యక్షుడు ఆకుతోట రమేష్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవనాయుడు, బుజ్జిబాబు, ఆలీబాయ్, శశిధర్ తదిరులు పాల్గొన్నారు.

నేడు అధికారులతో ఎమ్మెల్యే సమీక్ష

పెళ్లకూరు, జూలై 8 : మండల అభివృద్ధిపై ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ మంగళవారం మండల స్థాయి అధికారులతో స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో సమీక్షా సమావేశం నిర్వహించనున్నారు. ఎంపీడీవో అన్నపూర్ణరావు సోమవారం ఈ విషయం తెలిపారు. మండలంలో చేపట్టాల్సిన అబివృద్ధి పనులతో పాటు సంక్షేమ పథకాల అమలుపై ఆయన చర్చించనున్నట్లు ఎంపీడీవో పేర్కొన్నారు.

దుకాణాలపై విజిలెన్స్ దాడులు



ఎరువుల దుకాణం తనిఖీ చేస్తున్న విజిలెన్స్ అధికారులు

నాయుడుపేట, జూలై 8 : నాయుడుపేటలోని ఎరువులు, పురుగుమందులు, విత్తనాల దుకాణాలపై విజిలెన్స్ అధికారులు సోమవారం దాడులు నిర్వహించారు. వ్యవసాయ శాఖ, నిఘా విభాగం అధికారులు దాడుల్లో పాల్గొన్నారు. వ్యవసాయశాఖ ఏడీఏ ఎల్లప్ప మాట్లాడుతూ లైసెన్స్ దారులందరూ స్టాక్ రిజిస్టార్, బిల్లు పుస్తకాలు క్రమం తప్పకుండా పాటించాలన్నారు. నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందుబాటులో ఉంచాలన్నారు. ఎంఆర్‌పీకి మించి ఒక్కరూపాయి కూడా అదనంగా వసూలు చేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. విజిలెన్స్ ఎస్ఐ జీవానందం, ఏడీఏ ధనంజయరెడ్డి, ఏవో గణేష్, సిబ్బంది పాల్గొన్నారు.

నిరంతరాయంగా ఇసుక ఉచిత సరఫరా

వెంకటగిరి, జూలై 8 : ఇసుక ఉచితంగా నిరంతరాయంగా అందజేస్తామని మ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ తెలిపారు. ఆంధ్రజ్యోతితో మాట్లాడుతూ ఇచ్చిన మాట ప్రకారం ఇసుక సరఫరా మొదలు కావడంతో ప్రజలు ఆనందం వ్యక్తం చేస్తున్నారన్నారు. గత ప్రభుత్వంలో ఇసుక సామాన్యుడికి అందుబాటులో లేదన్నారు. వైసీపీ పెద్దలు దోపిడీ చేయడం వల్ల ఇసుక దొరక్క భవనిర్మాణ కార్మికులు వలస బాటపట్టారన్నారు. ఇప్పుడు భవన నిర్మాణ రంగానికి పూర్వ వైభవం వస్తుందన్నారు. రీచ్‌లతోపాటు, అనువుగా వుండేలా డంపింగ్ యార్డులు ఏర్పాటు చేస్తామన్నారు.

తాగునీటి సమస్య పరిష్కరించాలి

గూడూరు, జూలై 8: పలు గ్రామాల్లో తాగునీటి సరఫరా సమస్యను పరిష్కరించాలని ఉమ్మడి నెల్లూరు జిల్లా జనసేన పార్టీ ఉపాధ్యక్షుడు తీగల చంద్రశేఖర్ సోమవారం ప్రజావిజ్ఞప్తుల వేదికలో ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్‌కు విన్నవించారు. మంచినీటికి బదులుగా ఉప్పునీరు సరఫరా అవుతోందన్నారు. చిట్టమూరు మండలం మల్లాంలో తాగునీరు సక్రమంగా సరఫరా కావడంలేదన్నారు.

విద్యార్థులకు నోటు పుస్తకాల పంపిణీ



పుస్తకాలు అందజేస్తున్న పిచ్చయ్యనాయుడు

చిల్లకూరు, జూలై 8: చేడిమాల, గిరిజనకాలనీ, నల్లయ్యగారిపాళెంలోని ప్రాథమిక పాఠశాలల్లోని విద్యార్థులకు సోమవారం రాజనేని రామానాయుడు చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నోటుపుస్తకాలు పంపిణీ చేశారు. విద్యార్థులు కష్టపడి చదవి ఉన్నతస్థాయి చేరుకోవాలని ట్రస్ట్ అధ్యక్షుడు పిచ్చయ్యనాయుడు ఈసందర్భంగా ఆకాంక్షించారు. కార్యక్రమంలో హెచ్ఎం శ్రీనివాసులు, బాబు, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్యశాఖ మంత్రిని కలిసిన గిరిజన నాయకులు

వెంకటగిరిటౌన్, జూలై 8: వెలగపూడి సచివాయం వద్ద ఏపీ ప్రజాసంఘాల ఐక్యవేదిక అధ్యక్షుడు గద్దల మున్నెయ్యతోపాటు గిరిజన నాయకులు సోమవారం వైద్య, ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్‌యాదవ్‌ను కలిసి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధిగ్రస్థుల కోసం డయాలసిస్ కేంద్రాన్ని ఏర్పాటు చేయాలని వారు కోరారు. గోషాసుపత్రిని వంద పడకలుగా విస్తరించాలని, మెరుగైన వైద్యసేవలు అందించాలని కోరామని నాయకులు తెలిపారు.

10న ఎమ్మెల్యే పాశం విజయోత్సవ ర్యాలీ

చిట్టమూరు, జులై 8 : చిట్టమూరులో ఈ నెల 10న ఎమ్మెల్యే పాశం సునీల్‌కుమార్ విజయోత్సవ ర్యాలీ నిర్వహిస్తున్నట్లు టీడీపీ మండల కన్వీనర్ గణపర్తి కిషోర్‌నాయుడు తెలిపారు. సోమవారం ఆయన విలేకర్లతో మాట్లాడారు. బుధవారం ఉదయం గణపర్తి అన్నయ్య నాయుడు పార్క్ నుంచి ఎమ్మెల్యే ఊరేగింపుగా చిట్టమూరుకు చేరుకుంటారన్నారు. పార్టీ కార్యాలయం ప్రారంభోత్సవం, పతాకావిష్కరణ, ప్రభుత్వ కార్యాలయాల ఆవరణలో ఎన్టీఆర్ విగ్రహ శంకుస్థాపన, రైతు సేవాకేంద్రం భవనం, పార్టీ కార్యాలయంలో ఎన్టీఆర్ విగ్రహ ప్రారంభోత్సవాల్లో ఆయన పాల్గొంటారన్నారు. టీడీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానులు, ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని ర్యాలీని జయప్రదం చేయాలని కోరారు.

కొత్తగుంటలో కోళ్ల వ్యర్థాల తొలగింపు

● ఆంధ్రజ్యోతి వార్తకు స్పందన



చిట్టమూరు, జులై 8 : కొత్తగుంటలో రోడ్డుకిరువైపుల పడేసిన కోళ్ళ వ్యర్థాలను బుధవారం అధికారులు తొలగించేందుకు శ్రీకారం చుట్టారు. ఆంధ్రజ్యోతిలో బుధవారం కొత్తగుంటను కమ్మేస్తోన్న కాలుష్యం శీర్షికన ప్రచురతమైన వార్తకు మండల అధికారులు, పంచాయతీ పాలక వర్గం స్పందించారు. ఈవోపీఆర్‌డీ మనోహర్‌గౌడ్, సర్పంచ్ ఈదూరు కోటయ్య, పంచాయతీ కార్యదర్శి వెంకటేశ్వర్లు కొత్తగుంట పరిశర ప్రాంతాల్లో రోడ్డుకు ఇరువైపులా పడేసిన కోళ్ళ వ్యర్థాలను పరిశీలించారు. ఎక్స్‌కవేటర్ ద్వారా వాటిన గ్రామానికి దూరంగా ట్రాక్టర్ల ద్వారా తరలించారు. వ్యర్థాలను రోడ్డు పక్కన పడేస్తే చర్యలు తీసుకుంటామని మనోహర్ గౌడ్ హెచ్చరించారు.

హెల్మెట్ ధరించి ప్రాణాలు కాపాడుకోండి

కోట, జూలై 8 : వాహనచోదకులు హెల్మెట్ తప్పని సరిగా ధరించి ప్రాణాలు కాపాడుకోవాలని పోలీసులు కోరారు. పట్టణ పరిధిలోని క్రాస్‌రోడ్డులో సోమవారం హెల్మెట్ ధారణపై ఎఎస్ఐ శోభారాణి, హెడ్‌కానిస్టేబుల్ బీ. కృష్ణమూర్తి ఆధ్వర్యంలో అవగాహన నిర్వహించారు. కోట నుంచి వాకాడు వైపు నాయుడుపేట, గూడూరు వైపు వెళ్లే వాహనచోదకులతో వారు మాట్లాడారు. హెల్మెట్ ధరించకపోతే జరిగే నష్టాలను వివరించారు. ప్రయోగాత్మకంగా రోడ్డు ప్రమాదాలపై అవగాహక కల్పించారు.

రూ. 2.79 లక్షల ఎరువుల సీజ్



పురుగుమందుల షాపును తనిఖీ చేస్తున్న ఏడీఏ నాగార్జునసాగర్

వెంకటగిరిటౌన్, జూలై 8: పట్టణంలోని ఎరువులు, పురుగుమందుల దుకాణాలపై ఏడీఏ నాగార్జునసాగర్, ఏవో సుజాత సోమవారం దాడులు నిర్వహించారు. రూ. 2.79లక్షల సరుకును సీజ్ చేశారు. ఏడీఏ మాట్లాడుతూ గోకులకృష్ణ ట్రేడర్స్, వెంకటేశ్వర ఫర్టిలైజర్స్‌లలో 12.8 మెట్రిక్ టన్నుల ఎరువులను సీజ్ చేశామన్నారు. రైతులకు నాణ్యమైన ఎరువులను పంపిణీ చేయాలన్నారు. లైసెన్స్ లేకుండా విక్రయిస్తే డీలర్ లైసెన్స్ రద్దు చేస్తామన్నారు. కొనుగోలు చేసిన సరకులకు బిల్లులు ఇవ్వాలన్నారు.

శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద ఫ్లై ఓవర్ నిర్మాణం



రహదారిని పరిశీలిస్తున్న జాతీయ రహదారి అధికారులు

తడ, జూలై 8 : శ్రీసిటీ జీరో పాయింట్ వద్ద ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రతిపాదనలు సిద్ధం చేస్తున్నామని జాతీయ రహదారి సైట్ ఇంజనీర్ల బృందం తెలిపింది. తడలో ప్రమాదాలకు కారణమయ్యే బ్లాక్ స్పాట్‌లను సోమవారం ఈ బృందం పరిశీలించింది. శ్రీసిటీ జీరోపాయింట్ బోడిలింగాలపాడు మలుపును పరిశీలించి ప్రత్యామ్నాయ మార్గాలపై వివరాలు అడిగి తెలుసుకుంది. ఈ సందర్భంగా బృంద సభ్యులు మాట్లాడుతూ శ్రీసిటీ జీరోపాయింట్‌కు ఇరువైపులా కిలోమీటరు దూరంతో నాలుగు లేన్ల ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి ప్రభుత్వం అంగీకారం తెలిపిందన్నారు. బృందంలో సైట్ ఇంజనీర్లు రోహిత్, మహేష్, కేశవరెడ్డి, తడ, తడకండ్రిగ సర్పంచులు ఆర్మ్యాగం, శశికుమార్, పంచాయతీ కార్యదర్శులు గాబ్రియల్, మస్తాన్, తదితరులు ఉన్నారు.

గిరిజనుడి కుటుంబానికి ఎమ్మెల్యే సాయం



కోట, జూలై 8 : స్థానిక శ్రీలక్ష్మమ్మ కాలనీలో మృతిచెందిన తుపాకుల పాపయ్య అనే గిరిజనుడి కుటుంబ సభ్యులకు ఎమ్మెల్యే పాశిం డాక్టర్ సునీల్‌కుమార్ రూ.10వేలు అందజేశారు. మాజీ ఎంపీపీ మానికల పవన్ రూ.3వేలు, పట్టణ టీడీపీ తరఫున రూ. 2వేలు అందజేశారు. టీడీపీ మైనార్టీసెల్ జిల్లా అధ్యక్షుడు జలీల్ అహ్మద్, ఎంపీటీసీ షంషుద్దీన్, నాయకులు కిరణ్, నౌషాద్, పోలమ్మ, నాయబ్, సురేష్, బాబు, సుహాసిని తదితరులు ఉన్నారు.

నిత్యావసర సరుకుల పంపిణీ

వాకాడు, జూలై 8 : మండల టీడీపీ అధ్యక్షుడు దువ్వూరు మధుసూదన్‌రెడ్డి జన్మదినం సందర్భంగా వాకాడులోని రెడ్డివానితిప్ప గిరిజన కాలనీలో నిత్యావసర సరుకులను, పేద విద్యార్థినికి కాలేజీ ఫీజును టీడీపీ నియోజకవర్గ అధికార ప్రతినిధి తిరుమలశెట్టి కోటేశ్వరరావు ఆధ్వర్యంలో సోమవారం అందజేశారు. కేక్‌ను కట్‌చేసి పలువురు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. జన్మదినం శుభాకాంక్షలు తెలిపిన వారిలో షేక్ రహంతుల్లా, చిరంజీవమ్మ, మల్లాపు నాగరాజు, బాలిరెడ్డి శ్రీనివాసులురెడ్డి, తీపలపూడి అన్వేష్, మదార్‌సాహెబ్ తదితరులు ఉన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు

తిరుమల, జూలై 8 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వర స్వామి హుండీ ఆదాయం రూ.3.83 కోట్లు లభించింది. శనివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ ఆదివారం లెక్కించి, సోమవారం ఉదయం ప్రకటించింది. ఆదివారం 78,912 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకోగా, 32,039 మంది తలనీలాలు సమర్పించారు.

పేదలకు నేటి నుంచి ఉచిత ఇసుక సరఫరా

● ఉత్తర్వుల విడుదలలో తొలిరోజు ఆలస్యం



డిపో వద్ద ఇసుక ట్రాక్టర్లు

దొరవారిసత్రం, జూలై 8: స్థానిక నేతాజీ నగర్ ఇసుక డిపోలో సోమవారం ఇసుక ఉచిత సరఫరా వాయిదా పడింది. మైనింగ్ శాఖ అధికారుల అంచనాల ప్రకారం 21,400 మెట్రిక్ టన్నుల ఇసుక ఈ డిపో నుంచి సరఫరాకు వీలుంది. ఈమేరకు ప్రజలకు సమాచారం అందింది. దీంతో ఉదయం నుంచే వివిధ ప్రాంతాల నుంచి వాహనాలతో ఇసుక డిపో వద్ద బారులు తీరారు. మైనింగ్ శాఖ ఆర్ఐ మురళి, ఇన్‌చార్జి తహసీల్దార్ గోపినాథ్ రెడ్డి, ఇసుక సరఫరాకు ఏర్పాట్లు చేశారు. అయితే ప్రభుత్వం నుంచి జీవో విడుదల కాలేదంటూ మధ్యాహ్నం 3 గంటల వరకు సరఫరా చేయలేదు. తరువాత జీవో విడుదలైనా ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇసుక సరఫరా చేయలేదని సాయంత్రం 5 గంటలకు అధికారులు తెలియజేశారు. సాంకేతిక లోపాలను సరిదిద్ది మంగళవారం నుంచి సరఫరా చేస్తామన్నారు.

తాజా నిర్ణయంతో మేలు



కొత్త ప్రభుత్వ ఇసుక పాలసీతో డిపోలో టన్నుకు వివిధ ఛార్జీలు రూ.465 నిర్ణయించడంతో ట్రాక్టరుకు గతం కంటే రూ.వెయ్యి తగ్గింది. వైసీపీ ప్రభుత్వంలో రూ.670 టన్ను ధర ఉండేది. తాజా నిర్ణయం వల్ల లబ్ధిదారులకు ఎంతో ఉపయోగం.

-నంచి సురేష్ మావిళ్లపాడు

పేదలకు ఎంతో ఉపయోగకరం



ఇసుక అందిస్తామని చెప్పడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎదురుచేశాం. అధికారుల వద్ద సరైన సమాచారం లేకపోవడంతో రోజంతా ట్రాక్టర్ల డ్రైవర్లు ఇబ్బందులు పడ్డారు. తగ్గిన ధరల వల్ల పేదవారికి ఎంతో ఉపయోగకరం.

-పాపారెడ్డి ధనుంజయ రెడ్డి వీఎస్ఆర్ నగర్

ఆక్రమణ తొలగింపుపై మాజీ ఎమ్మెల్యే రుసరుస



ఉద్యోగితో సంజీవయ్య వాగ్వాదం

నాయుడుపేట టౌన్, జూలై 8 : ఆక్రమణల తొలగింపుపై మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. నాయుడుపేట పాతబస్టాండ్ నుంచి ఎల్ఐసీ రహదారి మధ్యలో రైల్వే ప్రహరీకి ఆనుకొని ఉన్న నేషనల్ హైవేకి సంబంధించిన స్థలంలో గత నెల రోజుల్లో ఆక్రమణదారులు తాత్కాలిక షెడ్లను ఏర్పాటు చేశారు.దీనిపై నేషనల్ హైవే అధికారులకు ఫిర్యాదులు అందాయి. దీంతో ఆశాఖ జేఈ వెంకటేశ్వర్లు సోమవారం మున్సిపల్ ఉద్యోగులు, పోలీసుల సహాయంతో ఎక్స్‌కవేటర్ ద్వారా ఎల్ఐసీకార్యాలయం సమీపం నుంచి ఆక్రమణలు తొలగింపు ప్రారంభించారు. అదే సమయంలో మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య అనుచరులతో ర్యాలీగా వెళ్తున్నారు. నిర్మాణ స్థలం వద్ద ఆగి ఎవరి అనుమతితో ఇక్కడ ఆక్రమణలు తొలగిస్తున్నారంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. తమపై అధికారులు కొంత ప్రాంతం మేర ఆక్రమణలు తొలగించాలని ఆదేశాలు ఇచ్చినట్లు నేషనల్ హైవే ఉద్యోగి చెప్పారు. వాటి పత్రాలను చూపించారు. పాత బస్టాండ్ నుంచి ఆక్రమణలు తొలగించాకే ఇక్కడ తొలగించాలంటూ సంజీవయ్య అక్కడ పనిచేస్తున్న ఎక్స్‌కవేటర్‌ను తిప్పి పంపివేశారు. అక్కడ కాస్సేపు స్వల్ప ఉద్రిక్తత పరిస్థితి నెలకొంది.

త్వరితగతిన ప్రజా సమస్యల పరిష్కారం:పాశిం



అర్జీలను పరిశీలిస్తున్న ఎమ్మెల్యే సునీల్‌కుమార్

గూడూరు అర్బన్, జూలై 8: త్వరితగతిన ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. సోమవారం స్థానిక సబ్‌కలెక్టర్ కార్యాలయం ఆవరణలో ప్రజావిజ్ఞప్తుల దినం కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. అధిక సంఖ్యలో ప్రజలు తమ సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువచ్చారు. ఎమ్మెల్యే అర్జీలను స్వీకరించి అప్పటికప్పుడే సంబంధిత అధికారికి ఇచ్చి పరిష్కరించాలని సూచించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం ప్రజా సమస్యల పరిష్కారానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. అధికారులు కూడా ఇందుకు సహకరించాలన్నారు. టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ, ఆర్డీవో కిరణ్‌కుమార్, పులిమి శ్రీనివాసులు, వెంకటేశ్వర్లురాజు, ఉచ్చూరు వెంకటేశ్వర్లురెడ్డి, అబ్దుల్ రహీం, నాగరాజు, పలుశాఖల అధికారులు, ప్రజలు తదితరులు పాల్గొన్నారు.

పీఎం కిసాన్ పథకంపై విస్తృత ప్రచారం



అవగాహన కల్పిస్తున్న నిరంజన్‌కుమార్

కోట, జూలై 8 : ప్రధానమంత్రి కిసాన్ పథకంపై గ్రామాల్లో విస్తృత ప్రచారం నిర్వహించాలని మండల వ్యవసాయ అధికారి నిరంజన్‌కుమార్ కోరారు. స్థానిక వ్యవసాయ కార్యాలయంలో సోమవారం ఈ పథకంపై సహాయ వ్యవసాయ అధికారులకు ఒక్కరోజుపాటు శిక్షణ నిర్వహించారు. అర్హులైన రైతులు చిన్న చిన్న పొరపాట్ల వల్ల ఈ పథకం కింద లబ్ధిపొందలేకపోతున్నామన్నారు. పొరపాట్లను సరిదిద్దాలన్నారు. డెల్టా, నాన్‌డెల్టా గ్రామాల్లో మట్టి నమూనాలు సేకరించాలన్నారు. రైతులు అవగాహన కల్పించాలన్నారు.

రాష్ట్రస్థాయి తైక్వాండో పోటీలకు ఇద్దరు విద్యార్థుల ఎంపిక

సూళ్లూరుపేట, జూలై 8: జిల్లా స్థాయి తైక్వాండ పోటీల్లో ప్రతిభ కనబరిచి రాష్ట్ర స్థాయి పోటీలకు సూళ్లూరుపేట టైనీటాట్స్ సీబీఎస్ఈ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు ఎంపికయ్యారు. నెల్లూరు జిల్లా తైక్వాండో అసోసియేషన్ కోశాధికారి పవన్‌కుమార్ ఈ విషయం తెలిపారు. జిల్లాలో జరిగిన తైక్వాండో పోటీలో క్యారెట్ విభాగంలో దేవిశ్రీ, లిఖిత కుమారి ప్రథమ స్థానంలో నిలిచి రాష్ట్ర స్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ ఇద్దరూ అనంతపురంలో ఆగస్టు మొదటి వారంలో జరిగే రాష్ట్ర పోటీల్లో పాల్గొననున్నారు. విద్యార్థులను జిల్లా తైక్వాండో అసోసియేషన్ కార్యదర్శి శ్రీనివాసులు, పాఠశాల కరస్పాండెంట్ వేనాటి ధనుంజయ రెడ్డి అభినందించారు.

డొంక పొరంబోకు ఆక్రమణపై ఫిర్యాదు

సూళ్లూరుపేట, జూలై 8: కోటపోలూరులోని బృందావనం లేఅవుట్‌లో డొంకపొరంబోకును ఆక్రమించుకున్న వారిపై చర్యలు తీసుకోవాలని టీడీపీ మహిళా నాయకురాలు ఇసనాక వాణి కోరారు. సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదికలో తహశీల్దార్ కేవీ గోపాలకృష్ణకు ఆమె ఈమేరకు వినతిపత్రం అందజేశారు. నాలుగు అర్జీలు అందినట్లు తహశీల్దార్ తెలిపారు.

మా కడుపు కొట్టవద్దు...

● మెకానిక్ యూనియన్ నేత ఆలీ వినతి



మెకానిక్ యూనియన్ నాయకులు

నాయుడుపేట టౌన్, జూలై 8 : తమ కడుపు కొట్టవద్దని మెకానిక్ యూనియన్ నాయకులు ఆలీ ఆవేదన వ్యక్తం చేశారు. రైల్వే స్టేషన్ సమీపంలోని సోమవారం సాయంత్రం విలేకర్ల సమావేశంలో మెకానిక్ కార్మికులతో కలసి ఆయన మాట్లాడారు. 50 సంవత్సరాలుగా పాత బస్టాండ్ నుంచి ఐసీఐసీ బ్యాంక్ వరకు ఉన్న స్థలంలో మెకానిక్ పనులు చేసుకొని జీవనం సాగిస్తున్నామన్నారు. ఎమ్మెల్యే డాక్టర్ నెలవల విజయశ్రీ త్వరలోనే తమ అభివృద్ధి కోసం ప్రత్యేక చర్యలు చేపడుతున్నట్లు తెలిపారు. అయితే మాజీ ఎమ్మెల్యే సంజీవయ్య నేషనల్ హైవే అధికారులతో పాత బస్టాండ్ నుంచి ఆక్రమణలు తొలగించాలనడం సబబుకాదన్నారు. గతంలో ఆయన ఆటో స్టాండ్ నిర్మిస్తామని మాట నిలబెట్టుకోలేదన్నారు.

నేను బడికిపోతా ర్యాలీ



కోట, జూలై 8 : స్థానిక జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థినుల ఆధ్వర్యంలో సోమవారం నేను బడికిపోతా కార్యక్రమంపై అవగాహన ర్యాలీ జరిగింది. మండల విద్యాశాఖాధికారి దారా మస్తానయ్య పర్యవేక్షణలో హెచ్ఎం, ఉపాధ్యాయులు, విద్యార్థినులు ప్లకార్డులు పట్టుకొని బడిఈడు కలిగిన పిల్లలు బడిలోనే ఉండాలంటూ ర్యాలీ నిర్వహించారు. బాలిక విద్యను ప్రోత్సహించాలంటూ తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు.

అడుగంటుతున్న జలాలతో అన్నదాత కలవరం



నీరు రాని మోటారు

కోట, జూలై 8: నేలబావుల్లో నీరు అడుగంటుతుండడంతో మెట్ట రైతులు ఆందోళన చెందుతున్నారు. మండలంలోని 11 పంచాయతీల్లోని మెట్ట గ్రామాల్లో నేల బావుల ఆధారంగా సాగు చేస్తుంటారు. డెల్టా రైతులకు దీటుగా కొన్ని పర్యాయాలు వరి రెండుకార్లు పండిస్తారు. ఈ ఏడాది కూడా తక్కువ పెట్టుబడులతో తక్కువ కాలంలో పంట చేతికి అందే 1010 రకం వరి సాగు చేశారు. పంట చివరితడి వచ్చేసరికి నీరు అడుగంటుతుండడంపై రైతులు ఆందోళన చెందుతున్నారు. ఏటా మెట్ట గ్రామ్లాలోని 33 చెరువులకు గంగ 5వ బ్రాంచ్ కెనాల్ నుంచి తెలుగుగంగ వదులుతారు. ఈ ఏడాది 4 చెరువులకు మాత్రమే వదలడంతో కొన్ని ఎండిపోయాయి. పదును వర్షం కూడా కురవక పోవడంతో ఆశలు వదులుకున్నారు.

బాధితులందరికీ న్యాయం: కలెక్టర్

తిరుపతి(కలెక్టరేట్), జూలై 8: బాధితులందరికీ న్యాయం జరగాలని అధికారులను కలెక్టర్ వెంకటేశ్వర్ ఆదేశించారు. కలెక్టరేట్‌లో సోమవారం జరిగిన ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పీజీఆర్ఎస్)కు జిల్లా నలుమూలల నుంచి 115 అర్జీలు అందాయి. వీటిల్లో భూ సమస్యలపైనే 57 ఉన్నాయి. కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రతి అర్జీపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. నిర్లక్ష్యం వహిస్తే సంబంధిత అధికారిపై చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సందర్భంగా వీల్‌చైర్‌లో వచ్చిన అర్జీదారుల వద్దకే కలెక్టర్ స్వయంగా వెళ్లి సమస్యను తెలుసుకున్నారు. డీఆర్వో పెంచలకిషోర్‌తో పాటు ఎస్‌డీసీలు కోదండరామిరెడ్డి తదితరులు అర్జీలు స్వీకరించారు.

వైఎస్ రాజశేఖర్‌రెడ్డికి నాయకుల ఘన నివాళి





పెళ్లకూరులో అన్నదానం చేస్తున్న సంజీవయ్య- రాజశేఖర్‌రెడ్డి విగ్రహానికి నివాళులర్పిస్తున్న రాంకుమార్‌రెడ్డి

పెళ్లకూరు, జూలై 8 : వైఎస్ రాజశేఖర్‌రెడ్డి జయంతి సందర్భంగా సోమవారం మండలంలో ఆయన విగ్రహాలకు పూలమాల వేసి నివాళులర్పించారు. పెళ్లకూరులో మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య నివాళులర్పించారు. పేదలకు అన్నదానం చేశారు. **వెంకటగిరిటౌన్:** ఎస్‌జేఆర్ భవన్‌లో వైఎస్సార్ విగ్రహానికి వైసీపీ జిల్లా అధ్యక్షుడు నేదుమల్లి రాంకుమార్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. **కోట** : గూడలిలో వైసీపీ నాయకులు హేమారెడ్డి షనిల్‌రెడ్డి, పల్లెమల్లు విజయసారథిరెడ్డి, వరదారెడ్డి, లొక్కు కృష్ణారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. **సూళ్లూరుపేట:** ఎంపీపీ అల్లూరు అనిల్ రెడ్డి ఆధ్వర్యంలో ఆర్టీసీ బస్టాండు వద్ద వైఎస్సార్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. **వాకాడు** : కొడవలూరులో భక్తవత్సల్‌రెడ్డి ఆధ్వర్యంలో నాయకులు, కార్యకర్తలు కేక్‌ను కట్‌చేసి సంబరాలు నిర్వహించారు. వైసీపీ నాయకులు కలసి వైఎస్ఆర్ విగ్రహానికి పూలమాలలు వేసి వైఎస్ఆర్ గురించి మాట్లాడారు. ఈ కార్యక్రమంలో దువ్వూరు అజిత్‌కుమార్‌రెడ్డి, పాపారెడ్డి రాజశేఖర్‌రెడ్డి, ఏనుగు సుధాకర్‌నాయుడు, బాబురెడ్డి, తదితరులు ఉన్నారు. **గూడూరు:** స్థానిక బనిగీసాహెబ్‌పేటలో ఎమ్మెల్సీ మేరగ మురళీధర్‌రావు ఆధ్వర్యంలో రాజశేఖర్‌రెడ్డి వైఎస్సార్ విగ్రహానికి పూలవేసి నివాళులర్పించారు. కేక్ కట్‌చేశారు. ఆసుపత్రిలో రోగులకు పండ్లు పంపిణీ చేశారు.

రోడ్లపై మూగజీవాలతో ట్రాఫిక్ చిక్కులు



సూళ్లూరుపేట, జూలై 8: పట్టణంలో పశువుల బెడద రోజురోజుకూ ఎక్కువ అవుతోంది. యజమానులు వాటిని సంరక్షించకుండా రోడ్ల పైకి వదిలేస్తున్నారు. బజారు వీధులు, జనసంచారం ఎక్కువగా ఉన్న ప్రాంతాల్లో ఇవి వాహనాలకు అడ్డురావడంతో చోదకులు ప్రమాదాలకు గురవుతున్నారు. ప్రధాన కూడళ్లలో ఉదయం వేళ విద్యార్థులు, ఉద్యోగులు, కార్మికులకు పశువులతో ఇబ్బందులు పడుతున్నారు. తరచూ ట్రాఫిక్‌కు అంతరాయం కలిగిస్తున్నాయి. మార్కెట్ సెంటర్, పార్కువీధిలో ప్రధాన వ్యాపార కూడలి కావడంతో ఉదయం, సాయంత్రం వేళల్లో రద్దీ ఎక్కువగా ఉంటుంది. ఆవుల బెడదతో కొత్త ట్రాఫిక్ చిక్కులు ఏర్పడుతున్నాయి. వినియోగదారులు, పాదచారులపై కొన్ని సందర్భాల్లో దాడి చేస్తున్నాయి. పశువుల యజమానులకు మున్సిపాలిటీ అధికారులు నోటీసులిచ్చి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.